ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

23-8-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 204 పేజీలు: 10+4 వెల: 8.00



రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ షట్‌డౌన్ 3

మరో 2 వారాల్లో జిన్‌పింగ్ అమెరికా పర్యటన 5




లండన్‌లో కేంబ్రిడ్జి వర్సిటీ ప్రతినిధులతో సిఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు

### సెనెట్ హౌస్ రౌండ్ టేబుల్ సమావేశంలో సిఎం రేవంత్

### కేంబ్రిడ్జి వర్సిటీ ప్రతినిధి బృందంతో భేటీ

### వివిధ రంగాల్లో పరిశోధనలకు ఉమ్మడి కార్యాచరణ.. తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపు

# హైదరాబాద్‌లో లండన్ వర్సిటీ క్యాంపస్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు22:** హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు లండన్ యూనివర్సిటీ కృషి చేస్తోందని ఆ సంస్థ ప్రతినిధులు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి తెలిపారు. ఈ మేరకు లండన్ యూనివర్సిటీ సెనేట్ హౌస్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయం అయింది. లండన్ యూనివర్సిటీలోని సెనేట్ హౌస్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ అధికారులు కె. రామకృష్ణారావు, జయేశ్ రంజన్‌లు పాల్గొన్నారు. లండన్ యూనివర్సిటీ ప్రతినిధులతో వారు సుదీర్ఘంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్ (ఎల్ఎస్ఈ), స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ (ఎస్ఓఏఎస్)కు చెందిన ప్రతినిధి బృందాలు, ఇతర ప్రతినిధులు కూడా ఉన్నారు. హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు లండన్ >>2



గచ్చిబౌలిలో కూలిన భవనం

## కుప్పకూలిన 7 అంతస్తుల భవనం

### ఇద్దరు కార్మికులు మృతి

### హైదరాబాద్ గచ్చిబౌలిలో విషాదం

2

# మంత్రి సురేఖపై చర్యలు ఎప్పుడో చెప్పలేం..

### సుస్మిత వ్యాఖ్యలు ఖండించే బాధ్యత సురేఖదే

### చిన్నారెడ్డి విషయం పరిశీలిస్తున్నాం..

### రాజగోపాల్‌రెడ్డిపై ఎలాంటి ఫిర్యాదులు లేవు

### క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి




శనివారం గాంధీభవన్‌లో మీడియాతో క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి

**హైదరాబాద్,ఆగస్టు 22,ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కొండసుస్మిత చేసిన అనుచిత వ్యాఖ్యలు ఖండించాల్సిన బాధ్యత కొండా సురేఖదే అని ఆమె సహజన్యాయ సూత్రాలు అంటూ ఇచ్చిన వివరణలో కనీసం పశ్చాత్తపం ప్రకటించాల్సి ఉండాల్సిందని టిపిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్, నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి అన్నారు. శనివారం గాంధీభవన్‌లో >>2

# విచారణ జరపండి

### 22ఎ, భూభారతిపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు22:** గత బీఆర్ఎస్ పాలనలో ధరణి ద్వారా జరిగిన భూ అక్రమాలను సముద్రంలో పడేస్తామని చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడు భూభారతి పేరుతో అంతకంటే తీవ్రమైన దోపిడీకి పాల్పడుతోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. "పీనుగలు తినేవాడు పోయి ఏనుగులు తినేవాడు వచ్చినట్లు" పరిస్థితి తయారైందన్నారు. కేవలం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనే సుమారు 4 లక్షల ఎకరాల భూములను రాత్రికి రాత్రే అక్రమంగా 22ఏ (నిషేధిత జాబితా) లోకి చేర్చారని మండిపడ్డారు. ప్రభుత్వ, దేవాదాయ భూములు మాత్రమే ఉండాల్సిన 22ఎ లోకి దశాబ్దాలుగా మున్సిపల్ అనుమతులు పొంది, పన్నులు కడుతూ నివాసముంటున్న ప్రైవేటు ఇళ్లు, స్థలాలను ఉద్దేశపూర్వకంగా చేర్చి సెటిల్‌మెంట్ల పేరిట 50 వాటాలు, భారీగా లంచాలు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. శనివారం ఆయన బిజెపి రాష్ట్ర కార్యాలయంలో >>2

# తీరు మారని అధికారులపై చర్యలు

### పేదల సొంతింటి కల సాకారం: మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు22:** రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వేను వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఏడాదిన్నర లోపు వ్యవసాయ భూములతోపాటు ఆబాదీ ఆస్తుల రీసర్వే పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. శనివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నాగారంలోని నిర్మితి కేంద్రంలో ఇందిరమ్మ హౌసింగ్ టవర్స్ కోసం స్థలాన్ని పరిశీలించారు. అలాగే పాముల >>2



నిజామాబాద్‌లో అధికారులతో మంత్రి పొంగులేటి

## రూ.7 వేల కోట్లతో ఎల్‌పిజి పైప్‌లైన్

### తెలంగాణకు అనుసంధానం

### చర్లపల్లి నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ వరకు 556 కి.మీ పైప్‌లైన్ నిర్మాణం

### మొత్తం 1800 కి.మీ మేర ఏర్పాటు

7






లండన్‌లోని అంబేద్కర్ హౌస్‌లో పేపర్ చదువుతున్న సిఎం రేవంత్

# లండన్‌లో అంబేద్కర్ హౌస్‌ను సందర్శించిన సిఎం రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు22:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి లండన్‌లోని ప్రసిద్ధ అంబేద్కర్ హౌస్‌ను శనివారం సందర్శించారు. బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 1921 -22లో లండన్‌లోని ప్రిమ్‌రోజ్ ప్రాంతంలోని 10 కింగ్ హెన్రీస్ రోడ్‌లో నివసించిన ఇంటిని సీఎం సందర్శించారు. 'మహనీయులు డాక్టర్ అంబేద్కర్ హౌస్‌ను సందర్శించడం ఒక ఆధ్యాత్మిక క్షేత్రాన్ని సందర్శించడం లాంటిది. ఇది జీవితకాలపు స్ఫూర్తినిస్తుంది. సామాజిక న్యాయం కోసం అంకితభావంతో పనిచేయాలన్న నా ఆకాంక్ష మరింత పెరిగింది' అని సీఎం రేవంత్ రెడ్డి సందర్శకుల డైరీలో రాశారు. అంబేద్కర్ హౌస్‌ను ప్రస్తుతం డాక్టర్ అంబేద్కర్ ఆశయాలకు అంకితమైన మ్యూజియంగా ఏర్పాటు చేశారు. రాజ్యాంగబద్ధత, సమానత్వం, కులరహిత సమాజం, అణచివేత లేని సమాజం, సామాజిక న్యాయానికి అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వడం వంటి ఆయన సిద్ధాంతాలను ఈ మ్యూజియం ప్రతిబింబిస్తుంది. దాదాపు గంటపాటు సాగిన పర్యటనలో అంబేద్కర్ మ్యూజియం ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన యాంటీ కాస్ట్ డిస్క్రిమినేషన్ అలయన్స్ (ఏసిడిఏ) చైర్ సంతోష్ దాస్ ఎంబిఈ, యూకేలో బాబాసాహెబ్ జీవితానికి సంబంధించిన వివిధ అంశాలను ముఖ్యమంత్రికి వివరించారు. పర్యటన పూర్తయిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'నా జీవితంలో ఇది గొప్ప క్షణాల్లో ఒకటి. భారతీయుల్లో గొప్ప వ్యక్తుల్లో ఒకరైన డాక్టర్ అంబేద్కర్ జీవితంలోని వ్యక్తిగత కోణాన్ని చూసి, ఆయనతో ముడిపడిన వస్తువులను తాకగలగడం ఎంతో గొప్ప అనుభూతి' అని అన్నారు.

# చర్యలు ఎప్పుడో చెప్పలేం..

>> క్రమశిక్షణకమిటీ చైర్మన్ మల్లురవి,వైస్‌చైర్మన్ శ్యామ్‌మోహన్,సభ్యులు విలేఖరులతో మాట్లాడుతూ మూడు విషయాల మీద సుదీర్ఘంగా చర్చించామనీ అందులో ఒకటి కొండా సురేఖ, చిన్నారెడ్డి వ్యాఖ్యలు, ఆదిలాబాద్ పొలిటికల్ ఎఫైర్ కమిటీలో గొడవ అంశం అని ఆయన వివరించారు. క్రమశిక్షణ కమిటీ నోటీసులకు కొండా సురేఖ ఇచ్చిన రిప్లై చూసామనీ అదే విధంగా కొండా సుస్మిత మాట్లాడిన మాటలు వీడియో లు చూసామనీ తెలిపారు. ఆవీడియోలో సుస్మిత ముఖ్యమంత్రి ని మాములు వ్యక్తి గా అనుచిత వాఖ్యలు చేసిందనీ తెలిపారు. ఈ సంఘటనపై కొంతమంది ఎమ్మెల్యేలు క్రమశిక్షణ కమిటీ కి పిర్యాదు ఇచ్చారని, ఇంకొద మంది రిపోర్టు ఇస్తామని చెప్పారనీ అందరూ ఇచ్చిన ఫిర్యాదు లను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామనీ తెలిపారు.కొండా సురేఖ ఇచ్చిన వివరణ మీద ఇప్పుడు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సొంత కూతురు మాట్లాడిన మాటలు కనీసం మంత్రిగా ఖండించాలి అని ఆయన అభిప్రాయపడ్డారు. మంత్రి మాత్రం సహజ న్యాయ సూత్రాల ప్రకారం నాకు సంబంధం లేదని చెపుతున్నారని అన్నారు. ప్రభుత్వంపై ముఖ్యమంత్రిపై ఆమె కుమార్తె చేసిన వ్యాఖ్యలకు ఆమె బహిరంగా ఖండించాలని, కొండా సురేఖపై చర్యలు ఎప్పుడు తీసుకుంటామో ఇప్పుడు చెప్పలేము అని తెలిపారు.మాజీ ఎమ్మెల్యే చిన్నారెడ్డి మాట్లాడిన మాటల వీడియోలు కూడా మేం పరిశీలించామనీ తెలిపారు. చిన్నారెడ్డి మీద మెగా రెడ్డి ఫిర్యాదు చేసారని తెలిపారు.చిన్నారెడ్డి ఇచ్చిన వివరణ కూడా కమిటీ పరిశీలించండం జరిగిందనీ వివరించారు.చిన్నారెడ్డి మీద ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే మెగా రెడ్డిని మళ్ళీ పిలిచి వివరణ తీసుకుంటామనీ తెలిపారు. ఆదిలాబాద్ లో జరిగిన పొలిటికల్ ఎఫెక్స్ కమిటీ సమావేశంలో శ్రీనివాస్ రెడ్డి కి సంజీవ రెడ్డి కి జరిగిన వివాదం పై ఇప్పటికే షోకాజ్ నోటీసులు ఇచ్చాము.ఇంచార్జ్ మంత్రి ముందే గొడవ జరగడంతో జూపల్లి కృష్ణారావు దగ్గర కూడా వివరణ తీసుకున్నామనీ చెప్పారు. ఈ కేసులో కూడా త్వరలో నిర్ణయం తీసుకోవడం జరుగుతుందనీ అన్నారు. జక్కిడి ప్రభాకర్ రెడ్డి ని పార్టీ నుండి సస్పెండ్ చెయ్యడం జరిగగిందనీ ఆయన చరిత్రను కూడా వివరించారు. రాజగోపాల్ విషయం లో ఒక ప్రోసీజర్ ప్రకారం వెళ్తాము ఎందుకంటే రాజగోపాల్ రెడ్డి పై ఎలాంటి ఫిర్యాదు రాలేదని చెప్పారు. రాజగోపాల్‌రెడ్డి పై ఫిర్యాదు లేకపోవడంతో ఆయన అంశం సుమోటోగా తీసుకోవాలా లేదా అనేది పరిశీస్తున్నాం.

# అధికారులపై చర్యలు

>> బస్తీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులతో ముఖాముఖి నిర్వహించారు. ఆ తర్వాత డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారులకు ఇళ్ళ పట్టాలు అందజేశారు. అనంతరం కలెక్టరేట్‌లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల రెవెన్యూ, హౌసింగ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే శాఖల అధికారులతో మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజలను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తే మాత్రం ఎంతటివారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. పదేపదే సూచించినా పనితీరులో మార్పు రాని అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, సాదాబైనామా అర్జీల పరిష్కారంలో జాప్యం చేస్తున్న తహసీల్దార్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో నిరక్ష్యం వహిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పేదల సొంతింటి కలను సాకారం చేసి వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే ప్రజా ప్రభుత్వ సంకల్పమని అన్నారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా, పట్టణం, గ్రామం, గూడెం, తండా అనే తేడా లేకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని స్పష్టం చేశారు. పట్టణాలు, నగరాల్లో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదల కోసం హైదరాబాద్ తరహాలో రాష్ట్రంలోని ప్రముఖ పట్టణాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు.

## ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలి
### -సిఎం సలహాదారు రామకృష్ణారావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు22:** లండన్‌లోని ప్రతిష్ఠాత్మక ఇంపీరియల్ కాలేజీని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సీఎం సలహాదారు, ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు సందర్శించారు. ఈ సందర్భంగా ఇంపీరియల్ కాలేజీ అధ్యక్షుడి చీఫ్ ఆఫ్ స్టాఫ్, స్ట్రాటజిక్ ఎంగేజ్‌మెంట్ విభాగం వైస్ ప్రెసిడెంట్ అమాండా వోల్తుయిజెన్, దక్షిణాసియా, ఆస్ట్రలేషియా ప్రాంతాల సీనియర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ మేనేజర్ రొసాన్నా గిల్లెస్పీతో ఆయన సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర విశిష్టతను, విద్యా రంగంలో ఉన్న అవకాశాలను వారికి వివరించారు. తెలంగాణతో కలిసి పని చేసేందుకు ఉన్న సహకార అవకాశాలపై కూడా చర్చించారు. తెలంగాణ, హైదరాబాద్‌లో షార్ట్ టర్మ్ కోర్సులు, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తామని అమాండా తెలిపారు.

# హైదరాబాద్‌లో లండన్ వర్సిటీ క్యాంపస్

>> యూనివర్సిటీ కృషి చేస్తోందని ఆ సంస్థ ప్రతినిధులు ఈ సందర్భంగా వెల్లడించారు. యూనివర్సిటీకి చెందిన వివిధ స్కూళ్లు, విభాగాల ద్వారా విస్తృత స్థాయిలో విద్యా కోర్సులు, వివిధ విద్యా కార్యక్రమాలను అందించేలా ఈ క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్టు వివరించారు. లండన్ యూనివర్సిటీకి చెందిన వివిధ విద్యా విభాగాలను ఒకే అకడమిక్ ఫెడరేషన్‌గా అనుసంధానించే విధంగా ఈ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం శనివారం లండన్‌లోని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం విద్యావేత్తల బృందంతో ఫలప్రదమైన సమావేశం నిర్వహించింది. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ఈ బృందం కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రతినిధులతో తెలంగాణలో విద్యా, పరిశోధన రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై విస్తృతంగా చర్చించింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు, ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ పాల్గొన్నారు.

ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా సంస్థలకు హైదరాబాద్‌లో ఉన్న అవకాశాలను, కేంబ్రిడ్జ్ ప్రతినిధులకు వివరించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంలో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌లో భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని మార్కెటింగ్ చైర్ ప్రొఫెసర్ జైదీప్ ప్రభు, అదే సంస్థకు చెందిన ప్రొఫెసర్ వెంకట సిరీష్ గండికోట, 'ఫ్రూగల్ ఏఐ' కోచైర్ తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. తెలంగాణలో ఉన్న అవకాశాలపై వారు ప్రత్యేకంగా సానుకూలంగా స్పందించారు.

హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు నిర్వహించడం, సంయుక్తంగా పరిశోధనలు చేపట్టడం, యువ పారిశ్రామికవేత్తలకు అవసరమైన ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధికి సహకరించడం వంటి అంశాల్లో భాగస్వామ్యానికి ఒక స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ఇరు వర్గాలు అంగీకరించాయి.

ప్రపంచ ప్రఖ్యాత కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంతో తెలంగాణ భాగస్వామ్యానికి ఈ చర్చలు కొత్త మార్గం చూపనున్నాయి. హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్యా, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న తెలంగాణ రైజింగ్ లక్ష్యానికి ఈ సమావేశం మరింత బలం చేకూర్చనుంది. హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి విద్యాసంస్థలకు ఉన్న అవకాశాలను కేంబ్రిడ్జ్ బృందానికి వివరించారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే కార్యక్రమంలో అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు భాగస్వాములు కావాలని వారు కోరారు. హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు నిర్వహించడం, పరిశోధన, వ్యాపార ఆలోచనలకు ప్రోత్సాహం కల్పించడం, కొత్త స్టార్టప్‌లను అభివృద్ధి చేయడం వంటి అంశాల్లో తెలంగాణ, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ కలిసి పనిచేసేందుకు ఒక ప్రత్యేక సహకార వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఇరు పక్షాలు ఈ సందర్భంగా అంగీకరించాయి.

**అక్టోబర్‌లో హైదరాబాద్‌ను సందర్శించనున్న లివర్‌పూల్ సిటీ బృందం**

లండన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగానికి చెందిన సుసాన్ ఫిన్నెగాన్, నూలా గల్లాఘర్, లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్‌కు చెందిన పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ కు సంబంధించి తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి లివర్‌పూల్ ఆసక్తి చూపింది. ఈ భాగస్వామ్యాన్ని అధికారికంగా ఖరారు చేయడానికి లివర్‌పూల్ ప్రతినిధి బృందం అక్టోబర్‌లో హైదరాబాద్‌ను సందర్శించనుంది.

## ఎల్‌పిజి డెలివరీ బాయ్స్‌కు
# కనీస వేతనాలు
### ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాలు కల్పిస్తాం: మంత్రి వివేక్

**హైదరాబాద్, ఆగస్టు 22 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అన్ని రంగాల కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. ప్రజలకు నిత్యావసర సేవలను అందిస్తూ నిరంతరం శ్రమిస్తున్న కుకింగ్ గ్యాస్ డెలివరీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరిస్తుందని తెలిపారు. రంగారెడ్డి జిల్లా కొత్తపేటలో నిర్వహించిన తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ 6వ మహాసభకు మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరై కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డెలివరీ కార్మికుల సమస్యలు, వేతనాలు, పని పరిస్థితులు, సామాజిక భద్రత, సంక్షేమం తదితర అంశాలపై చర్చించారు. ఎల్‌పిజి డెలివరీబాయ్‌తోపాటు రాష్ట్రంలోని సంఘటిత అసంఘటిత కార్మికుల డిమాండ్ల మేరకు ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలను కూడా దశలవారీగా పరిశీలించి కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. కార్మికులకు తగిన వేతనాలు, భద్రత కల్పిస్తే వారి కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు ఉత్పాదకత కూడా పెరుగుతుందని అన్నారు.

## వారం - వర్జ్యం

23-08-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.ఏకాదశి తె.4.18
న.మూల సా.5.43
వ1. మ.3.55-సా.5.43
వ2. తె.3.24-ఉ.6.11
దు. సా.4.42-5.32
రాహు సా.4.30-సా.6.00
శుభ ఉ.8.00-ఉ.9.00

## వార్తాఫలం

**మేషం :** నూతన కార్యక్రమాలను అనుకున్న విధంగా ప్రారంభించగలుగుతారు. వివాహాది శుభ కార్యాలు ఫలిస్తాయి.

**వృషభం :** వృత్తి, ఉద్యోగ వ్యాపారాల పరంగా నూతనమైన ప్రణాళికలను అమలు పరచగలుగుతారు. సాంకేతిక విద్యావకాశాలు.

**మిథునం:** ఉపయుక్తమైన ప్రయాణాలు, చర్చలు ఫలవంతంగా సాగుతాయి. ఆరోగ్యం జాగ్రత్త. సోదరుల కలయిక.

**కర్కాటకం:** వివాహాది శుభకార్యాలు ప్రయత్నం మీద సానుకూల పడతాయి. ఉపయుక్తమైన ప్రయాణాలు. వస్తువు కొనుగోలు.

**సింహం:** ప్రజా సంబంధాలను విస్తృత పరచుకోవడానికి గాను చేసే ప్రయత్నాలు, ప్రకటనలు లాభిస్తాయి. ప్రముఖుల కలయిక.

**కన్య :** సకాలంలో సందర్భోచితమైన నిర్ణయాలు తీసుకొని లాభపడతారు. చర్చలు ఫలవంతంగా సాగుతాయి. శుభవార్తలు.

**తుల :** మీ కృషికి తగిన ఫలితాలన్ని అందుకోగలుగుతారు. కొత్త ఋణం తీసుకుంటారు. గృహ నిర్మాణ ఆలోచనలు సాగిస్తారు.

**వృశ్చికం :** ఆదాయ, వ్యయాలు సరిసమానంగా ఉంటాయి. శుభవార్తా శ్రవణం చేస్తారు. పెట్టుబడులకు అనుకూలం.

**ధనుస్సు :** ఒక మంచి పనికి గాను విరాళాలను సేకరిస్తారు. సంప్రదింపులు జరిపేటప్పుడు మెళకువలు పాటించండి.

**మకరం :** సంస్థను విస్తరింప చేయడానికి గాను మీరు చేసే యత్నాలు కలిసి వస్తాయి. శుభవార్తా శ్రవణం చేస్తారు.

**కుంభం :** అనేకాంశాలు అనుకూలంగానే ఉన్నాయి. బహుమతులను ఇవ్వడం లేక బహుమతులను అందుకోవడం జరుగుతుంది.

**మీనం :** ఆదాయ, వ్యయాలు సరిసమానంగా ఉంటాయి. కార్యాలయంలో ఉన్నతాధికారులతో జాగ్రత్తలు అవసరం. వాహన యోగం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కుప్పకూలిన 7 అంతస్తుల భవనం

### ఇద్దరు కార్మికులు మృతి.. హైదరాబాద్ గచ్చిబౌలిలో విషాదం
### శిథిలాలు పక్కభవనంపై పడి మాజీ ఆర్మీ ఉద్యోగి దంపతులకు గాయాలు.. మరో రెండు భవనాలకు పగుళ్లు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఆగస్టు 22 ప్రభాతవార్త:** హైటెక్‌సిటీకి ఆనుకొని ఉన్న గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో ఏడంతస్థుల నిర్మాణంలో ఉన్న భవనం శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా కుప్పకూలింది. నాలాను ఆక్రమించి, కవలం 55 గజాల విస్తీర్ణంలో ఏడంతస్తుల భవన నిర్మాణం నాణ్యత లేకుండా చేపట్టడంతో నిర్మాణ దశలోనే కుప్పకూలింది. భవన శిథిలాల కింద పడి మృతి చెందిన ఇద్దరు కార్మికుల మృతదేహాలను ఇప్పటి వరకు బయటకు తీశారు. శిథిలాల కింద మరింత మంది కార్మికులు ఉండే అవకాశం ఉందని అధికారులు అనుమానిస్తున్నారు. మరోవైపు కూలిన భవనం శిథిలాలు పక్కనే ఉన్న మరో భవనం మీద పడడంతో అందులో ఉన్న ఓ మాజీ ఆర్మీ ఉద్యోగి దంపతులు గాయపడ్డారు. కూలిన భవనం కారణంగా ఇరువైపులా ఉన్న మరో రెండు భవనాలకు పగుళ్లు రావడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో అనే ఆందోళన స్థానికుల్లో నెలకొంది. గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మాదాపూర్ సర్కిల్‌లో గల గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో గల నాలాను ఆక్రమించి, కవలం 55గజాల విస్తీర్ణంలో సాజిద్ అనే బిల్డర్ భవన నిర్మాణం చేపట్టాడు. కనీస సెట్‌బ్యాక్ లేకుండా, రక్షణ చర్యలు పాటించకుండా, మున్సిపల్ శాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా కవలం 55 గజాల విస్తీర్ణంలో ఏకంగా ఏడంతస్తుల భవన నిర్మాణం చేపట్టాడు. భవనం స్లాబులు, గోడలు పూర్తికాగా, ప్రస్తుతం భవనం లోపల టైల్స్ పనులు కొనసాగుతున్నాయి. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పేకమేడల్లా కట్టిన భవనం శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఒక్కసారిగా కుల్పకూలింది. సమాచారం అందుకున్న సీఎంసీ, హైడ్రా, డిఆర్‌ఎఫ్ బృందాలు చేరుకొని శిథిలాల తొలగింపు పనులు చేపట్టారు. శిథిలాల నుంచి ఇద్దరు కార్మికుల మృతదేహాలను ఇప్పటి వరకు అధికారులు వెలికి తీశారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఉమేశ్ కాం(34), మోహబ్బత్(42)లుగా చనిపోయిన వారిని గుర్తించారు. వీరు కూలిపోయిన భవనంలో టైల్స్ పనులు చేపడుతున్నారని తెలుస్తుంది. ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కూలిపోవడంతో భవనం శిథిలాలు కుప్పగా పడిపోయాయి. చుట్టూ భారీ భవనాలతో ఇరుకు సందులో కూలిన భవనం ఉండడంతో శిథిలాల తొలగింపు కష్టతరంగా మారింది. అంజయ్యనగర్‌లో భవనం కూలిన విషయం తెలుసుకున్న తెలంగాణ పిఎసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, హైడ్రా కమీషనర్ ఏవి.రంగనాథ్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొంషన్ కమీషనర్ సృజన, మాదాపూర్ డిసిపి రితిరాజ్‌లు సంఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షించారు.

**మాజీ ఆర్మీ ఉద్యోగి కుటుంబానికి గాయాలు**

కాగా కూలిన ఏడంతస్తుల భవనం పక్కనే ఉన్న వైట్‌ఫీల్డ్‌లోని జయదర్శిని రెసిడెన్సీలో గల సీ బ్లాక్ మీద పడింది. ఐదంతస్థుల ఈ భవనం భారీ ఎత్తున దెబ్బతిన్నది. జయదర్శిని రెసిడెన్సీ సీ బ్లాక్‌లోని ప్లాట్ నెంబర్లు 12,22,32,42,52 ల మీద పడడంతో ఈ ప్లాట్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కాగా జయదర్శిని రెసిడెన్సీలోని ప్లాట్ నెంబరు 42లో ఉంటున్న మాజీ ఆర్మీ ఉద్యోగి రమణారెడ్డి, అతని భార్య సంయుక్తల మీద కూలిన భవనం శిథిలాలు పడడంతో వారికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం వారిని ఆసుపత్రికి తరలించారు. జయదర్శిని సీ బ్లాక్‌లో ఉన్న నివాసితులందరిని అధికారులు ముందు జాగ్రత్తగా ఖాళీ చేయించారు. దీంతో కట్టుబట్టలతో వారు రోడ్డున పడ్డారు. కూలిన భవనం శిథిలాలు పడి పక్కనే ఉన్న మరో రెండు భవనాలు సైతం దెబ్బతినడంతో పాటు పగుళ్ల వచ్చాయి. ఇందులో హాస్టళ్ల కొనసాగుతుండగా, పోలీసులు ఈ భవనాలను సైతం ఖాళీ చేయించారు.

**బిల్డర్ అత్యాశ.. రోడ్డున పడిన వందల మంది**

కాగా నాలాను ఆక్రమించి, కవలం 55 గజాల స్థలంలో ఏడంతస్తుల భవన నిర్మాణం చేపట్టిన బిల్డర్ సాజిద్ అత్యాశ కారణంగానే ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు వాపోతున్నారు. సాజిత్ గతంలో సైతం అంజయ్యనగర్‌లో ఇదే తరహాలో కేవలం 50 నుంచి 60 గజాల విస్తీర్ణంలో ఏడంతస్తుల భవనాలు నిర్మించి హాస్టళ్లకు అద్దెకు ఇచ్చాడని తెలిపారు. ఓ మాజీ కార్పొంటర్ అండతో మున్సిపల్ అధికారులకు ముడుపులు ముట్టజెప్పి యదేచ్చగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నాడన్నారు. కూలిన భవనం ప్రారంభ దశలోనే తాము మున్సిపల్ అధికారులకు పిర్యాదు చేస్తే అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకుండా పోయిందని జయదర్శిని రెసిడెన్సీ వాసులు వాపోయారు.



గచ్చిబౌలిలో కుప్పకూలిన ఏడంతస్తుల భవనం

**అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు: హైడ్రా కమీషనర్**

అంజయ్యనగర్‌లో నాలాను ఆక్రమించి కవలం 55 గజాల విస్తీర్ణంలో ఏడంతస్తుల భవనం నిర్మించిన కారణంగానే భవనం కూలిపోయిందని హైడ్రా కమీషనర్ రంగనాథ్ తెలిపారు. సహాయ చర్యలను పర్యవేక్షించిన రంగనాథ్ మాట్లాడుతూ ఇరుకు సందులో కూలిన భవనం ఉండడంతో యంత్రాలు శిథిలాల వద్దకు చేందుకు కష్టతరంగా మారుతుందన్నారు. ఇప్పటి వరకు శిథిలాల నుంచి ఇద్దరు కార్మికుల మృతదేహాలను వెలికితీశామని అన్నారు. బిల్డర్ సాజిద్ అక్రమ నిర్మాణాలపై స్థానికులు పిర్యాదు చేశారని, అంజయ్యనగర్ అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



శనివారం గురుగ్రాంలో భారీ వర్షం కురవడంతో రోడ్లపైకి చేరిన వరద నీరు

# అవమానకర రీతిలో నాపై బహిరంగ విమర్శలు సరికాదు

### టిపిసిసి క్రమశిక్షణా కమిటీకి మంత్రి కొండా సురేఖ లేఖ

**ఉమ్మడి వరంగల్ బ్యూరో, ఆగస్టు 22, ప్రభాతవార్త:** టిపిసిసి క్రమశిక్షణా కమిటీ తనకు జారీ చేసిన నోటీసుకు ఇప్పటికే వివరణ సమర్పించినప్పటికీ, తనను, తన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని పలువురు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు బహిరంగంగా అవమానకర రీతిలో వ్యాఖ్యలు చేస్తుండటం పై అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వెనుక ఉండి ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్న అసలు వ్యక్తులు ఎవరో నిష్పాక్షికంగా గుర్తించి, వారిపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవిని కోరుతూ మంత్రి సురేఖ లేఖ రాశారు. పార్టీ క్రమశిక్షణా కమిటీ విచారణ కొనసాగుతున్న సమయంలోనే తనపై బహిరంగంగా విమర్శలు చేయడం, రాజకీయ భవిష్యత్తుపై తీర్పులు ఇవ్వడం, తనపై చర్యలు తీసుకోవాలని మీడియా ముందు డిమాండ్ చేయడం ద్వారా క్రమశిక్షణా కమిటీ స్వతంత్ర నిర్ణయాన్ని ప్రభావితం చేసే ప్రయత్నం జరిగిందా అనే అంశాన్ని కూడా కమిటీ పరిశీలించాలని మంత్రి సురేఖ కోరారు. 'పార్టీ క్రమశిక్షణపై నాకు పూర్తి గౌరవం ఉంది. అదే సమయంలో, ఒక సీనియర్ బీసీ మహిళా నాయకురాలైన నాపై తీవ్ర మాటలతో సామూహిక దాడులు జరుగుతున్నప్పుడు పార్టీ నాయకత్వం మౌనం వహించడం ఆందోళన కలిగిస్తోంది. నా రాజకీయ భవిష్యత్తుపై తీర్పులు ఇస్తూ, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మీడియా ముందుకు రావడం వెనుక ఉన్న ఉద్దేశాలను కూడా పార్టీ నాయకత్వం పరిశీలించాలి' అని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. పార్టీ ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, మహిళా సాధికారత, బలహీన వర్గాల ఆత్మగౌరవానికి కట్టుబడి వున్న పార్టీ అని, ఆ విలువలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై పార్టీ క్రమశిక్షణా నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి సురేఖ కోరారు.

# విచారణ జరపండి

>> మీడియాతో మాట్లాడారు. హైడ్రా కూడా పేదవాడికి ఒక న్యాయం, మజ్లిస్ కాంగ్రెస్ నేతలకు మరో న్యాయం అన్నట్లుగా వ్యవహరిస్తోందన్నారు. తెలంగాణ ప్రజల ఆస్తులు భద్రంగా ఉండాలంటే ఆర్మీని దింపాల్సి వస్తుందని హైకోర్టు వ్యాఖ్యానించిందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చున్నారు. గత 23 ఏళ్లలో 22ఏ లో చేర్చిన, తొలగించిన భూములపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బాధితులకు మండల స్థాయి నుంచి హైకోర్టు వరకు బీజేపీ లీగల్ సెల్ ద్వారా సంపూర్ణ ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ప్రకటించారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద దేశవ్యాప్తంగా పేదలకు కేంద్ర ప్రభుత్వమే 70 శాతానికి పైగా సబ్సిడీ, ధాన్యం కొనుగోలు, రవాణా, డీలర్ల కమిషన్ భరిస్తూ 5 కేజీల ఉచిత బియ్యం అందిస్తోందని తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు కేంద్ర లోగోను ముద్రిస్తుంటే, తెలంగాణలో మాత్రం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేరు, భారత ప్రభుత్వ లోగో లేకుండా కేవలం ముఖ్యమంత్రి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఫోటోలు మాత్రమే వేసుకోవడం సిగ్గుచేటన్నారు. రేషన్ రశీదుల్లో కేంద్ర వాటా ఉన్నప్పుడు, కార్డులపై కేంద్ర లోగో ఎందుకు వేయరని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర పథకాన్ని తమదిగా ప్రచారం చేసుకోవడం మానుకోకపోతే, కేంద్రమే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా లబ్ధిదారులకు బియ్యం పంపిణీ ఏర్పాట్లను పరిశీలిస్తుందని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో కాలేజీలకు చెల్లించాల్సిన సుమారు రూ. 15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిధులు రాక ఇంజనీరింగ్ కాలేజీలు మూతపడుతున్నాయని, ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రైవేటు కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఉన్నత చదువులు, ఉద్యోగావకాశాలు కోల్పోయి నిత్యం వందలాది మంది విద్యార్థులు రోడ్డెక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డుల్లు, విద్యార్థినులకు స్కూటీలు ఏమయ్యాయని నిలదీశారు. ముఖ్యమంత్రులు లేదా మంత్రుల అధికారిక విదేశీ పర్యటనలకు విదేశాంగ మంత్రిత్వ శాఖ దౌత్య నిబంధనలు, అంతర్జాతీయ భద్రతా ప్రోటోకాల్స్ ప్రకారం నిర్ణయం తీసుకుంటుందని, ఇందులో రాజకీయ కక్షసాధింపులు ఉండవని స్పష్టం చేశారు. కాంగ్రెస్ హయాం నుంచే ఉన్న ఈ నిబంధనల ప్రకారం బీజేపీ మంత్రుల పర్యటనలకు కూడా పలుమార్లు అనుమతులు రాలేదని, దీన్ని రాజకీయం చేయడం తగదని హితవు పలికారు. కేంద్ర ఎన్నికల సంఘం ఒక స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థ అని, "ఒక వ్యక్తి ఒకే ఓటు" నిబంధన ప్రకారం దేశవ్యాప్తంగా డబుల్ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లను తొలగించి ఓటర్ల జాబితాను శుద్ధి చేస్తోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో గ్రామీణ ఓట్లను తగ్గించి మజ్లిస్ పార్టీకి లబ్ధి చేకూర్చేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ప్రజలను బెదిరించారని ఆరోపించారు. గ్రామంలో ఓటు నమోదు చేసుకోకపోతే రేషన్ కార్డులు, భూములు, ఆస్తులు, పెన్షన్లు పోతాయని సీఎం చేసిన ప్రకటనల వల్లే ప్రజలు భయపడి హైదరాబాద్ వదిలి వెళ్లారని, దీనివల్ల సికింద్రాబాద్ నియోజకవర్గంలోనే 9.35 లక్షల ఓట్లు తగ్గాయని చెప్పారు. ఈ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, బీఎల్‌వోలే పనిచేస్తున్నప్పుడు కేంద్రంపై నిందలు వేయడం హాస్యాస్పదమన్నారు.

# పవర్‌ఫుల్ తెలంగాణ కోసం పకడ్బందీ చర్యలు

## విద్యుత్ డిమాండ్‌కు దీటుగా ప్రణాళికలు

## పెట్టుబడులకు గమ్యస్థానంగా రాష్ట్రం

### పరిశ్రమలకు మౌలికవసతులు కల్పించే లక్ష్యం: పవర్ ఎగ్జిబిషన్‌లో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క



**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో పవర్‌ఫుల్ తెలంగాణకై పగడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. విద్యుత్ కొరత లేని తెలంగాణాగా తీర్చిదిద్దేలా పనిచేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పవర్ ఎగ్జిబిషన్-2026ను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యానికి అనుగుణంగా విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. తెలంగాణ పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా నిలిచిందని వెల్లడించారు. భవిష్యత్ విద్యుత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి థర్మల్, సోలార్, హైడల్, పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ స్టోరేజ్ వంటి మార్గాల్లో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా సామర్థ్యాలను పెంచేందుకు దీర్ఘ కాలిక ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు. విద్యుత్ శాఖ సాధిస్తున్న విజయాలు, తీసుకు వస్తున్న సంస్క రణలు, ఆధు నిక సాంకేతికతను ప్రజలకు, ముఖ్యంగా వి ద్యార్థులకు అవ గాహన కల్పిం చాలనే ఉద్దేశంతో ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేయగలుగు తున్నామని వెల్లడించారు. గతంలో సుమారు 13 వేల మెగావాట్లుగా ఉన్న పీక్ డిమాండ్ ప్రస్తుతం 18 వేల మెగావాట్లకు పైగా చేరిందన్నారు. ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను పటిష్టం చేయడం, ముందస్తు ప్రణాళికలు, అవసరమైన విద్యుత్‌ను సమీకరించడం వల్ల అంతరాయం లేకుండా సరఫరా చేయగలుగుతున్నామని తెలియచేశారు. 1912 టోల్‌ఫ్రీ సేవలు, పవర్ అంబు లెన్సెస్ ద్వారా విద్యుత్ వినియోగదారుల సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. అవసరమైన పరికరాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సిబ్బందితో సిద్ధంగా ఉండే పవర్ అంబులెన్సెస్ ద్వారా విద్యుత్ సమస్యలు తలెత్తిన ప్రాంతాలకు తక్షణమే చేరుకుని పరిష్కరించే విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నామని వెల్లడించారు. విద్యుత్ శాఖలో సాంకేతికత వినియోగాన్ని పెంచుతూ ఇన్ హౌస్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. వినియోగదారుడి నంబర్ ఆధారంగా అతని లొకేషన్, విద్యుత్ సరఫరా వంటి సమాచారాన్ని సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అందుబాటులోకి తీసుకురావడం పారదర్శకత, సామర్థ్యాన్ని పెంచుతుందని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులు ఏర్పాటు చేయడానికి కనీసం నాలుగైదేళ్ల సమయం అవసరమవుతుందని దీన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలు తప్పనిసరి అని చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్, నీటి కొరత లేకుండా పారిశ్రామిక రంగానికి అవసరమైన మోలిక వసతులను కల్పించేం దుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# 'అచ్చ' కాంగ్రెస్ నాయకుల బాధలు చెప్పా

## సోనియా, రాహుల్, ప్రియాంక, ఖర్గే దేవుళ్లు

### ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్ల ఎనిమిది నెలల్లో ఒరిజినల్ (అచ్చ) కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అనుభవిస్తున్న బాధలు చెప్పాను, అంతేకానీ కాంగ్రెస్ అధిష్ఠానానికి వ్యతిరేకంగా తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వివరణ ఇచ్చారు. ఎఐసిసి, పిసిసి కార్యా లయాలు పవిత్ర దేవాలయాలుగా భావిస్తున్నాను. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, సోనియా, రాహుల్, ప్రియాంక, ఖర్గే నాకు దేవుళ్లతో సమానం, అలాంటి వారికి వ్యతిరేకంగా మాట్లాడే ప్రశ్నేలేదు, అలాంటి పరిస్థితి ఉత్పన్నం కాదని ఈ నెల 16న చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. దాదాపు అర్థశతాబ్దానికి పైగా కాంగ్రెస్ జెండా మోస్తున్నానని అదేవిధంగా అనేకమంది దశాబ్దాలుగా 40 యేళ్లకుపైగా జెండా మోసే నాయకుల మనోభావాలను వ్యక్తపరిచాను. ఎవరిపై అనుచిత వ్యాఖ్యలు చేయలేదని నాకు ఆ అవసరం కూడా లేదని అన్నారు. చిన్నారెడ్డి ఈ వ్యవహారాన్ని ఇంతటితో ముగించి ఇచ్చిన నోటీసులను ఉపసంహరించాలని విన్నవించారు.

# తుపాకీతో బెదరించి డెవలప్‌మెంట్ అగ్రిమెంట్

## వృద్ధుడి ఫిర్యాదుతో కేసు నమోదు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఆగస్టు 22, ప్రభాతవార్త:** వృద్ధుడిని తుపాకీతో బెదిరించి కోట్లాది రూపాయల విలువైన స్థలానికి డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేయిం చు కున్న ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10, జహీరానగర్‌లో నివసించే ఆర్.ఏ. పాల్(75)కు 3,400 చదరపు గజాల స్థలం ఉంది. ఈ స్థలానికి సంబంధించి 2022లో నవీన్ గోయల్ అనే బిల్డర్‌తో ఆయన డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేసుకున్నారు. అయితే పాల్ అల్లుడు ఇమ్రాన్ ఆ స్థలాన్ని ఖాళీ చేయకుండా ఆక్రమించాడు. ఈ నేపథ్యంలో తన స్నేహితులకు స్థలాన్ని డెవలప్‌మెంట్‌కు ఇవ్వాలంటూ ఇమ్రాన్ మరో వ్యక్తితో కలిసి పాల్ ఇంటికి వచ్చి, తనకు అనుకూలంగా అగ్రిమెంట్ చేయాలని ఒత్తిడి చేశాడని, రివాల్వర్‌తో బెదిరించాడని పాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇమ్రాన్ మరో నలుగురితో కలిసి ఇంట్లోకి బలవంతంగా ప్రవేశించి రూ.5 లక్షలు అందినట్లు తెల్ల కాగితంపై సంతకం చేయించుకున్నారన్నారు. అనంతరం తన బ్యాంకు ఖాతాలోకి రూ.5 లక్షలు ఆర్టీజీఎస్ ద్వారా బదిలీ చేయడంతో పాటు థంబ్ ఇంప్రెషన్ కూడా తీసుకున్నారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇమ్రాన్, జునైద్‌తో పాటు మరో ముగ్గురిపై బంజారాహిల్స్ పోలీసులు ఆర్మ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




# మహిళలు తమకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించాలి

### ఛాత్రోంకి గూంజ్ కార్యక్రమంలో రాహుల్‌గాంధీ

**పుణే, ఆగస్టు 22:** మహిళలను కుమార్తె, భార్య, తల్లి వంటి కుటుంబ సంబంధాల గుర్తింపులకే పరిమితం చేయకూడదని, ప్రతి మహిళకు తనకంటూ ప్రత్యేక మైన వ్యక్తిత్వం, గుర్తింపు ఉంటుందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీ అన్నారు. పుణేలో శనివారం నిర్వహించిన ఛాత్రోన్ కీ గూంజ్ కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన రాహుల్ గాంధీ మహిళల స్వాతంత్రం, సమానత్వంపై ప్రస్తావించారు. 'మహిళలను కుమార్తెగా, భార్యగా లేదా తల్లిగా మాత్రమే చూడటం సరికాదన్నారు. దేశంలో ఎంతోమంది ప్రతిభావంతులైన మహిళలు అనేక రంగాల్లో పనిచేస్తున్నారు. అయినప్పటికీ వారికి కుమార్తె, భార్య, తల్లి అనే గుర్తింపులే ప్రధానంగా ఇస్తున్నారు. అదే మహిళకు ఉన్న ఏకైక గుర్తింపు కాకూడదు. ప్రతి మహిళకు తనకంటూ ప్రత్యేక గుర్తింపు ఉండాలి' అని రాహుల్ అన్నారు. మహిళల స్వాతంత్ర్యానికి సంబం ధించి మనుస్మృతిని ప్రస్తావించిన రాహుల్‌గాంధీ, తండ్రి, భర్త, కుమారులపై మహిళ ఆధారపడాలనే భావనను విమర్శించారు. 'మహిళ ఎప్పుడూ స్వతంత్రంగా ఉండకూడదు అనేది మనుస్మృతిలోని ప్రత్యక్ష వ్యాఖ్య అని ఇలాంటి మాటలు చెప్పడం సిగ్గుచేటు. ఈ దేశానికి ఉన్న అతిపెద్ద బలం మహిళలు స్వతంత్రంగా ఉండటమే. మీరు ఎవరికీ చెందరు.. మీకు మీరు మాత్రమే చెందుతారు' అని ఆయన పేర్కొన్నారు. భారత మహిళలను దేశానికి అతిపెద్ద ఆస్తిగా రాహుల్‌గాంధీ అభివర్ణించారు.

# రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ షట్‌డౌన్

## 10 రోజులపాటు యూరియా ఉత్పత్తికి బ్రేక్

## తెలంగాణతోపాటు, మరో 4 రాష్ట్రాలకు అంతరాయం

### తక్షణమే జోక్యం చేసుకొని చర్యలు తీసుకోండి : కేంద్రమంత్రి జెపి నడ్డాకు రాష్ట్ర మంత్రి తుమ్మల లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** దేశంలోని అతిపెద్ద యూరియా తయారీ కేంద్రాలలో ఒకటైన రామగుండం ఎరువుల కర్మాగారం తరచూ ఉత్పత్తి నిలిచిపోతోంది. శనివారం నుండి ఫ్యాక్టరీ యాజమాన్యం షట్‌డౌన్ పేరుతో ఎరువుల ఉత్పత్తిని నిలిపివేసింది. ఈ ఫ్యాక్టరీ 10 రోజుల పాటు మూసివేయనుంది. ఇప్పటికే ఈ యూనిట్‌కు పట్టిపీడిస్తున్న దీర్ఘకాలిక సాంకేతిక సమస్యలకు తోడు, తాజాగా యాజమాన్యం తీసుకున్న షట్‌డౌన్ నిర్ణయం రైతాంగానికి అనిశపాతమైంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటల సాగు కీలకంగా ఉన్న సమయంలో, పలు రాష్ట్రాల రైతులు ఈ ఎరువుల నిరంతర సరఫరాపై ఆధారపడి ఉన్నందున సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలోనూ కీలక వ్యవసాయ సీజన్లలో ప్లాంట్ పలుమార్లు షట్‌డౌన్‌కు గురికావడం విశేషం. 2025 ఖరీఫ్ సీజన్‌లో మే 5 నుంచి జూన్ 14 వరకు 39 రోజులు, జూలై 10 నుంచి ఆగస్టు 4 వరకు 24 రోజులు, ఆగస్టు 14 నుంచి అక్టోబర్ 1 వరకు 49 రోజుల పాటు ప్లాంట్‌లో ఉత్పత్తి నిలిచిపోయింది. ఈ విధంగా మొత్తంగా 112 రోజుల పాటు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. తాజాగా ఇప్పుడు ఈ నెల 22 నుంచి రామగుండం ఫ్యాక్టరీ మరోసారి షట్‌డౌన్‌లోకి వెళ్లడంతో సుమారు 10 రోజుల పాటు ఉత్పత్తి నిలిచిపోయే అవకాశం ఉంది. దేశ ఎరువుల డిమాండ్‌ను తీర్చడంలో రామగుండం ప్లాంట్ కీలక పాత్ర పోషిస్తోంది. 2021 మార్చిలో వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించినప్పటి నుండి, ఈ ప్లాంట్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలకు యూరియా సరఫరాకు కీలక వనరుగా మారింది. కేవలం ఈ ఏడాది జూన్ నెలలోనే, రామగుండం యూనిట్ సుమారు 94,849 మెట్రిక్ టన్నుల యూరియాను ఉత్పత్తి చేసి, 97,094.70 మెట్రిక్ టన్నుల యూరియాను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసింది.

ఆ నెలలో, తెలంగాణకు 48,675.33 టన్నులు, కర్ణాటకకు 28,338.66 టన్నులు, ఆంధ్రప్రదేశ్‌కు 11,308.23 టన్నులు, తమిళ నాడుకు 5,655.60 టన్నులు, మహారాష్ట్రకు 3,116.88 టన్నులు ఎగుమతి చేసింది. ఇప్పుడు ఖరీఫ్ పంటల సాగు పనులు ఉధృతంగా సాగుతున్న ఈ సమయంలో యూరియాకు డిమాండ్ అధికంగా ఉన్న నేపథ్యంలో ఫ్యాక్టరీ షట్‌డౌన్ నిర్ణయం పట్ల సర్వత్రా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సీఎల్) ప్లాంట్ శనివారం నుంచి మరోసారి షట్‌డౌన్‌లోకి వెళ్లడంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. కీలకమైన ఖరీఫ్ సీజన్‌లో యూరియాకు డిమాండ్ అధికంగా ఉన్న సమయంలో ప్లాంట్ షట్‌డౌన్ కావడం రాష్ట్రానికి ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాకు మంత్రి తుమ్మల లేఖ రాసి, తక్షణమే జోక్యం చేసుకుని యూరియా సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ యూరియా అవసరాలను తీర్చడంలో రామగుండంలోని ఆర్‌ఎఫ్‌సీఎల్ కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి తుమ్మల తెలిపారు. ప్రస్తుత షట్‌డౌన్‌ను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించి, వీలైనంత త్వరగా ప్లాంట్‌లో ఉత్పత్తిని పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని తుమ్మల కోరారు. ప్రస్తుతం అంచనా వేసిన 10 రోజుల వ్యవధి కంటే ముందుగానే ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

**శ్రీ భవాని శంకర్ దేవాలయము**
దేవాదాయ ధర్మాదాయ శాఖ, దేవునితోట, భోలక్‌పూర్, హైదరాబాద్
సీల్డ్ కొటేషన్ - కమ్ - బహిరంగ వేలం ప్రకటన
Rc.No.100/SBSD/2026 తేది: 21-08-2026
దేవాలయము ఉత్తర భాగమున 4000 చదరపు గజముల స్థలములో పార్కింగ్ రుసుములు వసూలు చేయుట కొరకు లైసెన్స్ జారీ చేయు నిమిత్తము లీజుకు ఇచ్చుట. బహిరంగ వేలము నిర్వహించు తేది 07-09-2026 సోమవారం మధ్యాహ్నం 2-00 గం.లకు. లీజు కాల పరిమితి (1) సంవత్సరము కాలం, తేది 15-09-2026 నుండి 14-09-2027 వరకు ధరావత్తు రూ॥ 2,00,000/- (అక్షరాల రెండు లక్షల రూపాయలు మాత్రమే) టెండర్ ఫారము ధర రూ॥ 1,000/- టెండర్ ఫారములు తేది 26-08-2026 నుండి తేది 06-09-2026 వరకు ఇవ్వబడును.
ఇతర వివరముల కొరకు దేవస్థాన కార్యాలయములో సంప్రదించగలరు.
సం/- కార్యనిర్వహణాధికారి
DIPR.No.8477-PP/CL/Advt/1/2026-27, తేది: 22.08.2026 ఫోన్ నెం.9912152507

# సామాజిక బాధ్యత కలిగిన విద్యార్థులతో ప్రజాస్వామ్యం రక్షణ

### పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్,ఆగస్టు 22,ప్రభాతవార్త:** సామాజిక బాధ్యత కలిగిన విద్యార్థులతో ప్రజాస్వామ్యం పరిరక్షణకు మార్గం కలుగుతోందని విద్యార్థులు చదువుతోపాటు నాయకత్వలక్షణాలు అలర్చుకోవాలని టిపిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. నిజామాబాద్‌లో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విపుల్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన "ఛాత్రోంకి గూంజ్" కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, మేయర్ ఉమారాణి, డిసిసి అధ్యక్షులు నగేష్ రెడ్డి, రామకృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పుణేలో నిర్వహించిన ఛాత్రోంకి గూంజ్" లైవ్ కార్యక్రమాన్ని నాయకులు వీక్షించారు. అనంతరం విద్యార్థులు చదువులతో పాటు క్రీడలు, సామాజిక సేవా కార్యక్రమాలపై కూడా శ్రద్ధ చూపాలని దీనితో ప్రజల సమస్యలు అర్థం చేసుకొని నాయకులుగా నిలబెట్టడానికి దోహదం చేస్తోందని అన్నారు.

# కొత్త ఇహెచ్‌ఎస్ పథకం అమలు ప్రారంభం

### ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రుల అంగీకారం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు22:** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు, వారి ఆధారితుల ఆరోగ్య భద్రతకు ఒక చారిత్రాత్మక ముందడుగుగా, కొత్త ఉద్యోగుల ఆరోగ్య పథకం (న్యూ ఇహెచ్‌ఎస్) శనివారం అధికారికంగా ప్రారంభమైంది. ఉద్యోగుల సంక్షేమం పట్ల ప్రభుత్వ నిబద్ధతను మరింత బలోపేతం చేసే ముఖ్యమైన ముందడుగు ఇది. శనివారం తెలంగాణ సచివాలయంలో ట్రస్ట్ బోర్డు కన్వీనర్, ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్(ఇహెచ్‌సిటి) సీఈఓ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టీజీజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్‌తో సహా ఉద్యోగుల ఆరోగ్య పథకం బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సభ్యులు పాల్గొన్నారు. తెలంగాణ స్టేట్ హాస్పిటల్స్ అసోసియేషన్ (టిఎస్‌హెచ్‌ఏ) అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, అలాగే అపోలో హాస్పిటల్స్, కాంటినెంటల్ హాస్పిటల్స్, యశోద హాస్పిటల్స్, కిమ్స్ హాస్పిటల్స్ వంటి ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రుల ప్రతినిధులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.చర్చల అనంతరం, టిఎస్‌హెచ్‌ఏ పాల్గొన్న ఆసుపత్రుల బృందాలు ఏకగ్రీవంగా న్యూ ఈహెచ్‌ఎస్ పథకాన్ని శనివారం నుండే తక్షణమే అమలు చేయాలని అంగీకరించాయి, తద్వారా అర్హులైన లబ్ధిదారులకు నగదు రహిత చికిత్స సదుపాయాలు నేటి నుండి అందుబాటులోకి వచ్చాయి. సమావేశంలో న్యూ ఇహెచ్‌ఎస్ మార్గదర్శకాలను కూడా విడుదల చేశారు, ఇవి ఆసుపత్రుల ఎంపానెల్‌మెంట్, చికిత్స ప్రోటోకాల్స్, క్లెయిమ్ సెటిల్‌మెంట్ విధానాలకు సంబంధించిన సవరించిన విధివిధానాలను నిర్దేశిస్తాయి.ఈ కొత్త పథకానికి ఆసుపత్రుల వర్గం సహకరించిన తీరుపై ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు నిరంతరాయంగా, నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించే దిశగా ఇది ఒక సానుకూల ముందడుగుగా అభివర్ణించారు. లబ్ధిదారులకు సకాలంలో, ఇబ్బంది లేకుండా చికిత్స లభించేలా న్యూ ఈహెచ్‌ఎస్ మార్గదర్శ కాలను అక్షరాలా, స్ఫూర్తితో అమలు చేయడంలో పూర్తి సహకారం అందించాలని ఎంపానెల్డ్ ఆసుపత్రులందరికీ ట్రస్ట్ విజ్ఞప్తి చేసింది.

**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)**
AU SMALL FINANCE BANK
A SCHEDULED COMMERCIAL BANK
నమోదిత కార్యాలయం: 19-ఎ, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001 (CIN:L36911RJ1996PLC011381)
అనుబంధం IV (నిబంధన 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన
"ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్" ఏప్రిల్ 01, 2024 నుండి "AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్"తో విలీనం అయిందని రుణగ్రహీతలందరికీ మరియు ప్రజలకు తెలియజేయడానికి ఇది. అయితే, కింద సంతకం చేసిన వ్యక్తి "సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) కింద AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారి మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదవబడిన సెక్షన్ 13(12) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ క్రింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీ చేశారు. ఆ నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు, క్రింద ఇవ్వబడిన పట్టికలో ఇవ్వబడిన వివరాల ప్రకారం, ఆ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని చెల్లించాలి.

| రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు/ హామీదారు పేరు/రుణ ఖాతా నం. | 13(2) నోటీసు తేది మరియు మొత్తం | స్వాధీనం చేసుకున్న తేది |
|---|---|---|
| (Loan A/C No.) 24630000036570, మన్నూరి యాదయ్య (రుణగ్రహీత) మన్నూరి యాదమ్మ (సహ-రుణగ్రహీత) మన్నూరి కృష్ణయ్య (సహ-రుణగ్రహీత) | 11-ఫిబ్రవరి-26 రూ.9,93,089/-, తొమ్మిది లక్షల తొంభై మూడు వేల, ఎనభై తొమ్మిది రూపాయలు మాత్రమే 10-ఫిబ్రవరి-26 నాటికి | 20-ఆగస్టు -26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: వికారాబాద్ జిల్లా, పరిగి మండలం, సయ్యద్ మల్కాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 115/Aలో గల ఖాళీ స్థలం ప్లాట్ నం. 31. దీని విస్తీర్ణం 36X40 = 1440 చదరపు అడుగులు అంటే 160 చదరపు గజాలు లేదా 133.76 చదరపు మీటర్లు. హద్దులు: తూర్పున 10 అడుగుల వెడల్పు గల రోడ్డు, పడమరన ప్లాట్ నం. 26, ఉత్తరాన ప్లాట్ నం. 32, దక్షిణాన ప్లాట్ నం. 30. | | |
| (Loan A/C No.) 24660002611614, మొహమ్మద్ ఫరీదుద్దీన్ (రుణగ్రహీత) రెహానా బేగం (సహ-రుణగ్రహీత) మొహమ్మద్ రఫీయొద్దీన్ (సహ-రుణగ్రహీత) | 27-ఏప్రిల్-26 రూ.5,61,828/-, అయిదు లక్షల అరవై ఒక్క వేల ఎనిమిది వందల ఇరవై ఎనిమిది రూపాయలు మాత్రమే 27-ఏప్రిల్-26 నాటికి | 20-ఆగస్టు -26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: తెలంగాణ రాష్ట్రం, వికారాబాద్ జిల్లా, వికారాబాద్ మున్సిపాలిటీ, వికారాబాద్ పట్టణం, శివారెడ్డిపేట గ్రామంలో ఉన్న ఆస్తి. ఇది ప్రస్తుతం శ్రీమతి రెహానా బేగం భర్త: మహమ్మద్ రఫీయొద్దీన్ గారికి చెందినది. ఇందులో RCC నిర్మాణంతో 432 చదరపు అడుగుల విస్తీర్ణం ప్లింత్ ఏరియా కలిగిన గ్రౌండ్ ఫ్లోర్ ఇల్లు మరియు A/C షీట్లతో నిర్మించిన మరో 432 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణం ఉన్నాయి. ఖాళీ స్థలంతో కలిపి దీని మొత్తం విస్తీర్ణం 140 చదరపు గజాలు లేదా 117.05 చదరపు మీటర్లు. దీని సరిహద్దులు ఈ క్రింది విధంగా ఉన్నాయి: తూర్పున - ఇతరుల ఇళ్ళు, పడమరన - రోడ్డు, ఉత్తరాన - 6 అడుగుల వెడల్పు గల సేరి మరియు హనుమాన్ ఆలయ ఖాళీ స్థలం, దక్షిణాన : రోడ్డు. | | |
| (Loan A/C No.) 24630000070434, ఎల్.మధుసూదనరెడ్డి (రుణగ్రహీత) ఎల్.అఖిలరెడ్డి (సహ-రుణగ్రహీత) | 08-అక్టోబర్-25 రూ.15,35,498/-, పదిహేను లక్షల ముప్పై ఐదు వేల నాలుగు వందల తొంభై ఎనిమిది రూపాయలు మాత్రమే 08-అక్టోబర్-25 నాటికి | 20-ఆగస్టు -26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: వికారాబాద్ జిల్లా, మోమిన్‌పేట్ మండలం, చీమల్దరి గ్రామంలో ఉన్న ఖాళీ స్థలం - దీని సర్వే నంబర్ 95/B1/1/2/1/1/1 ఆన్‌లైన్ ధరణి రికార్డు ప్రకారం సర్వే నంబర్ 95/B1/1/2/1/1/3 మరియు దీని విస్తీర్ణం 605 చదరపు గజాలు. దీని సరిహద్దులు: తూర్పున - రోడ్డు; పడమరన - వ్యవసాయ భూమి మరియు లక్ష్మి గారి భూమి; ఉత్తరాన - రోడ్డు; దక్షిణాన - రోడ్డు. | | |

రుణగ్రహీత మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, పైన పేర్కొన్న పట్టికలో పేర్కొన్న తేదీలో పేర్కొన్న నియమంలోని సెక్షన్ 13(4)తో పాటు (చట్టం 2002) నిబంధన 8తో చదువబడే అతనికి/ఆమెకు ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి, పైన పేర్కొన్న పట్టికలో వివరించిన ఆస్తిని క్రింద సంతకం చేసిన వ్యక్తి స్వాధీనం చేసుకున్నాడని రుణగ్రహీతకు మరియు ప్రజలకు నోటీసు ఇవ్వబడింది. "సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, అంటే ఈ సమాచారం నుండి 30 రోజులలోపు, నియమం 8(6)తో పాటు చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలకు రుణగ్రహీత దృష్టిని ఆహ్వానించబడాడు".
ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు చేయరాదని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నారు మరియు ఆస్తితో ఏవైనా లావాదేవీలు పైన పేర్కొన్న పట్టికలో పేర్కొన్న మొత్తం మరియు దానిపై వడ్డీకి AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) ఛార్జీకి లోబడి ఉంటాయి.
తేది: 21/08/2026
ప్రదేశం : హైదరాబాద్, తెలంగాణ
అధీకృత అధికారి,
AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్.

# బిగ్‌బాస్కెట్, బ్లింకిట్, జెప్టో సంస్థలపై టిజి సేఫ్ దాడులు




టిజి సేఫ్ అధికారుల దాడుల్లో జప్తు అయిన ఆహార వస్తువుల ప్యాకెట్

## నిబంధనల ఉల్లంఘనలపై నోటీసులు

### భారీగా గడువు ముగిసిన ఆహార ఉత్పత్తుల జప్తు

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** కల్తీ ఆహార వస్తువులపై ఉక్కుపాదం మోపేందుకు సర్కారు కొత్తగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టిజి సేఫ్) తొలిసారిగా కల్తీ, గడువు ముగిసిన ఆహార ఉత్పత్తుల విక్రయాలపై దాడులు చేబట్టింది. శనివారం క్యూర్ (ఓఆర్ఆర్) పరిధిలో వ్యాపారాలు నిర్వహిస్తున్న బిగ్ బాస్కెట్, బ్లింకిట్, జెప్టో సంస్థలపై టిజి సేఫ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సంస్థలకు చెందిన స్టోర్స్ క్యూర్ పరిధిలో పెద్దసంఖ్యలో వుండగా వీటిలో విక్రయిస్తున్న ఆహార వస్తువులు గడువు ముగిసినట్లు, నిబంధనలు పాటించడం లేదని ఫిర్యాదులు వున్నాయి. దీనిపై సమాచారం అందుకున్న టిజి సేఫ్ అధికారులు 20 చోట్ల పది బృందా లతో ఏకకాలంలో దాడులు నిర్వహించారు.

టిజి సేఫ్ అధికారులకు తోడుగా ఆయా ప్రాంతాల పోలీసులు కూడా వున్నారు. ఈ సందర్భంగా ఆయా స్టోర్స్‌లో నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. దీంతో పాటు గడువు తీరిన ఆహార వస్తువులను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వీటిని జప్తు చేసిన అధికారులు అందులో కొన్నింటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. దీనిపై ఆయా సంస్థల నిర్వాహకులకు టిజి సేఫ్ అధికారులు నోటీసులు జారీ చేశారు.

BLO
SIR Special Intensive Revision
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ప్రత్యేక సమగ్ర సవరణ)
జూన్ 25, 2026 నుండి
ఓటు V.O.T.E
భారత ఎన్నికల సంఘం
భారత ఎన్నికల సంఘం అర్హులైన పౌరులను ఓటర్ల జాబితాలో చేర్చి, అనర్హులు జాబితాలో లేకుండా చూసేందుకు జూన్ 25, 2026 నుండి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) నిర్వహిస్తుంది.
17.08.2026న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో మీ పేరు లేనట్లయితే, బూత్ స్థాయి అధికారి (BLO) / AERO / ERO ను సంప్రదించండి.
17.08.2026 నుండి 16.09.2026 వరకు క్లెయిమ్‌లు & అభ్యంతరాలు తెలపవచ్చు.
ఫారమ్-6
మీకు అక్టోబరు 1, 2026 కి 18 సం॥లు నిండినట్లైతే, మరియు ఏదైనా శాసనసభ నియోజకవర్గాల్లో ఓటర్‌గా నమోదు కానట్లయితే లేటెస్ట్ ఫోటో, వయసు ధ్రువీకరణ పత్రం & డిక్లరేషన్ ఫారం మొ॥ జతచేసి అందచేయండి
(నూతన ఓటర్‌గా)
ఫారమ్-7
చనిపోయిన లేదా డూప్లికేట్ ఓటర్ల పై అభ్యంతరాలు తెలియజేయుటకు
(తొలగింపులు)
ఫారమ్-8
మీ మొబైల్ నెంబర్ అప్డేట్, చిరునామా మార్పులు, ఓటర్ గుర్తింపుకార్డులో వివరాల సవరణలకు
(సవరణలు)
తుది ఓటర్ల జాబితా ప్రచురణ 19.10.2026
Scan here for
ecinet.eci.gov.in
Website: https://voters.eci.gov.in / https://ecinet.eci.gov.in / https://www.eci.gov.in
వివరాలకు: బూత్ లెవల్ ఆఫీసర్‌ను సంప్రదించండి (BLO)/AERO/ERO
CEOTelangana CEOTelangana
ChiefElectoralOfficerTelangana
CEO_Telangana
వివరాలకు, టోల్‌ఫ్రీ 1950
ఉ॥ 10:30 - సా॥5:00 వరకు
మీ ఓటు.. మీ బాధ్యత. ఓటర్ల జాబితాలో మీ వివరాలను అప్‌డేట్ చేసుకోండి - పటిష్టమైన ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి

# ఎల్‌నినోకు దీటుగా ప్రణాళికలు

ప్రశాంత మహాసముద్రంలో వేగంగా రూపుదిద్దుకుంటున్న ఎల్‌నినో ప్రభావం రాబోయే నవంబర్, డిసెంబర్ నాటికి పరాకాష్టకు చేరుకోనుందని వాతావరణ శాస్త్రవేత్తలు అత్యంత హెచ్చరికలతో కూడిన నివేదికను విడుదల చేశారు. మును పెన్నడూ చూడని విధంగా ఈ వేసవిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భూమిపైనే అత్యంత వేడి దేశంగా భారత్ రికార్డులకెక్కింది. ప్రస్తుతం ప్రపంచంలోని అత్యంత వేడి నగరాల జాబితాలో ఉన్న 100నగరాలు భారత్‌కు చెందినవే. ఎల్‌నినో పరిస్థితులు అంతకంతకూ పెరుగుతుండటంతోకేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. తెలంగాణలో ఖరీఫ్ ప్రారంభమైన జూన్ 1 నుండి ఈ నెల 21వ తేదీ వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 505.2 మిల్లీ మీటర్ల సాధారణ వర్షపాతానికిగాను 432.6 మిల్లీమీటర్లు నమోదైంది. ఇక రాష్ట్రంలోని 17 జిల్లాలు లోటు వర్షపాతంతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇందులో 14 జిల్లాలు 25 నుండి 47 శాతం లోటును ఎదుర్కొంటున్నాయి. మరోపక్క గత ఏడాది కంటే దాదాపు 2 లక్షల ఎకరాల విస్తీర్ణం తక్కువగా ప్రస్తుత ఖరీఫ్ సీజనులో అన్ని పంటలూ కలిపి 1.17 కోట్ల ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 1 నుండి ఈ నెల 21 వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 373.8 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి గాను 52.76 శాతం లోటుతో 176.59 మిల్లీమీటర్లు రికార్డయింది. దీంతో రాష్ట్రం మొత్తం మీద 25 జిల్లాల్లో 35.45 శాతంనుండి 76.02 శాతం వరకూ లోటువర్షపాతం చోటు చేసుకుంది. అలాగే ఈ ఖరీఫ్ సీజనులో ఈ నెల 21 నాటికి రాష్ట్రంలో పంటల సాగువిస్తీర్ణం గత ఏడాదితో పోలిస్తే 5శాతం తగ్గి 46.70లక్షల ఎకరాలకు చేరుకుంది. ఈ సీజనుకు సాధారణంగా ఉండాల్సిన 76.11 లక్షల ఎకరాల్లో ఇప్పటి వరకూ 61 శాతం మేర మాత్రమే సాగు పూర్తయింది. దీంతో వర్షాభావ పరిస్థితులు, కరువు ముప్పును ఎదుర్కొనేందుకు కేంద్రంతో పాటు,ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ వ్యవసాయ ప్రణాళికలు, నీటి సంరక్షణ చర్యలను అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా ఈ వానాకాలంలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు

**సిహెచ్.వి.వి.రఘుబాబు**

ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ సిద్ధం చేసింది. రైతులకునష్టం జరగకుండా మూడు దశల కంటింజెన్సీ ప్లాన్ అమలు చేస్తోంది. వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. వర్షాలు ఆలస్యమైనా రైతులకు విత్తనాల కొరత లేకుండా ముందుగానే భారీ స్థాయిలో నిల్వలుసిద్ధం చేసి రైతులకు అందుబాటులో అందిస్తోంది.



జిల్లాల వారీగా ప్రత్యేక ప్రణాళికలు కూడా సిద్ధంగా ఉంచారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదవుతుండగా, మరికొన్ని జిల్లాల్లో లోటు కనిపిస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. పరిస్థితులను బట్టి వెంటనే చర్యలు చేపట్టేలా జిల్లా యంత్రాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ఎల్‌నినో పరిస్థితులపై రైతులకు ఖచ్చితమైన సమాచారం అందించేందుకు ప్రతివారం మండలాల వారీగా వ్యవసాయ-వాతావరణ బులెటిన్ విడుదల చేస్తున్నారు. ఇందులో వర్షపాతం,ఉష్ణోగ్రతలు, నేలతేమ, భూగర్భ జలాల స్థితి, సాగునీటి లభ్యత, విద్యుత్ సరఫరా, పంటల పరిస్థితి,రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య చర్యలు వంటి అంశాలు పొందుపరుస్తున్నారు. వర్షాలు పడిన తర్వాతే విత్తనాలు వేయడం, నేల తేమను కాపాడే పద్ధతులు పాటించడం,సరైన సమయంలో ఎరువులు వినియోగించడం, తక్కువ నీటితో సాగు చేసే విధానాలను అమలు చేయడం వంటి శాస్త్రీయ సూచనలను ప్రతి రైతుకు చేరవేసేలా వ్యవసాయ అధికారులు గ్రామాల వారీగా రైతులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానంగా వరి సాగు చేస్తున్న రైతులు నారు నిర్వహణ, నాటే దూరం, ఎరువుల వినియోగం, నీటి పొదుపు పద్ధతులపై శాస్త్రవేత్తలు సూచించిన మార్గదర్శకాలను గత కొన్ని రోజులుగా అవగాహన కల్పించే ప్రయత్నాలు చేస్తున్నారు.నారు వేయని రైతులు తక్కువ కాలంలో పండే రకాలతో పాటు, ప్రత్యామ్నాయ సాగు పద్ధతుల వైపు దృష్టిసారించారు. ఇందులో భాగంగా నీటి లభ్యత తక్కువగా ఉండే ప్రాంతాల్లో వరికి బదులుగా మొక్కజొన్న, సజ్జలు,రాగులు,కందులు, మినుములు, నువ్వులు, పొద్దుతిరుగుడు, అలసందలు, కూరగాయల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. తద్వారా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగాపంటల ఎంపిక రైతులకు మేలు చేస్తుందని అధికారులు సూచించారు. ఇక ఇప్పటికే మొలక దశలో ఉన్న మొక్కజొన్న, పత్తి పంటలకు వచ్చే రెండువారాలు కీలకమని నిపుణులు చెబుతున్నారు. వర్షాభావం కొనసాగితే నేల తేమను కాపాడేందుకుకలుపు నియంత్రణ, తేమ సంరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. మూడు దశల కార్యాచరణకు అనుగుణంగా అవసరమైన విత్తనాలు, ఎరువులపై ముందుగానే అంచనాలు పూర్తి చేసి నిల్వలు సిద్ధం చేసిన ప్రభుత్వం వాటిని రైతు వేదికల ద్వారా విక్రయాలు సైతం జరిపింది. మార్క్‌ఫెడ్, విత్తన సంస్థలు, జిల్లాయంత్రాంగం సమన్వయంతో రైతులకు ఎలాంటి కొరత రాకుండా చర్యలు కొనసాగుతున్నాయి. అంతేకాకుండా రైతు నేస్తం కార్యక్రమం ద్వారా ఎల్‌నినో ప్రభావాలు, నీటి యాజమాన్యం, నేల తేమ సంరక్షణ, ప్రత్యామ్నాయ సాగు, వాతావరణ ఆధారిత వ్యవసాయ పద్ధతులపై ప్రత్యేక అవగాహన కల్పించడంతో ఆ దిశగా పలు జిల్లాల్లో రైతులు అవసరమైన చర్యలు చేపట్టారు. ప్రతి రైతుపరిస్థితులకు అనుగుణంగా సరైన నిర్ణయాలు తీసుకునేలా వ్యవసాయ శాఖ మార్గనిర్దేశం చేస్తోంది. ఎల్‌నినో ప్రభావం ఎంత తీవ్రంగా ఉన్నా రైతులు నష్టపోకుండా అన్ని చర్యలు తీసుకుంటుందని ఇప్పటికే ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇదే సమయంలో నీటి సంరక్షణ పనులు చేపడుతోంది. ఇందులో భాగంగా అధికారులు ఉపాధి హామీ పథకం ద్వారా ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు, కుంటల్లో పూడికతీత పనులు చేపట్టి వర్షపు నీటిని సంరక్షించే చర్యలుచేపట్టారు. అలాగేమిషన్ భగీరథ సమర్థ వంతంగా వినియోగం జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. తాగునీటి సరఫరా వ్యవస్థలో లీకేజీలను అరికడుతూ, వృథాను నివారించాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. మరోపక్క పశువుల సంరక్షణ విషయంలో కూడా ప్రభుత్వం దృష్టిసారించింది. గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా పశువుల కోసం నీటి తొట్లు పునరుద్ధరణ, నిర్మాణం చేపడుతున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే ఐదు సూత్రాల వ్యూహం అమలు చేస్తోంది. నీటి క్రమశిక్షణ,పంట మార్పిడిపై రాష్ట్రప్రభుత్వం దృష్టిసారించింది. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో రైతులు నీరు ఎక్కువగా అవసరమయ్యే వరి వంటి పంటలకు బదులుగా స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని ప్రభుత్వం సూచించింది. అలాగే కృష్ణా జలాలను నియంత్రిస్తూ సమర్థవంతంగా, పొదుపుగా వాడనుంది. రిజర్వాయర్లలో నీటి మట్టాలు తగ్గుతున్నందున, తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ లభ్యతను బట్టి కృష్ణా జలాలను విచక్షణతో వినియోగించుకోవాలని నిర్ణయించింది. పోలవరం సహా 36 కీలక సాగునీటి ప్రాజెక్టులను డిసెంబర్ 2028 నాటికి పూర్తిచేయడానికి, తాగుసాగునీటి ఎద్దడిని నివారించడానికి రోడ్‌మ్యాప్ సిద్ధంచేశారు.అంతేకాకుండా పాడి పరిశ్రమను, పశువులను కాపాడేందుకు అవసరమైన మేత నిల్వలతో పాటు 20,000గోకుల షెడ్లఏర్పాటుకు చర్యలుచేపట్టారు. రైతు భరోసా కమిటీల సేవలనువిస్తృతంగా రైతులకు అందించేలా ఏర్పాట్లు చేసింది. ఇందుకుగాను గ్రామస్థాయిలో రైతన్న మీ కోసం పేరుతో యాక్షన్ కమిటీలను బలోపేతం చేసి, క్షేత్రస్థాయిలో రైతులకు తగు మార్గదర్శకాలు అందజేస్తున్నారు. ●

మన దేశంతో పాటు, తెలంగాణకు, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలకుఎల్‌నినో పరిస్థితులు కొత్త కాదు. 2015లో ఎల్‌నినో ఎఫెక్ట్ వచ్చినప్పుడు జూన్‌లో తీవ్ర ప్రభావం చూపించింది. మొదట్లో కాస్తవర్షాలు కురిసినా రానురాను వాతావరణం పొడిగా మారింది. ఈ ఏడాది కూడా ఆలస్యంగా జులైలో మొదలైన వానలు మునుపటిలాగే కాస్త మురిపించి మళ్లీ ముఖం చాటేశాయి. అందుకే ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరగక పోగా,మరింతగా అడుగంటుతున్నాయి. అంతే కాదు గతానికి భిన్నంగా వర్షాకాలంలోవేసవిని మించి విద్యుత్ వినియోగం నమోదవుతోంది. అలాగే దేశంలో 1997లోనూ శక్తిమంతమైన ఎల్‌నినో ఏర్పడింది. ఆ సమయంలో పసిఫిక్ మహా సముద్ర జలాల ఉష్ణోగ్రతలు 2 డిగ్రీలకు మించాయి. అప్పుడే భారత్‌లోనిఉత్తరాది, మధ్య రాష్ట్రాలపై ప్రభావం గట్టిగా పడింది. అయితే ఈసారి అంతకు మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉండడం వల్ల పలు రాష్ట్రాల్లో కరవు ఛాయలు నెలకొన్నాయి. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగావర్షపాతం సమానంగా ఉండదు. కొన్నిప్రాంతాల్లో సాధారణ లేదా అధిక వర్షాలు పడినా, మరికొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన కొరత ఇప్పటికే ప్రారంభమైంది. వర్షపాతం తగ్గితే వ్యవసాయం, గ్రామీణ ప్రాంతాల నీటి సరఫరా,స్థానికఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా ఖరీఫ్ పంటలపై ప్రభావం అధికంగా చూపిస్తోంది. తక్కువ వర్షాలు కేవలం వ్యవసాయానికే కాదు, పర్యావరణానికి కూడా ముప్పు అందని నిపుణులు అంటున్నారు. ఇప్పటివరకు ఎల్‌నినో పరిస్థితులు, పడిన వర్షాలను విశ్లేషిస్తే కేవలం కొన్ని రాష్ట్రాల్లోనే కంటితుడుపు వర్షం పడింది. ఎలాగూ సాగు నీటి పైఆశలు వదులుకోవాలని ముందే రైతుల్ని అప్రమత్తంచేసిన ప్రభుత్వాలు,వచ్చేనైరుతి వరకు తాగునీటికి కటకట లేకుండా ప్రణాళికలు రూపొందించుకోవడంలో నిమగ్నమయ్యాయి. జాగ్రత్తగా వాడుకోవాలనుకుంటున్నారు.

# ఆశయం మంచిదే..

రాజస్థాన్

ఆశయం మంచిదైనా, ఆచరణ కూడా మంచిదవ్వాలంటారు. మంచిదంటే అర్థం వ్యూహాత్మకంగా ఉండాలని. కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ప్రస్తుతం దేశవ్యాప్తంగా సాగిస్తున్న 'స్కూల్ ఠీక్ కరో' ఉద్యమం తీరుచూస్తుంటే సరైనవ్యూహం అనుసరిస్తున్నారా? అనే సందేహంకలుగుతుంది. జులై నెలలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మూడు వారాలు పైగా భారీ ఆందోళనలు జరిపి 'సక్సెస్' అయిన సిజెపి ఆ ఉత్సాహంతో దేశ వ్యాప్తంగా మరికొన్ని ఆందోళనలకు ఉపక్రమించింది. నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు నిరసనగా కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ చేసి పంతం నెగ్గించుకొన్న సిజెపి తదుపరి చర్యగా 'స్కూళ్లు బాగు చేద్దాం' కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా చేపట్టింది. అయితే అది అంత తేలిగ్గా పరిష్కారమయ్యేది కాదని గత రెండు మూడు రోజులుగా వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న సంఘటనలను బట్టి అనుకోవలసి వస్తుంది. శుక్రవారం సిజెపి ప్రతినిధి బృందం జైపూర్‌లో ఓ సర్కారీ బడిని తనిఖీ చేయడానికి వెళ్లగా అక్కడ వారికి ఓ చేదు అనుభవం ఎదురైంది.సిజెపి కో కన్వీనర్ అశుతోష్ రంకా నాయకత్వంలోని ప్రతినిధి బృందం రాంపురా కన్వర్ పురా గ్రామంలో ఓ బడి పరిస్థితిని పరిశీలించేందుకు వెళ్లింది. వారు గ్రామానికి చేరుకోగానేస్థానికులు చుట్టుముట్టి రాళ్లు, కర్రలతో దాడి జరిపారని అశుతోష్ ఆరోపిస్తున్నారు. పాఠశాలభవనం ప్రమాదకరంగా ఉన్నదని తెలియడంతో అక్కడకు వెళ్లామనీ,పశువుల కొట్టంలో పాఠశాల నిర్వహించడం చూసి అవాక్కయ్యామనీ ఆయన అంటున్నారు. స్థానికులు జరిపినదాడిలో తమబృందం సభ్యుని చేయి విరిగిందని ఆయన ఆరోపిస్తున్నారు. కానీ తాము దాడి జరపలేదనీ, వారిని ఎందుకు వస్తున్నారని ప్రశ్నించామనీ, ఆ మాత్రానికే వారు తమపై దౌర్జన్యం జరిపారని గ్రామస్థులు అంటున్నారు. పరస్పర ఆరోపణలుసాగుతుండగా రాజకీయ నాయకులు రంగప్రవేశం చేయడంతో వాతావరణం వేడెక్కింది. చివరికి సిజెపి బృందం వెనక్కి వెళ్లిపోయింది కానీ లేకుంటే మరింత ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడి ఉండేవి. ఇటువంటి అనూహ్య ఘటనలే మరికొన్ని రాష్ట్రాల్లో కూడా జరగడం గమనించవ లసిన అంశం. సిజెపి చీఫ్

**ఎ.వి.వి ప్రసాద్**

అయిన అభిజిత్ దీప్కే నాయకత్వంలో మరో బృందం మహారాష్ట్రలోని లాతూర్ జిల్లాలో ఓపాఠశాల పరిస్థితి పరి శీలించడానికి వెళ్లగా అక్కడ వారికి కూడా అదే విధమైన చేదు అనుభవమే ఎదురైంది. ఓ జిల్లా పరిషత్ స్కూలును తాము సందర్శించామనీ, తాము వస్తున్నామని తెలియగానే ఇతర పాఠశాలలనుంచి తెచ్చిన విద్యా ర్థులను అక్కడ కూర్చో బెట్టారనీ దీప్కే ఆరోపించారు. ఆయన చేసిన ఆరోపణ స్థానిక నేతల్లో తీవ్ర ఆగ్రహం కలిగించింది. తాము ఆపాఠశాలను ఎంతో ఆదర్శవంతంగా నిర్వహిస్తున్నామని అంటూదీప్కే ఆరోపణలను గట్టిగా ఖండించారు. ఇలా ఆరోపణలు, ప్రత్యారోపణలతో 'స్కూల్ ఠీక్ కరో' పక్కదారి పట్టినట్లుగా కనిపిస్తోంది. అసలు స్కూళ్లను తనిఖీ చేసే అధికారం సిజెపికి ఎవరిచ్చారంటూ స్థానిక నేతలు ప్రశ్నిస్తుంటే, 'మీకు అధునాతన వసతులతో కార్యాలయాలు కావాలా? చదువుకునే పిల్లలకు కనీస వసతులైనా వద్దా అని ఆయన ప్రశ్నిస్తున్నారు. దీప్కే ప్రశ్నలకు రాజకీయ నాయకులు జవాబు ఇవ్వాల్సిందే. దేశంలోని 65 శాతం ప్రభుత్వ బడులకు కనీసవసతులైనా లేవని సర్వేలు చెబుతున్న మాట వాస్తవమే. పిల్లలు కూర్చొనేందుకు బల్లలుండవు, స్వచ్ఛమైన తాగునీరు ఉండదు, టాయ్‌లెట్లు, బ్లాక్ బోర్డులు కూడా ఉండవు.శిక్షణ పొందిన టీచర్లూ ఉండరు.ఇవన్నీ కొన్ని దశాబ్దాలుగా వింటున్నవే. లక్షలకోట్లరూపాయలు ఇప్పటిదాకా ఖర్చు చేశారన్నదీ వాస్తవమే. కానీ కనిపిస్తున్న దృశ్యం వేరు. నిరుపయోగంగా ఉన్న 'పిఎం కేర్స్' నిధులను స్కూళ్ల బాగు చేయడానికి వాడవచ్చు కదా! అని దీప్కే చేసిన సూచన ఆలోచించవలసిందే. 2025 మార్చి నాటికి పిఎం కేర్స్ ఫండ్ మొత్తం నిల్వ 8,452 కోట్లు ఉన్నదనీ, ఆ సొమ్ముతో వెయ్యిపైగాస్కూళ్లను ఆధునీకరించవచ్చనీ ఆయన అంటున్నారు. అదీ నిజమే. అలాంటి నిరుపయో గంగా ఉన్న నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద ఇంకా భారీగానే ఉన్నాయి. వాటిలో కొంతశాతం వెచ్చించినా దేశంలోని స్కూళ్లన్నిటిని బాగుచేయవచ్చు. ఇందుకు దృఢమైన రాజకీయ సంకల్పం కావాలి. అధికారంలో ఉన్న నేతల్లో ఆ సంకల్పం కలగాలంటే సిజెపి వంటి యువశక్తి ముందుకు రావడం అవసరమే. అయితే వారు మరింత పకడ్బందీగా వ్యూహాలు రూపొందించుకోవలసిఉంటుంది. ప్రపంచం వైజ్ఞానికంగా ఎంతో ముందుకు వెళుతుండగా అందుకు ప్రాథమికంగా కారణమైన బడులు దీనావస్థలో ఉండడం ఎంతైనా విచారకరం. ఏదో ఒగ్రామంలో ఓ స్కూలు కాదు..దాదాపు అన్నిస్కూళ్లు అదే దుస్థితిలో ఉన్నాయి.దేశంలో 14.66లక్షల ప్రభుత్వ బడులుండగావాటిలో లక్షపైగా స్కూళ్లలో సింగిల్ టీచర్ మాత్రమే ఉన్నారు.చాలా స్కూళ్లు నిజంగా పశువుల కొట్టాల్లానే కనిపిస్తాయి.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పిస్తే ఈపరిస్థితిలో వెంటనే మార్పు తేవచ్చు. ఒకటి రెండు స్కూళ్లు సందర్శించి వివాదాస్పదం కావడం గాక వ్యవస్థలోమార్పు తేవడానికి సిజెపి వంటి యువ సంస్థలు నిర్మాణాత్మక కృషి చేస్తే బాగుంటుంది. స్కూళ్లను తనిఖీ చేసే బాధ్యత సంబంధిత విద్యాశాఖాధికారులది గనుక ఆ అధికారులు, ప్రజాప్రతినిధులు ఏంచేస్తున్నారని నిలదీయవచ్చు. ప్రశ్నించే హక్కు ప్రజలకు ఉంది. అలాగేదానికి జవాబివ్వాల్సిన బాధ్యత అధికారులకు, నేతలకూ ఉంది. అది సక్రమంగా సాగుతున్నదా, లేదా అనేఅంశంపై సిజెపి వంటిసంస్థలు నిఘా పెట్టాలి.ఏదిచేసినా హింసకు తావు లేని విధంగా ఉండాలి.అప్పుడే ఆశించిన ఫలితం కనిపిస్తుంది.అభిజిత్ దీప్కే మరో కేజ్రీవాల్ కాకూడదనే అనుకొందాం.'స్కూల్ ఠీక్ కరో' మంచి ఆశయమే. దాని సాధనకు మరింత వ్యూహాత్మకమైన మార్గాన్ని అనుసరిస్తే బాగుంటుంది. ●



అభిజిత్ దీప్కే

# ఐరాస రేసులో కరోలిన్

గయానా

ప్రపంచ దేశాలకు మార్గదర్శకత్వం పర్యవేక్షణ సంస్థగా పరిగణిస్తున్న ఐక్యరాజ్యసమితి సర్వోన్నత పదవికి ఎంపిక అనివార్యం అయింది. ప్రస్తుత సెక్రటరీ జనరల్ పదవీకాలం ఈ ఏడాదితో ముగుస్తుండటంతో ఇక రేసులోకి పలువురు రాజకీయ దురంధరులు వచ్చేసారు. ఈసారి ఐక్యరాజ్యసమితికి మహిళ నాయకత్వం వహించే అవకాశాలు ఎక్కువేనని అటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి పాశ్చాత్య దేశాలన్నీకూడా ముందు నుంచే సంకేతాలిస్తూ వస్తున్నాయి. అందరూ ఊహించినట్లుగానే తొలి రెండు దశల ఓటింగ్‌లోనూ కూడా మహిళా నాయకురాలే రేసులోకి వచ్చింది. తదుపరి సెక్రటరీ జనరల్ ఎంపికకు సంబంధించి శుక్రవారం భద్రతా మండలి నిర్వహించిన అనధికారిక స్ట్రా పోల్‌లో గయానా మాజీ విదేశాంగ మంత్రి కరోలిన్ రోడ్రిగ్స్ బిర్కెట్ అగ్రస్థానంలో నిలిచారు. ఎనిమిది మంది అభ్యర్థులకు మండలిలో ఎంతమేర మద్దతు ఉందో అంచనా వేసేందుకు ఈపోలింగ్ నిర్వహించారు. మొత్తం 15మంది సభ్యులున్న ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో ఆమెకు ఎనిమిది మంది మద్దతు పలికారు. అనధికారికంగా వెలువడిన లెక్కల ప్రకారం ఆమెకు అత్యధిక మద్దతు లభించింది. గతనెలలో జరిగిన తొలి అనధికారిక పోలింగ్లో రెండోస్థానంలో నిలిచిన రోడ్రిగ్స్ బిర్కెట్, ఈసారి తొలి స్థానంలో నిలిచిన యూఎన్ ట్రేడ్ అండ్ డెవలప్మెంట్ అధిపతి రెబెక్కా గ్రిన్‌స్పాన్‌ను అధిగమించారు. అయితే 15 మంది సభ్యులున్న భద్రతా మండలిలో ఏ అభ్యర్థికీ ఎన్నికకు అవసరమైన తొమ్మిది ఓట్లు రాలేదు. అనధికారిక లెక్కల ప్రకారం రోడ్రిగ్స్ బిర్కెట్‌కు 8 అనుకూల ఓట్లు,3వ్యతిరేక ఓట్లు, 4 తటస్థఓట్లు వచ్చాయి. నిజాయితీ, పారదర్శకమైన ఎన్నిక కోసం ప్రచారం చేస్తున్న 1 ఫర్ 8 బిలియన్ అంటే వన్‌ఎఫ్8బి సంస్థ, యూఎన్ వ్యవహారాలను కవర్ చేసే మీడియా సంస్థ పాస్‌బ్లూ ఈ లెక్కలను వెల్లడించాయి. రేసులో పోటీ అభ్యర్థులను అధిగమించినా రోడ్రిగ్స్ బిర్కెట్‌కుముందున్న మార్గం అంత సులభం కాదు. ఆమెకు కనీసం 9 ఓట్లు రావడంతో పాటు, వ్యతిరేక ఓట్లలో వీటో అధికారం కలిగిన ఐదు శాశ్వత సభ్య దేశాల్లో ఏ ఒక్కటి కూడా ఉండకూడదు. గత

**గన్ని మోహన్**

నెలతో పోలిస్తే రోడ్రిగ్స్ బిర్కెట్ అనుకూల ఓట్లు ఒకటి తగ్గాయి. అదే సమయంలో వ్యతిరేకఓట్లు ఒకటి పెరిగాయి. మరోవైపు గ్రిన్స్‌పాన్ మద్దతు గణనీయంగా తగ్గింది. జూలైలో జరిగినపోలింగ్లో ఆమెకు 10 ఎంకరేజ్ ఓట్లు రాగా, ఈసారి అవి 7కు పడిపోయాయి. వ్యతిరేక ఓట్లుమాత్రంఒకటి నుంచి నాలుగుకు పెరిగాయి. ప్రారంభ దశలో జరిగే ఈ స్ట్రా పోల్‌లో శాశ్వత సభ్య దేశాలు ఏ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నాయో తెలుసుకోవడం సాధ్యం కాదు. అధికారికంగా స్ట్రా పోల్స్ గోప్యమైనవి. ఈ నెల భద్రతా మండలి అధ్యక్షురాలిగా ఉన్న డెన్మార్క్ శాశ్వత ప్రతినిధి క్రిస్టినా లాసెన్ ఫలితాలను వెల్లడించేందుకు నిరాకరించినప్పటికీ ఫలితాలు అనధికారికంగా బయటకు వచ్చాయి. భద్రతా మండలి ఎంపిక చేసే అభ్యర్థిని సెక్రటరీ జనరల్ పదవికి జనరల్ అసెంబ్లీ సిఫారసు చేస్తుంది. కోస్టారికా మాజీ ఉపాధ్యక్షురాలు అయిన గ్రిన్‌స్పాన్ మద్దతు ఒక్కసారిగా తగ్గడం ద్వారా ఈ పోటీ ఇంకా అనిశ్చితంగానే ఉందని స్పష్టమవుతోంది. వీటో అధికారం కలిగిన రష్యాశాశ్వత ప్రతినిధి వాసిలీనెబెంజియా కూడా ఈ అవకాశాన్ని కొట్టిపారేయలేదు. గత నెల పోలింగ్ తర్వాత పోటీలోకి వచ్చిన అమెరికా, ఫ్రాన్స్‌కు మాజీ ఈక్వెడార్ రాయబారి ఇవోన్ ఎ. బాకికి ఒక్క అనుకూల ఓటు కూడా రాలేదు. ఆమెకు 8 వ్యతిరేక ఓట్లు వచ్చాయి. అర్జెంటీనాకు చెందిన అంతర్జాతీయ అణుశక్తి సంస్థ అధిపతి రఫేల్ గ్రోస్సీకి 7 అను కూల, 6 వ్యతిరేక ఓట్లు లభించాయి. దీంతో ఆయన మూడో స్థానంలోనే కొనసాగారు. ఇతర అభ్యర్థుల్లో చిలీ మాజీ అధ్యక్షురాలు, ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మాజీ హైకమిషనర్ మిచెల్ బాచెలెట్, జనరల్ అసెంబ్లీ మాజీ అధ్యక్షురాలు, ఈక్వెడార్ మాజీ విదేశాంగ మంత్రి మరియా ఫెర్నాండా ఎస్పినోసా, యూఎన్‌మాజీ అండర్ సెక్రటరీ జనరల్, ఉగాండా మాజీ విదేశాంగ మంత్రి ఒలారా ఒటున్ను, సెనెగల్ మాజీ అధ్యక్షుడు మాకీ సాల్ ఉన్నారు. ఈఎన్నికపైనా అగ్రరాజ్యం అగ్గిరాజేస్తోందనే చెప్పాలి. స్ట్రాపోల్, తదుపరి సెక్రటరీజనరల్ ఎంపికతీరుపైనా అమెరికా తన నిరసన వ్యక్తంచేసింది. భద్రతా మండలిలో సభ్యదేశం కావడం, అత్యధికంగా నిధులు అందచేసే దేశం కావడంతో సహజంగానేఅమెరికా పెత్తనంచేసేందుకే మొగ్గుచూపిస్తుంది. అమెరికా కనుసన్నల్లోనే ఈ ఎంపిక జరగాలన్న లక్ష్యంతో అగ్రరాజ్యం ఉంది. ప్రస్తుత సర్వప్రతినిధులసభ అధ్యక్షురాలు అన్నాలీనా బేర్‌బాక్‌పై ట్రంప్ ప్రభుత్వం తీవ్రస్థాయిలోనే అభ్యంతరాలు లేవనెత్తింది. శాశ్వత సభ్యదేశాల మధ్య రహస్య చర్చలకు బదులుపార దర్శకమైన ప్రక్రియ ఉండాలని సర్వప్రతినిధుల సభ అధ్యక్షురాలు పేర్కొంటుండటమే అమెరికా ఆగ్రహానికి కారణమైంది. ఆమె ఐక్యరాజ్యసమితి విధివిధానాలకు వ్యతిరేకంగా ఉన్నారంటూమండి పడింది. ఈఅంశంలో శత్రుదేశమైన రష్యా కూడా అమెరికాకు వంతపాడటం చూస్తుంటే సమితి సెక్రటరీ జనరల్ ఎంపిక మా కనుసన్నల్లోనే జరగాలన్న డిమాండ్‌కనిపిస్తోంది. ఎన్నిక ప్రక్రియ భద్రతా మండలి శాశ్వత సభ్య దేశాలమధ్య రహస్య చర్చలకు మాత్రమే ప్రాధాన్యం ఉండాలన్న డిమాండ్ రష్యా, అమెరికాలు తెరపైకి తీసుకురావడమే బేర్‌బాక్‌పై నిరసన పెరగడానికి కారణం అని తెలుస్తోంది. అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ ఈ ఐదుదేశాల్లో ఏ ఒక్క దేశం అయినా తమ వీటో అధికారంతో ఎన్నికను అడ్డుకోవచ్చు. రహస్యంగానే ఎంపిక ఉండాలన్న మెజార్టీ దేశాల డిమాండ్‌ను అధిగమించి బేర్‌బాక్ తన పరిధిని అతిక్రమించారంటూ అమెరికా వాదన తెరపైకి తెచ్చింది. రెండో దఫా జరిగిన స్ట్రాపోల్‌లో శాశ్వత సభ్యదేశాల్లో రోడ్రిగ్స్‌కు ఏదేశాలు వ్యతిరేక ఓటు వేసాయన్నదే ఇప్పుడు అంతుబట్టకుండా ఉంది. ●



కరోలిన్ రోడ్రిగ్స్ బిర్కెట్

# అంతరించే దిశగా వలస పులస చేప

'పుస్తెలు అమ్ముకునైనా పులస తినాలి' అనే సామెత ఒకప్పుడు గోదావరి ప్రాంత ప్రజల జీవన సంస్కృతిని ప్రతిబింబించింది. కానీ నేడు అదే పులస అంతరించే జీవజాతుల జాబితాలో చేరే ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. ఒకప్పుడు గోదావరిలో వందల సంఖ్యలో లభించిన ఈ అరుదైన వలస చేప, ఇప్పుడు అరుదుగా కనిపిస్తోంది. ఇది కేవలం ఒక చేప అంతరించే ప్రమాదం మాత్రమే కాదు, గోదావరి జీవవైవిధ్యం, వేలాది మత్స్యకార కుటుంబాల జీవనాధారం, తెలుగు ప్రజల ఆహార వారసత్వం క్రమంగా కనుమరుగయ్యే సంకేతం. దేశంలోనే అత్యంత జీవవైవిధ్యం కలిగిన నదులలో గోదావరి ఒకటి. వివిధ అధ్యయనాల ప్రకారం ఈ గోదావరి పరివాహక ప్రాంతంలో 100కుపైగా స్వదేశీ చేపల జాతులు నమోదయ్యాయి. వాటిలో పులస, జాతికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. గోదావరి వరదలు,పులస చేపలు, తెలుగు ప్రజల ఆహార సంస్కృతి ఈ మూడింటికీ విడదీయరాని అనుబంధం ఉంది. ప్రతి ఏడాది జులై,ఆగస్టు నెలల్లో గోదావరి ఉప్పొంగుతుంటే, పులస చేపల కోసం ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తారు. గత పదేళ్లుగా వాటి లభ్యత క్రమంగా తగ్గిపోగా, ఈ ఏడాది పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. పులస అనేది సాధారణ నదీ చేపకాదు. ఇది ప్రపంచవ్యాప్తంగా హిల్సాగా ప్రసిద్ధి చెందిన వలస చేప. బంగ్లాదేశ్‌లో దీనిని 'ఇలిష్', పశ్చిమ బెంగాల్‌లో 'ఇలిష్', ఒడిశాలో 'ఇలిశీ', మన ప్రాంతంలో సముద్రంలో ఉన్నప్పుడు 'విలస', గోదావరిలోకి ప్రవేశించిన తర్వాత 'పులస'గా పిలుస్తారు. ప్రపంచంలో అత్యధికంగా హిల్సా చేపలు బంగ్లాదేశ్‌లో లభిస్తాయి. ప్రపంచ హిల్సా ఉత్పత్తిలో దాదాపు 80-86 శాతం వాటా ఆ దేశానిదే. భారతదేశంలో పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాలు ఈ చేపకు ప్రధాన నివాస ప్రాంతాలుగా ఉన్నాయి. పులస జీవిత చక్రం అత్యంత విశిష్టమైనది. సముద్ర జలాల్లో పెరిగిన విలస చేపలు సంతానోత్పత్తి కోసం వేల కిలోమీటర్లుఈదుకుంటూ బంగాళాఖాతం నుంచి గోదావరి ముఖద్వారం వరకు చేరుకుంటాయి. వరద ప్రవాహాన్ని ఎదురీదుతూ నదిలోకి ప్రవేశించి గుడ్లు పెడతాయి. ఈ ప్రయాణంలో వాటి శరీరంలో జీవరసాయన మార్పులు చోటుచేసుకుంటాయి. సముద్రంలోని తెల్లటి వెండివర్ణం క్రమంగా గోధుమ, ఎరుపు రంగుల్లోకి మారుతుంది. ఈమార్పు వల్లే విలస పులసగారూపాంతరం చెందుతుంది. సంతానోత్పత్తి పూర్తయిన తర్వాత పిల్లలతో తిరిగి సముద్రంలోకి వెళ్తుంది. ఈ వలస ప్రయాణమే పులస ప్రత్యేకతకు, దాని రుచికి కారణమని మత్స్య శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఒకప్పుడు ధవళేశ్వరం, రాజమహేంద్రవరం, యానాం, నరసాపురం, అంతర్వేది ప్రాంతాల్లో పెద్దఎత్తున లభించిన పులసలు నేడు అరుదుగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో పులస పేరుతో విక్రయిస్తున్న చేపల్లో చాలావరకు ఒడిశా ప్రాంతంలో పట్టిన విలస చేపలే ఉంటున్నాయని మత్స్యకారులు చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితులలో నిజమైన గోదావరి పులస చేప చాలా అరుదుగా దొరకడంతో ధరలుఅమాంతం పెరిగాయి.ఒక కేజీ బరువు ఉన్న పులస ధర రూ.10 వేల నుంచి రూ.25వేల వరకు పలికిన సందర్భాలున్నాయి. కొన్ని సార్లు వేలం పాటల్లో అంతకంటే ఎక్కువ ధర కూడా నమోదైంది. ఈకారణంగా ఒకప్పుడు సాధారణ ప్రజలు కూడా కొనుగోలు చేసిన పులస, నేడు కేవలం ధనికుల ఆహారంగా మారిపోవడం విచారకరం. గోదావరి నదిలో పులసల సంఖ్యతగ్గిపోవడానికి అనేక కారణాలున్నాయి. వాటిలో మొదటిది సముద్ర ముఖద్వారం వద్ద ఇసుక మేటలు పేరుకుపోవడం. దీనివల్ల గోదావరిలోకి చేపల

**రుద్రరాజు శ్రీనివాసరాజు**

ప్రవేశానికి సహజ మార్గం సంకుచితమవుతోంది. రెండోది సముద్రంలో చమురు,సహజవాయువు అన్వేషణలు.సముద్ర అడుగుభాగంలో జరుగుతున్న శబ్దకాలుష్యం, తవ్వకాలు, యంత్రాల కంపనలు చేపల సహజ వలస మార్గాన్ని ప్రభావితం చేస్తున్నాయి. మూడవది గోదావరి కాలుష్యం. రాజమహేంద్రవరం, ధవళేశ్వరం పరిసరాల్లోని పరిశ్రమల నుంచి



విడుదలవుతున్న శుద్ధిచేయని వ్యర్థాలు నదిలో కలుస్తున్నాయి. దీంతో నీటిలో ఆక్సిజన్ స్థాయులు తగ్గి అనేక జలచరాల మనుగడకు ప్రమాదం ఏర్పడుతోంది.ఇప్పటికే కొన్ని స్వదేశీ చేపల జాతులు గణనీయంగా తగ్గిపోయాయి.పులస కూడా ఈ కాలుష్యాన్ని తట్టుకోలేకపోతోంది. ఇక గోదావరి పాయల్లో విచ్చలవిడిగా విస్తరిస్తున్న రొయ్యల సాగు కూడా మరో ప్రధాన కారణం. పర్యావరణ అనుమతులులేకుండానే అనేక ప్రాంతాల్లో రొయ్యల చెరువులు ఏర్పాటు చేస్తున్నారు. వాటిలో వినియోగించే యాంటీబయాటిక్స్, రసాయనాలు తిరిగి గోదావరిలోకి చేరి నీటి నాణ్యతను దెబ్బతీస్తున్నాయి. ఈకాలుష్యం పులస గోదావరిలోకి ప్రవేశించేందుకు ప్రతికూల పరిస్థితులను సృష్టిస్తోంది. వాతావరణ మార్పులు కూడా పులసపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. గోదావరి వరదల సమయం, దాని తీవ్రతలో హెచ్చుమార్పులు వస్తున్నాయి. కొన్నిసంవత్సరాల్లో వరదలు ఆలస్యంగా రావడం, మరికొన్ని సందర్భాల్లో అతివృష్టి కారణంగా అసాధారణ ప్రవాహాలు ఏర్పడడం వంటి కారణాలు చేత చేపల వలస చక్రం దెబ్బతింటోంది. మత్స్య నిపుణుల అభిప్రాయం ప్రకారం సాధారణ వరద ప్రవాహంలో గంటకు 50-60 కిలోమీటర్ల వేగంతో ఎదురీదగల పులస, అత్యంత ఉధృతమైన ప్రవాహాన్ని అధిగమించలేక వెనుదిరిగే అవకాశమూ ఉంటుంది. అలాగే సంతానోత్పత్తి కాలంలోనే విచక్షణారహితంగా చేపల వేట సాగుతోంది. గుడ్లు పెట్టడానికి నదిలోకి ప్రవేశించే చేపలను పెద్దఎత్తున పట్టడం వల్ల తదుపరి తరాల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. ప్రపంచంలోని అనేకదేశాల్లో ఇలాంటి వలస చేపల వేటపై సంతానోత్పత్తి కాలంలోపూర్తి స్థాయి నిషేధం అమలు చేస్తున్నారు. ముఖ్యంగా ప్రపంచంలో అత్యధిక హిల్సా చేపలు లభించే బంగ్లాదేశ్‌లో ఈ చేప అంతరించి పోకుండా ఉండటానికి పటిష్ట చర్యలు చేపట్టారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో నిర్మితం అవుతున్న పోలవరం ప్రాజెక్ట్‌వలన కూడా అత్యంత అరుదైన పులసల వలసకు ప్రధాన ఆటంకంగా మారుతుందని కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ గుర్తించింది. ఈ సమస్య పరిష్కారానికై ఏర్పాటు చేయబడ్డ సెంట్రల్ ఇన్ల్యాండ్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ విలువైన సూచనలు చేసింది.ఈ సంస్థ చేసిన సూచనలు మేరకు ప్రాజెక్ట్‌వద్ద గోదావరి నదిలోవరద ప్రవాహం ఏ స్థాయిలో ఉన్నా పులసలు స్వేచ్ఛగా తిరిగేలా మూడు చోట్ల ఫిష్ ల్యాడర్ గేట్లను అమర్చడం జరిగింది.ఈ గేట్ల వలన నదిలో నీటిమట్టం గరిష్టంగా ఉన్నా, సాధారణంగా ఉన్నా, కనిష్టంగా ఉన్నా ఈ చేప ఎగువకు, దిగువకు స్వేచ్ఛగా రాకపోకలు సాగించేందుకు అనుకూలంగా ఉంటాయి.డ్యామ్ అడ్డుగా ఉన్నప్పటికీ పులసలు ఎగువ ప్రాంతాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వెళ్లి సంతానోత్పత్తి జరుపుకోవడానికి ఈ వ్యవస్థ సహకరిస్తుంది. మొత్తం మీద ప్రపంచంలోనే "ఒక చేప జాతి సహజ వలస ప్రవర్తనను అధ్యయనం చేసి దాని స్వేచ్ఛకు విఘాతం కల్పించకుండా నిర్మిస్తున్న ఏకైక ప్రాజెక్టు పోలవరమేనని పర్యావరణ నిపుణులు స్పష్టంచేస్తున్నారు. చేపల సహజ సంచారాన్ని దృష్టిలో ఉంచుకొని ఫిష్ ల్యాడర్ల నిర్మాణం చేపట్టడం ఎంతైనా అభినందనీయమే. అయితే ఫిష్ ల్యాడర్ ఒక్కటి మాత్రమే దీనికి పరిష్కారం కాదు. నదికి జీవం ఇచ్చేది స్వచ్ఛమైన ప్రవాహమే. 'దాని కోసం ముందుగా సముద్రం నుంచి గోదావరిలోనికి చేపలు సురక్షితంగా చేరుకునే పరిస్థితులను కూడా ప్రభుత్వం కల్పించాలి. దానికి అత్యవసరంగా సముద్ర ముఖద్వారంలో ఉండే ఇసుక మేటలను శాస్త్రీయంగా తొలగించాలి. పరిశ్రమల వ్యర్థాలను పూర్తిగా శుద్ధిచేసిన తర్వాతే నదిలోకి విడుదల చేసేలా కఠినపర్యవేక్షణ ఉండాలి. అక్రమ రొయ్యల సాగును నియంత్రించాలి. సంతానోత్పత్తి కాలంలో పులస వేటపై తాత్కాలిక నిషేధం విధించి మత్స్యకారులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి.పులస సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చి స్థానిక మత్స్యకారులను భాగస్వాములను చేయాలి. గోదావరిలో పులస జనాభాపై ప్రతి ఏడాది శాస్త్రీయ సర్వే నిర్వహించి ప్రజలకు నివేదికలు విడుదలచేయడం వంటి చర్యలు చిత్తశుద్ధితో అమలు చేయాలి. ఒకసారి అంతరించిపోయిన జీవజాతిని జీవవైవిధ్యాన్ని తిరిగి తీసుకురావడం దాదాపు అసాధ్యం. అందువలన పులసను కాపాడుకోవడం అంటే కేవలం ఒక చేప జాతిని రక్షించడం మాత్రమే కాదు, గోదావరి నదీ సంస్కృతిని, జీవవైవిధ్యాన్ని, ప్రకృతి సమతుల్యతను, భావితరాల హక్కును కాపాడుకోవడమే అవుతుంది. ●

# చెక్కుల మోసాలకు ఇక చెక్




## సైబర్ నేరాలు అరికట్టేందుకు కొత్త భద్రతా ఫీచర్లు

## ఆల్ఫాన్యూమరిక్ కోడ్‌తో కొత్త చెక్‌బుక్‌లు రెడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** చెక్కులరూపంలో మోసాలను అరికట్టి, లావాదేవీల భద్రతను పెంచే లక్ష్యంతో బ్యాంకులు సరికొత్త చెక్ బుక్‌లను జారీ చేస్తున్నాయి. వీటిలో ఆల్ఫాన్యూమరిక్ కోడ్ అనే ప్రత్యేకమైన భద్రతా ఫీచర్‌ను జోడిస్తున్నాయి. ఇటీవల బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి పలు బ్యాంకులు తమ చెక్కులపై ఆల్ఫాన్యూమరిక్ కోడ్‌ను ప్రవేశపెట్టాయి. పాత చెక్ బుక్‌ల స్థానంలో ఈ కొత్త సిరీస్ చెక్ బుక్‌లను తీసుకోవాలని తమ ఖాతాదారులకు సూచిస్తున్నాయి. అక్షరాలు, అంకెల కలయికతో ఉండే ఈ కోడ్, చెక్కులను క్లియరింగ్ సమయంలో సులభంగా గుర్తించి, ధ్రువీకరించ డానికి సహాయపడుతుంది. తద్వారా నకిలీ లేదా ట్యాంపరింగ్ చేసిన చెక్కుల ద్వారా జరిగే మోసాలకు అడ్డుకట్ట వేయవచ్చని బ్యాంకులు భావిస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా చెక్ ట్రంకేషన్ సిస్టమ్ ద్వారా చెక్ క్లియరింగ్ వ్యవస్థను వేగవంతం, పటిష్ఠం చేస్తోంది. ఈ విధానంలో చెక్ భౌతికంగా కాకుండా, దాని ఎలక్ట్రానిక్ ఇమేజ్ ద్వారా క్లియరింగ్ జరుగుతుంది. దీంతో సమయం ఆదా అవ్వడంతో పాటు భద్రత కూడా పెరుగుతుంది. కొన్ని రకాల పాత చెక్కులకు, ముఖ్యంగా రూ. 50,000 లేదా అంతకంటే ఎక్కువ విలువైన వాటికి 2026 డిసెంబర్ 31 చివరి గడువు అంటూ కొన్ని నివేదికలు వస్తున్నాయి. ఇది అన్ని బ్యాంకులకు వర్తించే ఆర్‌బీఐ అధికారిక గడువు కాదని ఆర్బీఐ చెపుతోంది. ప్రతి బ్యాంకుకు దాని సొంత నిబంధనలు ఉండవచ్చు. కాబట్టి, మీ పాత చెక్ బుక్ చెల్లుబాటు అవుతుందో లేదో తెలుసుకోవడానికి, మీ బ్యాంకు అధికారిక వెబ్‌సైట్‌ను చూడటం లేదా నేరుగా బ్రాంచ్‌ను సంప్రదించడం ఉత్తమమైన మార్గం.

ముఖ్యంగా వ్యాపారం, ఆస్తుల కొనుగోలు, రుణాలు వంటి అధిక విలువ కలిగిన చెల్లింపులు చేసేవారు తమ బ్యాంకు సూచనలను తప్పక పాటించాలి. మీ పాత చెక్ బుక్‌ను మార్చుకోవాలని బ్యాంకు సూచిస్తే, తదుపరి లావాదేవీకి ముందే ఆ పని పూర్తి చేయడం మంచిది. కొత్త చెక్ బుక్ ఖరీదు బ్యాంకును, ఖాతా రకాన్ని బట్టి మారుతుంది. ఉదాహరణకు, బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవింగ్స్ ఖాతాదారులకు ఒక ఆర్థిక సంవత్సరంలో 25 చెక్ లీఫ్‌లను ఉచితంగా అందిస్తుంది. అదనపు చెక్కులకు సేవా ఛార్జీలు వర్తిస్తాయి. డిజిటల్ చెల్లింపులు పెరిగినప్పటికీ, లావాదేవీలకు పక్కా రికార్డు ఉండటం కోసం చాలామంది ఇప్పటికీ చెక్కులనే వినియోగిస్తున్నారు. చెక్కుపై రాసిన తేదీ నుంచి మూడు నెలల వరకు మాత్రమే అది చెల్లుబాటులో ఉంటుంది. ఒకవేళ చెక్ బౌన్స్ అయితే, నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్1881 లోని సెక్షన్ 138 ప్రకారం చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. కాబట్టి, చెక్ లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండటం మంచిది.



## మరో రెండు వారాల్లో
# జిన్‌పింగ్ అమెరికా పర్యటన
## స్వయంగా వెల్లడించిన ట్రంప్

**వాషింగ్టన్, ఆగస్టు 22:** చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మరో రెండు వారాల్లో అమెరికా పర్యటనకు రానున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. పర్యటన తేదీ, సమావేశ వేదిక, చర్చల అజెండాపై ఆయన ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. దక్షిణ కరోలినాలోని మిర్టిల్ బీచ్‌లో జరిగిన రిపబ్లికన్ ప్రచార సభలో ట్రంప్ ఈ విషయాన్ని ప్రకటించారు. వైట్‌హౌస్‌లో ప్రతిపాదిత బాల్‌రూమ్ నిర్మాణం గురించి మాట్లాడుతున్న సమయంలో షీ పర్యటన ప్రస్తావన తీసుకొచ్చారు. ప్రస్తుతం ఉన్న ఈస్ట్‌రూమ్‌లో కేవలం 88 మందికే చోటుందని ట్రంప్ చెప్పారు. ఎక్కువ మంది విదేశీ ప్రతినిధులు వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. షీ పర్యటన సమయానికే కొత్త బాల్‌రూమ్ అందుబాటులో ఉంటే బాగుండేదని వ్యాఖ్యానించారు. వైట్‌హౌస్ ప్రాజెక్టుకు అమెరికా సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చిందని ట్రంప్ తెలిపారు. కొత్త సముదాయంలో డ్రోన్లు, క్షిపణుల నుంచి రక్షణ కల్పించే సైనిక సదుపాయాలు ఉంటాయని చెప్పారు. బుల్లెట్‌ప్రూఫ్ గ్లాస్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మరోవైపు, చైనా సహా పలు దేశాలపై టారిఫ్‌ల విధానాన్ని ట్రంప్ మరోసారి సమర్థించుకున్నారు. అమెరికాలోనే పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా విదేశీ కంపెనీలపై ఒత్తిడి పెరిగిందని చెప్పారు. అమెరికాలో పెట్టుబడులు భారీగా పెరుగుతున్నాయని, కర్మాగారాల నిర్మాణం వేగంగా సాగుతోందని పేర్కొన్నారు. చైనా అమెరికా మధ్య వాణిజ్య, సాంకేతిక రంగాల్లో తీవ్ర విభేదాలు కొనసాగుతున్న వేళ షీ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది.

## 75 దేశాలకు వీసాల నిలిపివేత కేసు
# ట్రంప్‌కు కోర్టు షాక్

**వాషింగ్టన్, ఆగస్టు 22:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు స్థానిక కోర్టులో షాక్ తగిలింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, రష్యా సహా మొత్తం 75 దేశాల పౌరులకు తమ దేశ ఇమిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్‌ను నిలిపివేయాలని ఈ యేడాది జనవరిలో ట్రంప్ సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని న్యాయస్థానం కొట్టేసింది.

10ఈ ప్రకటన ఫెడరల్ వలస చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని యుఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి జీనెట్ వెల్లడించారు. వలస వీసాల విషయంలో కాన్సులేట్ అధికారుల జోక్యంపై విదేశాంగ కార్యదర్శికి ఉన్న అధికారాన్ని ఆ చట్టం తొలగించిందన్నారు. వారి వీసాలను నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు.

'75 దేశాల వ్యక్తులు అమెరికా ప్రజల నుంచి ఆమోదయోగ్యం కానంత అధికంగా సంక్షేమ ఫలాలు పొందుతున్నారు! అందుకే వారికి ఇమ్మిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్‌ను నిలిపివేయాలని నిర్ణయించాం.

కొత్త వలసదారులు అమెరికన్ల సంపదను సంగ్రహించకుండా రక్షణ కల్పించేంతవరకూ, వారి మాకు భారంగా మారరని నిర్ధారణ అయ్యేంత వరకూ ఈ నిలిపివేత అమలులో ఉంటుంది. ట్రంప్ సర్కారు ఎప్పుడూ అమెరికా ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తుంది' అని ఆ దేశ విదేశాంగ శాఖ అప్పట్లో పేర్కొన్న విషయం తెలిసిందే.

## ఈ మందులు 4 యేళ్లలోపు
# పిల్లలకు వాడొద్దు
## కేంద్రం అడ్వయిజరీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** నాలుగేళ్లలోపు పిల్లలకు క్లోరిఫెనిరమైన్ మలేట్, క్లోరిఫినైల్‌ఫ్రైన్ హైడ్రోక్లోరైడ్‌తో కూడిన ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ (ఎఫ్‌డిసి) ఔషధాల వాడకంపై కేంద్రం ఆంక్షలు విధించింది. ఈ ఔషధాల తయారీ, విక్రయాలు, పంపిణీని పరిమితం చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. సాధారణంగా జలుబు, దగ్గు, అలర్జీ వంటి సమస్యల నివారణకు వాడే ఔషధాలలో ఈ కాంబినేషన్‌ను వినియోగిస్తారు. ఇకపై ఈ మందుల లేబుల్స్, ప్యాకేజీలపై ఈ ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్‌ను నాలుగేళ్ల లోపు పిల్లలకు ఇవ్వరాదు అనే హెచ్చరికను తప్పనిసరిగా ముద్రించాలని ఔషధ తయారీ సంస్థలను ప్రభుత్వం ఆదేశించింది. నిపుణుల కమిటీ, డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్ (డిటిఎబి) చేసిన సిఫార్సులమేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. గతంలో 2025 ఏప్రిల్ 15న ఈ సమ్మేళనాలు కలిగిన కొన్ని ఎఫ్‌డిసి మందులపై మాత్రమే ప్రభుత్వం ఇలాంటి ఆంక్షలు విధించగా, తాజా ఉత్తర్వుల ద్వారా ఈ నిబంధనను అన్ని రకాల ఫార్ములేషన్లకు వర్తింపజేసింది. నాలుగేళ్లలోపు చిన్నారులపై ఈ మందులు ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని, వీటికి బదులుగా సురక్షితమైన ప్రత్యామ్నాయ ఔషధాలు అందుబాటులో ఉన్నాయని నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్1940లోని సెక్షన్ 26ఏ కింద కేంద్ర ప్రభుత్వం ఈ నోటిఫికేషన్‌ను జారీ చేసింది.

## కర్ణాటకలో అనలాగ్ పనీర్‌పై
# యేడాది నిషేధం



**బెంగళూరు, ఆగస్టు 22:** కర్ణాటకలో పనీర్ పేరుతో విక్రయిస్తున్న అనలాగ్ లేదా నాన్‌డెయిరీ పనీర్ తయారీ, నిల్వ, పంపిణీ, రవాణా, హోల్‌సేల్, రిటైల్ విక్రయాలతో పాటు అమ్మకానికి ప్రదర్శించడం, సరఫరా చేయడంపై రాష్ట్ర ఆహార భద్రత, ఔషధ పరిపాలనా శాఖ నిషేధం విధించింది. ఈ ఉత్తర్వులు ఒక యేడాది పాటు అమల్లో ఉంటాయి. పాల కొవ్వు లేదా పాల ఘనపదార్థాలను పూర్తిగా లేదా పాక్షికంగా వెజిటబుల్ ఆయిల్, వెజిటబుల్ ఫ్యాట్ లేదా ఇతర నాన్ డెయిరీ పదార్థాలతో భర్తీ చేసి పనీర్ రూపంలో తయారు చేసిన ఉత్పత్తిని అనలాగ్/నాన్‌డెయిరీ పనీర్‌గా పరిగణిస్తామని అధికారులు తెలిపారు. ఇలాంటి ఉత్పత్తులను పనీర్ పేరుతో లేబుల్ చేయడం, మార్కెట్ చేయడం, విక్రయించడం లేదా వినియోగదారులకు పనీర్‌గా చూపించడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసమే కర్ణాటకలో అధికారులు పలు పనీర్ నమూనాలను పరీక్షించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. వినియోగదారులను తప్పుదారి పట్టించకుండా, ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు ఈ నిషేధం విధించినట్లు ఆహార భద్రతా శాఖ తెలిపింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ఫుడ్‌ప్రొడక్ట్స్ స్టాండర్డ్స్ అండ్ ఫుడ్‌అడిటివ్స్) రెగ్యులేషన్స్, 2011 ప్రకారం పనీర్‌అనేది పాలతో తయారు చేసే ప్రమాణీకరించిన ఆహార ఉత్పత్తి అని అధికారులు పేర్కొన్నారు. ఇందులో పాల కొవ్వు కీలకమైన పదార్థమని, దాని స్థానంలో వెజిటబుల్ ఆయిల్, వెజిటబుల్ ఫ్యాట్ లేదా ఇతర నాన్‌డెయిరీ పదార్థాలను ఉపయోగించడం అనుమతించబడదని తెలిపారు.

## 15 అడుగుల కొండచిలువకు కేన్సర్
## మనుషులకు చేసే చికిత్సతో
## నయం చేసిన బ్రిటన్ వైద్యులు

**లండన్, ఆగస్టు 22:** బ్రిటన్ వైద్యులు అరుదైన వైద్యంతో ఓ కొండచిలువకు ప్రాణంపోశారు. కేన్సర్‌తో పోరాడుతున్న 15 అడుగుల కొండచిలువకు మనుషులకు ఉపయోగించే అధునాతనచికిత్స అందించి నయం చేశారు. దవడలోని ప్రాణాంతక కణితిని తొలగించడంతోపాటు ఎలక్ట్రో కెమోథెరపీ నిర్వహించడంతో కేన్సర్ నుంచి పూర్తిగా కోలుకుంది. ప్రస్తుతం మళ్లీ చురుగ్గా, ఆరోగ్యంగా ఉన్నట్లు బ్రిటన్‌లోని చెస్టర్ జూ వెల్లడించింది. ఇంగ్లాండ్‌లోని చెస్టర్ జూలో ఉన్న 23 యేళ్ల రెటిక్యులేటెడ్ పైథాన్ 'జోడీ ఫోస్టర్' ఇటీవల అనారోగ్యానికి గురైంది. సుమారు 50కిలోల బరువున్న ఈ కొండచిలువ కొంతకాలంగా ఆహారం తీసుకోవడం తగ్గించింది. చురుకుదనం కూడా తగ్గింది. దీంతో జూ సిబ్బంది వైద్యపరీక్షలు చేయగా.. దాని దవడలో ఫైబ్రోసార్కోమా అనే ప్రాణాంతక కేన్సర్ కణితి ఉన్నట్లు తేలింది. దీంతో వైద్యులు శస్త్రచికిత్స చేసి కేన్సర్ కణితిని తొలగించారు. అయితే కొంతకాలానికి కేన్సర్ మళ్లీ తిరగబడింది. ఈసారి దవడతోపాటు ఎముకలోకి కూడా కేన్సర్ కణితి వ్యాపించడాన్ని వైద్యులు గుర్తించారు. దీంతో మరోసారి శస్త్రచికిత్స చేయడం మాత్రమే సరిపోదని వైద్యులు భావించారు. దానికి ఎలాంటి చికిత్స అందించాలనే దానిపై చెస్టర్ జూ వెటర్నరీ బృందం.. యూనివర్సిటీ ఆఫ్ లివర్‌పూల్ కేన్సర్ నిపుణులను సంప్రదించింది. అందరూ కలిసి ఎలక్ట్రోకెమోథెరపీ అనే అధునాతన వైద్య చికిత్సను కొండచిలువకు అనుగుణంగా మార్చడం ద్వారా కేన్సర్ నయం చేయవచ్చని ఒక అంచనాకు వచ్చారు. ఈ మేరకు మనుషుల్లో కేన్సర్ చికిత్సకు ఉపయోగించే ఎలక్ట్రోకెమోథరపీ విధానాన్ని తొలిసారిగా ఓ పాముపై ప్రయోగించారు.

# మేం చైనీయులం కాదు.. భారతీయులం
## దేశంలో వైరల్ అయిన చిన్నారి విడియో..



**ఇటానగర్, ఆగస్టు 22:** ఈశాన్య రాష్ట్రమైన అరుణాచల్ ప్రదేశ్ పూర్తిగా భారత్ భూభాగంలోనేఉంది. కానీ చైనా మాత్రం ఈ ప్రాంతం తమదే అంటూ యేళ్లుగా వ్యాఖ్యలు చేస్తూ వస్తోంది. చైనా వాదనలను భారత్ ఎప్పటికప్పుడు తిప్పి కొడుతూ వస్తోంది. చైనా ఈ ప్రాంతాన్ని జాంగ్ వాన్ అని పిలుస్తోంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు చైనా స్వయంగా కొత్త పేర్లు పెడుతూ వివాదాలు సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన ఓ చిన్నారికి సంబంధించిన ఎమోషనల్ వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఓ వ్యక్తి తనను చైనీస్ అని పిలవడంపై చిన్నారి అసంతృప్తి చెందింది. మేం చైనీయులం కాదు భారతీయులం అంటూ వీడియో పోస్టు చేసింది. ఈ నాలుగేళ్ల చిన్నారి వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అరుణాచల్ ప్రదేశ్ కు చెందిన ఈ నాలుగేళ్ల చిన్నారి ఎమోషనల్ వీడియో ఈశాన్య రాష్ట్రాల్లోని ప్రజలు దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న జాతి వివక్షపై మరోసారి చర్చకు తెరలేపింది. ఈ వైరల్ వీడియో ఓ వ్యక్తి ఆ చిన్నారిని నువ్వు చైనీస్‌వా అని ప్రశ్నిస్తాడు. అందుకు ఆ చిన్నారి ఏమాత్రం తడబడకుండా మేం ఇండియన్స్ చైనీస్ అని పిలిస్తే చాలా కోపం వస్తుంది బాధగా ఉంటుంది. మమ్మల్ని ఇండియన్స్ అని పిలవండి. మేం ఇటానగర్‌లో ఉంటాం అంటూ ఎమోషనల్ అయింది. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతోంది. చిన్నారి మాటలను పలువురు ప్రశంసిస్తున్నారు. చిన్ని యువరాణి నువ్వు ఎప్పటికీ భారతీయురాలివే. అందుకోసం నువ్వు ఎవరికి ఏమీ నిరూపించుకోవాల్సిన అవసరం లేదు అంటూ పలువురు ఆమెను ప్రశంసిస్తున్నారు. లవ్ యూ రా చిట్టితల్లి నీ దేశభక్తి సూపర్ అంటూ మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఈ వీడియోను బెంగాల్ టిఎంసి ఎంపీ మహువా మొయిత్రా ట్యాగ్ చేశారు. చిన్నారిపై ప్రశంసలు కురిపించారు. మై డాన్సింగ్ లిటిల్ గర్ల్ యూ ఆర్ ఇండియా నువ్ ప్యూర్ సౌల్ జై హింద్ జై మణిపూర్ అని కామెంట్ పెట్టారు. ఇక ఈశాన్య రాష్ట్రాలకు చెందిన వారిని చైనీస్, నేపాలీ లేదా ఇతర దేశాలకు చెందినవారిగా పోల్చడం ఇప్పటికీ కనిపిస్తోందని మరికొందరు నెటిజన్లు పేర్కొన్నారు.

# అర్హులైన ఉద్యోగుల పిఎఫ్‌కోసం ఇపిఎఫ్ఒ మరోఛాన్స్



**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్ఒ) పరిధిలోకి ఇప్పటివరకు రాని అర్హులైన ఉద్యోగులను చేర్పించేందుకు యాజమాన్యాలకు అవకాశం కల్పిస్తున్నట్లు కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఇందుకోసం ఉద్యోగుల నమోదు క్యాంపెయిన్ 2026ను ప్రారంభించింది. గతంలో వివిధ కారణాల వల్ల తమ ఉద్యోగులను పిఎఫ్ పథకంలో చేర్పించలేకపోయిన సంస్థలు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇపిఎఫ్ఒ కోరింది. స్వచ్ఛందంగా ముందుకువచ్చి తమ తప్పులను సరిదిద్దుకునేందుకు యాజమాన్యాలకు ఇది ఒక ప్రత్యేకమైన వన్‌టైమ్ అవకాశమని స్పష్టం చేసింది. ఈ ప్రత్యేక నమోదు క్యాంపెయిన్ ఈ యేడాది అక్టోబర్ 31 వరకు అందుబాటులో ఉంటుందని కార్మిక మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో వివరించింది. 2009 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 మధ్య కాలంలో పనిచేసి, పిఎఫ్ పరిధిలోకి రాని ఉద్యోగులను ఈ పథకం కింద నమోదు చేసుకోవచ్చు. ఈ ప్రచారం కింద నమోదు చేసే ఉద్యోగులు, డిక్లరేషన్ సమర్పించే నాటికి అదే సంస్థలో ఇంకా పనిచేస్తూ ఉండటం తప్పనిసరి. ఈ ప్రచారం ద్వారా లక్షలాది మంది కార్మికులకు భవిష్య నిధి, పెన్షన్, బీమా వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలను అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ ప్రచారంలో భాగంగా యాజమాన్యాలకు కొన్ని కీలకమైన సడలింపులను కూడా ఇపిఎఫ్ఒ ప్రకటించింది. గతంలో ఉద్యోగి జీతం నుంచి పిఎఫ్ వాటాను మినహాయించని పక్షంలో, ఇప్పుడు ఆ వాటాను చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపింది. కేవలం యాజమాన్యం తన వాటాను, ఇతర చార్జీలను చెల్లిస్తే సరిపోతుంది. ఇది సంస్థలపై ఆర్థిక భారాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. ఈ వెసులుబాటుతో పాత బకాయిల సమస్యను సులభంగా పరిష్కరించుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. నమోదు ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లోనే ఉంటుందని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. యాజమాన్యాలు తాము నమోదు చేయదలిచిన ప్రతి ఉద్యోగికి ఉమాంగ్ యాప్ ద్వారా ఫేస్ అథెంటికేషన్ ఆధారిత యూఏఎన్ నంబర్‌ను జనరేట్ చేయాలి. ఆ తర్వాత ఎలక్ట్రానిక్ చలాన్‌కమ్‌రిటర్న్ (ఇసిఆర్) ద్వారా వారి చందాలను జమ చేయాల్సి ఉంటుంది. ఈ విధానం ద్వారా ప్రక్రియ పారదర్శకంగా, వేగంగా పూర్తవుతుంది. ఈ ప్రచారం ద్వారా సంస్థలు, కార్మికులు ఇద్దరూ ప్రయోజనం పొందుతారని ప్రభుత్వం భావిస్తోంది. చట్టబద్ధమైన సామాజిక భద్రతను కార్మికులకు అందించేందుకు ఇది ఒక నిర్మాణాత్మకమైన మార్గమని పేర్కొంది. సంస్థలన్నీ తమ పాత ఉపాధి, వేతన రికార్డు లను సమీక్షించుకుని, అర్హులైన ఉద్యోగులను గుర్తించి, గడువు తేదీ 2026 అక్టోబర్ 31లోపు వారిని తప్పనిసరిగా పీఎఫ్ పరిధిలోకి తీసుకురావాలని కార్మిక మంత్రిత్వ శాఖ విజ్ఞప్తి చేసింది.

# అమెరికా కెనడాలమధ్య ట్రేడ్ వార్ ఉధృతం
## 2వేల కోట్ల డాలర్ల విలువైన ఉత్పత్తులపై యుఎస్ టారిఫ్

**టొరంటో,ఆగస్టు 22:** అమెరికాకెనడా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు మరింత ముదిరాయి. అమెరికాతో వాణిజ్య చర్చలను కెనడా ప్రధాని మార్క్ కార్నీ నిలిపివేశారు. చివరి దశ చర్చల్లో అమెరికా ప్రతిపాదించిన కొత్త షరతులు అన్యాయంగా, ఆర్థికంగా నష్టదాయకంగా ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు కెనడా నుంచి వచ్చే సుమారు రెండువేల కోట్ల డాలర్ల విలువైన ఉత్పత్తులపై 50 శాతం టారిఫ్ విధించేందుకు అమెరికా సిద్ధమైంది. అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్ మాట్లాడుతూ కెనడాకు ఇతర ప్రధాన ఎగుమతి దేశాల కంటే మెరుగైన వాణిజ్య సదుపాయాలు కల్పించేందుకు అమెరికా ముందుకొచ్చిందన్నారు. అయితే కెనడా చివరి నిమిషంలో కొత్త డిమాండ్లు చేయడంతో పాటు గతంలో ఇచ్చిన కొన్ని హామీల నుంచి వెనక్కి తగ్గిందని ఆరోపించారు. కెనడా ప్రధాని కార్నీ మాత్రం అమెరికా చివరి నిమిషంలో మార్చిన నిబంధనలు న్యాయబద్ధంగా లేవనిఅన్నారు. వాటితో ఆర్థికంగా నష్టమేనని పేర్కొన్నారు. కెనడా కార్మికులు, వ్యాపారాలకు అదనపు మద్దతు ప్రకటించనున్నట్లు తెలిపారు.

అమెరికా విధించనున్న 50శాతం టారిఫ్‌లు కెనడా నుంచి అమెరికాకు యేటా వెళ్లే మొత్తం ఎగుమతుల్లో దాదాపు 5 శాతాన్ని ప్రభావితం చేయనున్నాయి. హాకీ స్టిక్స్ నుంచి వైద్య పరికరాల వరకు పలుఉత్పత్తులపై ఈ ప్రభావం పడనుంది. చర్చలు కొనసాగేందుకు ట్రంప్ టారిఫ్ గడువును మూడు రోజులు పొడిగించినా ఒప్పందం కుదరలేదు. గత ఏడాది అమెరికాకెనడా మధ్య వస్తువులు, సేవల వాణిజ్యం 880 బిలియన్ డాలర్లకు చేరింది. కెనడా ఎగుమతుల్లో దాదాపు 72శాతం అమెరికాకే వెళ్తున్నాయి. దశాబ్దాలుగా ఇరు దేశాల మధ్య వాణిజ్య వివాదాలు ఉన్నప్పటికీ సన్నిహిత మిత్రదేశాలుగా కొనసాగాయి. అయితే కెనడాను అమెరికాలో 51వ రాష్ట్రంగా మార్చాలంటూ ట్రంప్‌చేసిన వ్యాఖ్యలు, తాజాగా టారిఫ్‌ల పెంపు రెండు దేశాల సంబంధాల్లో కొత్త ఉద్రిక్తతలకు దారితీశాయి.

# ఇక అన్ని ఎయిర్‌పోర్టుల్లో ఇ-బోర్డింగ్ పాస్
## ప్రయాణీకులకు ఇమ్మిగ్రేషన్ కౌంటర్లవద్ద మరింత సౌలభ్యం

**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** విదేశాలకు ప్రయాణించే భారతీయులకు కేంద్రం గుడ్‌న్యూస్ అందించింది. విమానాశ్రయాల్లో ఇమ్మిగ్రేషన్ ప్రక్రియను మరింత సరళతరం చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే సెప్టెంబర్ 1 నుంచి అంతర్జాతీయ ప్రయాణికులు ఇమ్మిగ్రేషన్ కౌంటర్ల వద్ద భౌతిక బోర్డింగ్ పాసులను సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టంచేసింది. నూతన నిబంధనల ప్రకారం, ప్రయాణికులు తమ డిజిటల్ లేదా ఈబోర్డింగ్ పాస్‌లను చూపించి ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ పొందవచ్చు. ఇప్పటి వరకు అమల్లో ఉన్న బోర్డింగ్ పాస్‌లపై ముద్రలు (స్టాంపింగ్) వేసే పద్ధతికి స్వస్తి పలకనున్నట్లు బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ ప్రకటించింది. ఒకవేళ ప్రయాణికుల వద్ద భౌతిక బోర్డింగ్ పాస్‌లు ఉన్నప్పటికీ వాటిని అనుమతిస్తారు, కానీ వాటిపై ఎలాంటి స్టాంపులు వేయరు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ఈ మార్పు అమల్లోకి రానుందని ఢిల్లీలోని ఫారెనర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ ఒకఅంతర్గత నోట్‌లో ధృవీకరించింది. ప్రస్తుత స్టాంపింగ్ విధానంవల్ల ప్రయాణికులు అసౌకర్యానికి గురికావడంతోపాటు, అప్పుడప్పుడు ముద్రలు వేయడంలో పొరపాట్లు జరుగుతున్నాయని బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ గుర్తించింది. ఈ ఇబ్బందులను అధిగమించి, ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈకొత్త నిబంధనపై విమానాశ్రయ యాజమాన్యాలు, సిఐఎస్ఎఫ్ సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ అన్నిభాగస్వామ్య పక్షాలను ఆదేశించింది.

# సంక్షిప్త వార్తలు

## ఫ్రాన్స్‌లో తొలి బిఎపిఎస్ హిందూ ఆలయం



**పారిస్, ఆగస్టు 22:** ఫ్రాన్స్‌లో హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీటవేస్తూ మొట్టమొదటి భారీ హిందూ దేవాలయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. పారిస్‌లోని బుస్సీ సెయింట్‌జార్జెస్ ప్రాంతంలో బోచాసన్వాసి అక్షర్ పురుషోత్తం స్వామినారాయణ్ బిఎపిఎస్ సంస్థ నిర్మించిన ఈ స్వామినారాయణ్ హిందూ మందిరాన్ని సెప్టెంబర్‌లో అంగరంగ వైభవంగా ప్రారంభించనున్నారు. ఈ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 2 నుంచి 14వ తేదీ వరకు 13 రోజుల పాటు ఫెస్టివల్ ఆఫ్ కల్చర్ పేరిట ప్రత్యేక సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించనున్నారు.

## రూ.2395 కోట్లతో మరో బ్రిడ్జికి బిఎంసి గ్రీన్‌సిగ్నల్

**ముంబయి, ఆగస్టు 22:** మహానగరంలో ట్రాఫిక్ కష్టాలను తగ్గించి, ప్రయాణ సమయాన్ని ఆదా చేసే మరో భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుకు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి) శ్రీకారం చుట్టింది. నగరంలోని వెర్సోవా, మఢ్ ఐలాండ్ ప్రాంతాలను కలుపుతూ మలాడ్ క్రీక్‌పై రూ. 2,395 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక కేబుల్ ఆధారిత వంతెన నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ వంతెన అందుబాటులోకి వస్తే, ప్రస్తుతం 60 నుంచి 90 నిమిషాలు పట్టే ప్రయాణం కేవలం 10 నిమిషాలకు తగ్గిపోనుంది.

## అజ్ఞాతంలో మసూద్ అజర్

**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** ఆపరేషన్ సిందూర్ తర్వాత జైషే మహ్మద్ అధినేత మసూద్ అజార్ పేరుతో సాగుతున్న ప్రచారంపై భారత నిఘా సంస్థలు అప్రమత్తమయ్యాయి. అజార్ ఆరోగ్యం క్షీణించిందన్న ప్రచారం నేపథ్యంలో అతడు బహిరంగంగా కనిపించడం లేదు. పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ అతడిని అజ్ఞాతంలో ఉంచినట్లు భారత నిఘా వర్గాలు గుర్తించాయి. అజార్ బయటకు రాకపోయినా అతడి ప్రసంగాలు, తీవ్రవాద భావజాలాన్ని మాత్రం జైషే మహ్మద్ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. యువతను ఆకర్షించేందుకు వాటినే ప్రధాన ఆయుధంగా ఉపయోగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

## పిఒకెలో సంక్షోభంపై ఐరాస జోక్యం చేసుకోవాలి



**లండన్, ఆగస్టు 22:** పాక్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె)లో నెలకొన్న తీవ్రమైన సంక్షోభంపై 70 మందికి పైగా బ్రిటిష్ పార్లమెంట్ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడి పరిస్థితులపై తక్షణమే దృష్టి సారించి, అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకోవాలని కోరుతూ ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్‌కు వారు ఒక లేఖ రాశారు. కశ్మీర్‌పై ఏర్పాటైన ఆల్‌పార్టీ పార్లమెంటరీ గ్రూప్ ఛైర్మన్, లేబర్ పార్టీ ఎంపీ ఇమ్రాన్ హుస్సేన్ నేతృత్వంలో నిన్న ఈ లేఖను పంపించారు. పిఒకెలో హింసాత్మక ఘటనలు, మరణాలు, గాయాల గురించి తమకు నివేదికలు అందుతున్నాయని ఎంపీలు తమ లేఖలో పేర్కొన్నారు.

## కర్ణాటక ఐఎఎస్ అధికారి అదృశ్యం



**బెంగళూరు, ఆగస్టు 22:** నగరంలోని కెంపెగౌడ ఎయిర్‌పోర్టు నుంచి ఢిల్లీకి విమానంలో బయల్దేరిన కర్ణాటక ఐఎఎస్ అధికారి జ్ఞానేంద్ర కుమార్ అదృశ్యం అయ్యారు. ఈ నెల 20న అదృశ్యం అయినట్లుగా మంత్రి ప్రియాంక్ ఖర్గే శనివారం తెలిపారు. అయితే ఇప్పటి వరకు ప్రభుత్వంగానీ కుటుంబ సభ్యులుగానీ ఎక్కడా కూడా అధికారికంగా ఫిర్యాదు చేయలేదు. ప్రస్తుతం ఐఎఎస్ అధికారి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. ఇక ఈ ఘటన పోలీస్ శాఖలో తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. ఆచూకీ కనుగొనేందుకు పోలీసులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంతో పేదల సొంతింటి కల సాకారం

### పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 22,ప్రభాతవార్త:** పేదల జీవిత స్వప్నమైన సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నిజామాబాద్ లోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పిసిసి చీఫ్ మహేశ్ మాట్లాడుతూ పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. నాడు టిపిసిసి అధ్యక్షుడిగా సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన అనంతరం ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నియోజకవర్గానికి 3,500 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు అదనంగా నిజామాబాద్ జిల్లాకు మరిన్ని ఇళ్లు మంజూరు చేసి లబ్ధిదారులకు అందిస్తున్నామని చెప్పారు. అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కాంగ్రెస్‌కు ఉందని చెప్పారు. నిజామాబాద్ జిల్లా అభివృద్ధిపై మరోసారి సమగ్ర సమీక్ష నిర్వహించి, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని మహేశ్ కుమార్‌గౌడ్ తెలిపారు. మంత్రి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు పసలేని ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు సాగుతోందన్నారు.



రాష్ట్ర పోలీసు అకాడెమీలో జరిగిన రాజా బహద్దూర్ వెంకటరామిరెడ్డి జయంతి వేడుకల్లో పాల్గొన్న అధికారులు.

## పోలీసు అకాడెమీలో ఘనంగా రాజా బహద్దూర్ వెంకటరామిరెడ్డి జయంతి వేడుకలు

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** నిజాం కాలంలో పోలీసు శాఖ తీరుతెన్నులను ఉన్నతస్థాయికి తీసుకువెళ్లి, సామాన్యులకు సైతం పోలీ వ్యవస్థను అందుబాటులో తెచ్చిన కొత్వాల్ రాజా బహద్దూర్ వెంకట రామిరెడ్డి 157వ జయంతి వేడుకలు శనివారం నాడు శివార్లలోని రాష్ట్ర పోలీసు అకాడమిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అకాడమి డిప్యూటీ డైరెక్టర్ కెఆర్‌కె ప్రసాదరావుతో పాటు ఆర్‌బివిఆర్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సభ్యులు అకాడమిలో గల రాజా బహద్దూర్ వెంకట రామిరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అకాడమి డిప్యూటీ డైరెక్టర్ కెఆర్‌కె ప్రసాదరావు మాట్లాడుతూ రాజా బహద్దూర్ వెంకట రామిరెడ్డి తెలంగాణ పోలీసు వ్యవస్థ కు ఎనలేని కీర్తిని చేకూర్చారని అన్నారు. పేదవారికి, సామాన్యులకు ఆయన అందించిన సేవలు కలకాలం గుర్తుంటాయని ఆయన తెలిపారు. పోలీసు శాఖలో ఎంతో కీలకమైన ఎస్ఐ క్యాడర్ శిక్షణార్థుల కోసం ఆయన ఏర్పాటు చేసిన నిధి, దూరదృష్టికి నిదర్శమని కెఆర్‌కె ప్రసాద రావు కొనియాడారు. పోలీసు వ్యవస్థ ఎలా వుండాలి? సామాన్యుల గౌరవాన్ని ఎలా చూరగొనాలి? సమాజంలో పోలీసుల పాత్ర ఏమిటి? అనే అంశాలను ఆయన నిజాం కాలంలోనే నిరూపించారని కెఆర్‌కె ప్రసాద రావు తెలిపారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ పోలీసు అకాడమికి రా జా బహద్దూర్ వెంకట రామిరెడ్డి పేరు పెట్టి ఎన్నో కార్యక్రమాలు చేబడు తున్నట్లు తెలిపారు. భవిష్యత్ పోలీసు అధికారులకు ఆయన జీవితం స్ఫూర్తిగా వుంటుందని అకాడమి డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమి అసిస్టెంట్ డైరెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, రాంబాబు, శ్రీనివాసరావు, కృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఇక నుంచి పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో సిఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి

### పాఠశాల విద్యా శాఖ, టి.శాట్ మధ్య విద్యాప్రసారాలపై కుదిరిన ఎంఒయు

### డైరెక్టర్ నవీన్‌నికోలస్, టి.శాట్ సిఇఒ వేణుగోపాల్‌రెడ్డి సంతకాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు22:** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ అన్ని వేళలా అన్ లైన ద్వార అందించాలనే లక్ష్యంతో స్కూల్ ఎడ్యుకేషన్,టిసాట్ మధ్య ప్రత్యేక అవగాహన ఒప్పందం కుదిరింది. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ టి సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఒప్పంద పత్రాలపై డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో సంతకాలు చేసి ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను దేశంలోనే అత్యంత ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు డిజిటల్ లెర్నింగ్ ఎంతగానో ఉపయోగపడుతుందని నవీన్ నికోలస్, వేణుగోపాల్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. డిజిటల్ కంటెంట్ ప్రసారాల విషయంలో ఎంఓయూ ఫలితంగా డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, టిసాట్ మధ్య కార్యక్రమాల ప్రసారాల విషయంలో స్పష్టత వస్తుందని భావించారు. తొమ్మిది, పదవ తరగతి పిల్లలకు సాయంత్రం వేళల్లో డిజిటల్ పాఠ్యాంశాలు ప్రసారం చేయడం, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 28 వేల పాఠశాలల్లో చదువున్న విద్యార్థుల తల్లిదండ్రులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ముఖాముఖి' మా జిల్లా మా పాఠశాల పేరుతో డీఈవోలు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమం, ఉపాధ్యాయుల కోసం టి.ఎల్.ఎమ్ మేళా వంటి ప్రత్యేక కార్యక్రమాలు ఇక నుండి టిసాట్ వేదికగా ప్రసారం చేసుకునేందుకు ఎంఓయూ ఉపయోగపడుతుందని నవీన్ నికోలస్, వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. డిజిటల్ ప్రసారాలకు సంబంధించిన ప్రతి కార్యక్రమాన్ని టిసాట్ ద్వారా నిర్వహించే విధంగా సమగ్ర శిక్ష, ఎస్ఇఆర్‌టి తదితర విభాగాలు తగిన చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆదేశించారు.

# ఆస్పత్రుల్లో విధులకు గైర్హాజరైతే కఠినచర్యలు

### చిన్న సమస్యలకు రోగులను పెద్ద హాస్పిటళ్లకు రిఫర్ చేయొద్దు

### మేజర్ సర్జరీలు చేయగలిగే డిస్ట్రిక్ట్, ఏరియా ఆస్పత్రులు ఆవిష్కరణ

### ప్రభుత్వ హాస్పిటళ్ల పనితీరు, వైద్య సేవలపై మంత్రి దామోదర రాజనర్సింహా సమీక్ష



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు22:** మేజర్ సర్జరీలు కూడా చేయగలిగే పూర్తిస్థాయి వైద్య కేంద్రాలుగా కమ్యునిటీ సెంటర్లు, ఏరియా హాస్పిటళ్లు, డిస్ట్రిక్ట్ హాస్పిటళ్లు అభివృద్ధి చెందాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. టీచింగ్ హాస్పిటళ్లతో సమానంగా స్థానికం గానే ప్రజలకు వైద్య సేవలకు అందించే అవకాశం జిల్లా, ఏరియా హాస్పిటళ్లకు ఉందని మంత్రి పేర్కొన్నారు. టీచింగ్ హాస్పిటళ్లలో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేస్తే.. జిల్లా, ఏరియా హాస్పిటళ్లు, కమ్యునిటీ హెల్త్ సెంటర్లలో 1616 మంది స్పెషలిస్ట్ డాక్టర్లను రిక్రూట్ చేశామని మంత్రి గుర్తు చేశారు. డాక్టర్లు, సిబ్బందితో పాటుగా అవసరమైన అన్ని సౌకర్యాలను కూడా కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ మేరకు డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ (డిఎస్‌హెచ్) పరిధిలోని ప్రభుత్వ హాస్పిటళ్ల పనితీరు, వైద్య సేవలు, మౌలిక వసతులు, మానవ వనరులు, పరికరాలు తదితర అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. శనివారం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి, డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, అన్ని జిల్లాల డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్‌సర్వీసెస్ (డిసిహెచ్‌లు), సంబంధిత అధికా రులు పాల్గొన్నారు. చిన్న చిన్న సమస్యలకు కూడా పేషెంట్లను పెద్ద హాస్పిటళ్లకు రిఫర్ చేసి ఇబ్బందులకు గురిచేసే పరిస్థితి మారాలని మంత్రి అన్నారు. ఇప్పటికే చాలా హాస్పిటళ్లలో ఆ మార్పు వచ్చిందని, ఇంకా కొన్ని హాస్పిటళ్లలో అదే పరిస్థితి ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందని మంత్రి పేర్కొన్నారు. ఇకనైనా పద్ధతి మార్చుకోకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. సరైన కారణం ఉంటే తప్ప పేషెంట్లను రిఫర్ చేయొద్దని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో మరో హాస్పిటల్‌కు రిఫర్ చేయాల్సి వస్తే, ముందుగానే ఆ హాస్పిటల్‌కు సమాచారం అందించి, అక్కడి వైద్యులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

డిసిహెచ్ఎస్‌లు కేవలం కార్యాలయాల్లో కూర్చుని నివేదికలు పరిశీలిస్తే సరిపోదని మంత్రి స్పష్టం చేశారు. తమ పరిధిలోని ప్రతి హాస్పిటల్‌ను వారానికి కనీసం ఒకరోజు ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేయాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది సమయానికి విధులకు హాజరవుతున్నారా? పేషెంట్లకు సకాలంలో వైద్యం అందుతోందా? పరికరాలు పనిచేస్తున్నాయా? టెస్టులు, స్కాన్లు అందుబాటులో ఉన్నాయా? మందుల పరిస్థితి ఏమిటి? పరిశుభ్రత, తాగునీరు, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సక్రమంగా జరుగుతున్నాయా? వంటి అంశాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించాలని సూచించారు. డీసీహెచ్ఎస్ ప్రతి నెలా తమ వర్క్ రిపోర్ట్‌ను ప్రభుత్వానికి అందించాలని మంత్రి ఆదేశించారు. హాస్పిటళ్లలో విధులకు గైర్హాజరవడం, నిర్ణీత సమయం కంటే ముందే హాస్పిటల్ నుంచి వెళ్లిపోవడం, విధుల్లో నిర్లక్ష్యం వహించడం వంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు గుర్తిస్తే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పేషెంట్లకు అందాల్సిన సేవల్లో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఎలాంటి లోటు రాకూడదని, సమయపాలన, బాధ్యత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. హాస్పిటళ్లలో సమస్యలు పెద్దవిగా మారే వరకు వేచి చూడకుండా ముందుగానే గుర్తించి పరిష్కరించాలని మంత్రి అన్నారు. బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ సమస్యలు, తాగునీరు, పరిశుభ్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. స్థానికంగా పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఇతర శాఖల సమన్వయం అవసరమైన అంశాలపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని సకాలంలో చర్యలు తీసుకోవాలని సూచించారు.

## సన్నాల రైతులు 10లోగా నమోదు చేసుకొంటేనే బోనస్

### ఈ యేడు బోనస్ చెల్లింపు ఏడు రకాలకే పరిమితం చేసిన సర్కారు

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** తెలంగాణలో సన్నరకం వరిధాన్యం సాగుచేసే రైతులు సెప్టెంబర్ 10లోగా విత్తన విక్రయ డీలర్ల వద్ద నమోదు చేసుకొంటేనే వద్ద నమోదు చేసుకొంటేనే పౌరసరఫరాలశాఖ ధాన్యం కొనుగోలు చేసినప్పుడు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించనున్నది. విత్తన డీలర్ల వద్ద నమోదు చేసుకొన్నవారి సాగు విస్తీర్ణం పంట రకం మాత్రమే పంటల నమోదు జాబితాలో చేరుతోంది. తెలంగాణలో గత సంత్సరం పౌరసఫరాలశాఖ 70.82లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. ఇందులో 32.45లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం, 38.37లక్షల మెట్రిక్ టన్నుల సన్నాలు కొనుగోలు చేశారు.

రాష్ట్రంలోని 13.97లక్ష మంది రైతులకు రూ. 16912 కోట్లు మద్దతు ధర అందించారు. సన్నాలకు బోనస్ కూడా చెల్లించారు. ఈ సారి బోనస్ పొందాలంటే మాత్రం విధిగా విత్తన బిల్లులు, రైతు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకంతో విత్తనదుకాణాలకు వెళ్లి నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ఈ నమోదు ఆధారం గానే క్షేత్రస్థాయి పంటల నమోదు చేయడం జరుగుతోందని అలా లేనివారికి బోనస్ అందించే అవకాశాలు ఉండవని అధికారులు సంకేతాలు ఇస్తున్నారు. ప్రభుత్వం ఆర్ఎస్ఆర్ 15048, కెఎన్ఎం1638,జైశ్రీరాం కెన్ఎం 7715 బిపిడి 5204(సాంబమసూరి) హెచ్ఎంటి సోనా, డబ్ల్యుజిల్ -44(సిద్ధి) రకాలు సాగు చేసిన రైతులకు మాత్రమే ఈ యేడు బోనస్ ఇస్తారు. రోహిణి కార్తెకు ముందే వరి విత్తనాలు కొనుగోలు చేసి నార్లు పోసుకొని సిద్ధంగా ఉన్న రైతులు ఇప్పుడు పొలాలు నాట్లేసుకొనే సమయంలో వ్యవసాయశాఖ ఎఇవోలు సామాజిక మాధ్యమాల ద్వారా బోనస్ కావాలనుకుంటే కొన్న విత్తనాలు ఏ దుకాణంలో కొనుగోలు చేశారో అక్కడ నమోదు చేసుకోవాలని ప్రచారం చేస్తుండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. సొంతగా ఎవరైనా సన్నాలు విత్తనాలు చేసుకొంటే వారు స్వంతపూచికత్తు ఇవ్వాల్సి ఉంటుంది.

సన్నాలకు బోనస్ విషయంలో నిబంధనలు అనేకం కొత్తగా పెడుతుండటంతో రైతులు విత్తనదుకాణాలకు నమోదు కోసం వెళ్ళుతున్నారు. రెండు నెలల క్రితం కొన్న వాటికి బిల్లులు ఎక్కడ తెచ్చుకొనేది అని ఆవేదనచెందుతున్నారు. మరోవైపు దుకాణాల వద్ద రద్దీ పెరిగి ట్రాఫిక్‌కు కూడా అంతరాయం కలుగుతోన్నది.

## ప్రజాస్వామ్య మనుగడకు పత్రికా స్వేచ్ఛ అత్యంత కీలకం

### విమర్శలు స్వీకరించే ధైర్యం ప్రభుత్వాలకు ఉండాలి

### ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్య మనుగడకు పాలకులను ప్రశ్నించే పత్రికా స్వేచ్ఛ అత్యంత కీలకమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. విమర్శలను స్వీకరించే ధైర్యం ప్రభుత్వాలకు ఉండాలని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధులు ఏకతాటిపైకి వచ్చి హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని ఐఎఎస్ ఆఫీసర్స్ క్లబ్ లో శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈకార్యక్రమంలో దహిందూ పత్రిక మాజీ ఎడిటర్ ఎన్. రామ్, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాసరెడ్డి, ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ సంగీత బారోచ్, కరవన్ పత్రిక ఎడిటర్ అనంతనాథ్, ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్ నుంచి గౌతమ్ లహరి, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ విజయ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వి. రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. భారతీయ జర్నలిజం వారసత్వాన్ని, ప్రస్తుత సవాళ్లను ఆయన సోదాహరణంగా వివరించారు. వివక్షను ప్రశ్నించాల్సిన బాధ్యత పత్రికలదే అని చెప్పారు. సమాజంలో జరుగుతున్న ఘటనలను కేవలం రిపోర్ట్ చేయడమే కాకుండా, వాటి అంతరార్థాన్ని ప్రశ్నించాల్సిన బాధ్యత జర్నలిజంపై ఉందన్నారు. ఇటీవల కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హల్ద్వానీలోని రామ్‌లీలా మైదానంలో ప్రసంగించిన రెండు రోజుల తర్వాత, కొందరు అక్కడ 'శుద్ధీకరణ' కార్యక్రమం నిర్వహించడాన్ని ఆయన ప్రశ్నించారు. కొత్తగా ఏర్పాటైన 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్' కేవలం ఒక సంస్థగా మిగిలిపోకుండా, జర్నలిస్టుల భద్రతను, వృత్తిపరమైన ప్రమాణాలను కాపాడే బలమైన వ్యవస్థగా ఎదగాలని ఆకాంక్షించారు. గ్రామీణ స్థాయిలో, జిల్లాల్లో పనిచేసే రిపోర్టర్ల సంక్షేమంపై ఫెడరేషన్ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా జర్నలిస్టుల భద్రత, గౌరవం, ఉద్యోగ పరిస్థితులు, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఫెడరేషన్‌కు సూచించారు.



# మెరుగైన సేవలు, పాలనకు దోహదం

### గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో అదనపు తరగతి గదులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన



**హైదరాబాద్, ఆగస్టు 22,ప్రభాతవార్త:** ఆధునిక వసతులతో నిర్మించనున్న అదనపు తరగతులు, ప్రభుత్వ కార్యాలయ భవనాలు విద్యార్థులకు, ప్రజలకు మెరుగైన, సౌకర్యవంతమైన పరిపాలనా సేవలు అందించేందుకు మంచి చదు వులు అందించడానికి దోహదపడనున్నాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగు లేటి శ్రీనివాస్ అన్నారు. నిజామాబాద్ నగరంలోని నూతన రూరల్ తహసీ ల్దార్, రిజిస్ట్రార్ కార్యాలయ భవనాలకు, గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో నూతనంగా నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి శనివారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ హాజరయ్యారు. విద్యా ర్థులకు మెరుగైన విద్యావసతులు కల్పించడంతోపాటు, కళా శాలలో మౌలిక సదుపాయాలను మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యంగా అదనపు తరగతి గదుల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.

ఆధునిక వసతులతో తరగతి గదులు అందుబాటులోకి రావడం ద్వారా విద్యార్థులకు మరింత అనుకూలమైన విద్యా వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, నిజామాబాద్ స్థానిక ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, నిజామాబాద్ మేయర్ ఉమారాణి, డిసిసి అధ్యక్షులు నగేష్‌రెడ్డి, బొబ్బిలి రామకృష్ణ, కవిత తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

### నిజామాబాద్ ఐఎంఎ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం

నిజామాబాద్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి ముఖ్యఅతిథులు హాజరై ఐఎంఏ షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. వైద్య రంగానికి సంబంధించిన సంస్థల అభివృద్ధితోపాటు, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిం చేందుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ చేస్తున్న కృషిని పలువురు అభినందించారు.

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కొనసాగిస్తాం

### కోర్టు కేసులో ప్రతిపక్షాలు కూడా ప్రతివాదులుగా చేరాలి : మంత్రి పొన్నం

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించే కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాను రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయదని, వాటిని కొనసాగిస్తుందని వెనుకబడిన తరగతుల సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం మీడియాతో మాట్లాడుతూ పేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల వివాహాల నిమిత్తం ఆర్థిక సహాయం అందించేందుకు గత ప్రభుత్వం వివిధ పథకాలను ప్రవేశపెట్టాయని, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వాటిని కొనసాగిస్తుందని తేల్చిచెప్పారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి సంక్షేమ పథకాలు ప్రభుత్వ విధానంలో ఒక భాగమన్నారు. పేద ప్రజలకు అండగా నిలవడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై హైకోర్టులో విచారణ జరుగుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తమ బలమైన వాదనలు వినిపిస్తోందని వివరించారు. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయనందున ధర్మాసనం గతంలో స్టే విధించిందని చెప్పారు. ఈ విషయం తమ దృష్టికి వచ్చిన వెంటనే స్టేను ఎత్తివేయాలని కోరుతూ ప్రభుత్వం ఒక కౌంటర్‌తో పాటు, పిటీషన్‌ను దాఖలు చేసిందని తెలిపారు. ఈ అంశంపై విచారణ కూడా పూర్తయిందని వెల్లడించారు. హైకోర్టులో తమ వాదలను పరిగణనలోకి తీసుకుని అనుకూలమైన ఉత్తర్వులు జారీ చేస్తుందనే నమ్మకంతో తమ ప్రభుత్వం ఉందన్నారు, ప్రధానంగా పేద కుటుంబాలకు చెందిన లబ్దిదారుల ప్రయోజనాల దృష్ట్యా ప్రతిపక్ష పార్టీలు ఈ కేసులో తమను తాము ప్రతివాదులుగా చేర్చుకుని, వాదనలను వినిపించాలని సూచించారు.


## నేడు ఎల్‌బిస్టేడియంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల భారీ బహిరంగసభ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు22:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ రాష్ట్రంలో కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని (సిపిఎస్) తక్షణమే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఒపిఎస్) పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం జరగబోయే ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర సిపిఎస్ ఎంప్లాయిస్ యూనియన్ (టిఎస్‌సిపిఎస్‌ఈయు) పిలుపునిచ్చింది. ఈ మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయులను సన్నద్ధం చేయడానికి చేపట్టిన జనజాగరణ యాత్ర విజయవంతంగా ముగిసినట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వాల శ్రీకాంత్ ప్రకటించారు. సిపిఎస్ రద్దు ఆవశ్యకతను వివరిస్తూ జులై 11న భద్రాద్రి శ్రీ సీతారాముల పాదాల వద్ద ప్రారంభమైన సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల జనజాగరణ యాత్ర రెండు దశల్లో దిగ్విజయంగా సాగింది. మొదటి దశ (జూలై 11 నుండి 31 వరకు): రాష్ట్రవ్యాప్తంగా బైక్ ర్యాలీలు, పాదయాత్రల ద్వారా "వి వాంట్ ఓపిఎస్" అంటూ నినదిస్తూ క్షేత్ర స్థాయిలో ఉద్యోగులను జాగృతం చేసి స్థానిక ఎమ్మెల్యేల ను కలిసి వినతిపత్రం సమర్పించారు. రెండవ దశ (ఆగస్టు 3 నుండి 18 వరకు): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న అన్ని ప్రభుత్వ శాఖల (పే అండ్ అకౌంట్స్, ట్రెజరీ, విద్య, వైద్య, ఫైర్, ఎక్సైజ్, రెవెన్యూ, కోర్ట్ తదితర) హెచ్‌ఓడీల, జిల్లా కార్యాలయాల్లో వద్దకు వెళ్లి ఉద్యోగులను సన్నద్ధం చేశారు. మొత్తంగా ఈ యాత్ర రాష్ట్రంలోని 80కి పైగా అసెంబ్లీ నియోజక వర్గాలను చుట్టివచ్చింది. ఈ సందర్భంగా స్థానిక సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులతో (ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులతో) కలిసి ఏకంగా 73మంది స్థానిక ఎమ్మెల్యేలను, 7గురు రాష్ట్ర మంత్రులను (సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, వాకిడి శ్రీహరి, వివేక్), ప్రభుత్వ చీఫ్ విప్ ఆది శ్రీనివాసులు తదితరులను స్వయంగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు.

## రిజర్వేషన్ ఎత్తివేతకు బిజెపి కుట్రలో భాగంగానే ఆందోళనలు

### ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** దేశంలో కొనసాగుతున్న బడుగు బలహీన వర్గాల రిజర్వేషన్ ఎత్తి వేసేందుకు బిజెపి చేస్తున్న కుట్రలో భాగంగా ఆందోళనలు జరుగుతున్నాయని మాజీ పిపిసి అధ్యక్షుడు, ప్రభుత్వ సలహా దారు వి.హనుమంతరావు ఆరోపించారు. శనివారం గాంధీభవన్‌లో మీడియా సమావేశం మాట్లాడుతూ రిజర్వేషన్ ఎత్తివేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని అన్నారు. జనాభాలో 60 శాతం ఉన్న మా రిజర్వేషన్ ఎలా ఎత్తివేస్తారో చూస్తామనీ హెచ్చరించారు రిజర్వేషన్ ఎత్తివేయాలని ధర్నా చేయడం దారురణమనీ ఆవేదన చెందారు. దీని వెనుక ప్రధాని నరేంద్ర మోడీ, హోమ్ మంత్రి అమిత్ షా లు ఉన్నారనీ విమర్శించారు. రిజర్వేషన్ పరిరక్షణకు ఇక్కడ తెలంగాణ నుంచే ఉద్యమం మొదలు అవుతుందనీ అన్నారు. ఇక్కడ మా సిఎం బిసిల పక్షపాతి వచ్చే సోమవారం ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేస్తున్నా అని అన్నారు. పార్టీలకు అతీతంగా నాయకులు ఈ ధర్నా కార్యక్రమానికి రావాలనీ కోరారు. ఇబిసి రిజర్వేషన్ బిల్లు తెస్తే మేము అడ్డుపడలేదు కదా అన్నారు. దేశంలో సర్వే చేయించగా రాహుల్ గాంధీ కి 58 శాతం మద్దతు రావడంతో బిజెపి బెంబేలెత్తుతోందనీ ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకే ఇక్కడ కులగణన జరిగిందనీ అన్నారు. బడుగు బలహీన వర్గాల రిజర్వేషన్ ఎలా రద్దు చేస్తారో చూస్తాం అన్నారు. అన్ని పార్టీలకు చెందిన బిసి నాయకులు ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలుపాలని కోరారు. రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనను బిజెపి, కేంద్ర ప్రభుత్వం అడ్డుకోవడం దారుణమని అన్నారు.



శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న విహెచ్

## మంత్రి కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలి

### ముఖ్యమంత్రి రేవంత్‌కు మంత్రి, ఆమె కూతురు క్షమాపణలు చెప్పాలి

### మేం 66 మందిమి, మా నేతలు రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి

### ప్రభుత్వ విప్‌లు ఆదిశ్రీనివాస్, విజయరమణారావు, రాంచందర్‌నాయక్

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కూతురు సుస్మితతో కూడా క్షమాపణలు చెప్పించాలని కుటుంబ సభ్యులతో సంస్కార హీనంగా మాట్లాడించిన మంత్రిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, విజయ రమణారావు, రాంచందర్‌నాయక్,ఎమ్మెల్యేలు ఠాగూర్ మక్కాన్‌సింగ్, నవీన్‌యాదవు డిమాండ్ చేశారు. శనివారం సిఎల్‌పి కార్యా లయంలో వారు మాట్లాడుతూ నియంత, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ కార్యకర్తలు, రేవంత్ రెడ్డి పదేళ్లు కొట్లాడి ప్రభుత్వాన్ని తీసుకువచ్చారని కితాబు ఇచ్చారు. అప్పుల కుప్పగా మార్చిన రాష్ట్రాన్ని సాహసోపేతమైన నిర్ణయాలతో ముఖ్యమంత్రి ముందుకు తీసుకెళ్తున్నారనీ తెలంగాణలో పరిపాలనకు అడ్డంకులు సృష్టించడానికి ప్రతిపక్షాలు ప్రయత్నం చేస్తున్నాయనీ ఇలాంటి సమయంలో కొంతమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైనే విమర్శలు చేయడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. పరకాలలో సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి గురించి కార్యకర్తలను ఉత్తేజపర్చడం కోసమే సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారని అందులో తప్పు ఏముంది? వారు ప్రశ్నించారు. కొండా సుస్మిత ఏనాడైనా ప్రజాక్షేత్రంలో ఉన్నారా? ప్రజల కోసం పనిచేశారా? ఆమె భాష సరైనది కాదు. తన కూతురు మాటలను ఖండించాల్సిన మంత్రి కొండా సురేఖ ఎందుకు స్పందించలేదు? ప్రశ్నించారు. కొండా సురేఖపై యాక్షన్ తీసుకోవాల్సిందే అని డిమాండ్ చేశారు. మంత్రిగా హోదా అనుభవిస్తూ ప్రతిపక్షాల ప్రచారాన్ని తిప్పికొట్టకుండా, కుటుంబసభ్యులతో పలుసార్లు వ్యతిరేకంగా మాట్లాడించడం సంస్కారహీనం అని విమర్శించారు. కొండా సురేఖ పార్టీ అధిష్ఠానంతో పాటు క్రమశిక్షణా సంఘంతో మాటాడితే కొంతవరకైనా క్షమించే వాళ్లమని అన్నారు. వరంగల్ జిల్లాలో ఏ నాయకుడితో కొండా సురేఖకు సఖ్యత లేదని వారు వ్యాఖ్యానించారు.

కొండా సురేఖపై చర్యలు తీసుకోవాల్సిందేనని అధిష్ఠానాన్ని కోరుతున్నామనీ తెలిపారు. మేం 66మందిమి మాటీం నాయకుడు రాహుల్‌గాంధీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని వారు ప్రకటించారు. చిన్నారెడ్డి, రాజగోపాల్ రెడ్డి, కొండా సురేఖ ఎవరైనా విమర్శలు చేస్తే సహించమని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తేల్చి చెప్పారు. కొండా సురేఖకు కాంగ్రెస్ సభ్యత్వం కూడా లేదని వారు తెలిపారు. రేవంత్ రెడ్డిపై వ్యక్తిగత విమర్శలను మేమంతా ఖండిస్తున్నామని, మాజీ మంత్రి చిన్నారెడ్డి ఎమ్మెల్యే మేఘారెడ్డిపై చేసిన వ్యాఖ్యలు తప్పు. చిన్నారెడ్డి ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ హోదాలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కూడా పాల్గొంటూ ఆయన పార్టీని ఇరుకునపెట్టడం తగదని అన్నారు.

# భారత వ్యతిరేకి జొహ్రాన్ మమ్దానీని కలవాలని సిఎం రేవంత్‌రెడ్డి ఎందుకు అనుకున్నారు?

### అమెరికా పర్యటనను విదేశీ మంత్రిత్వ శాఖ నిరాకరించడం సరైన చర్యే

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు22:** భారత వ్యతిరేక వైఖరి కలిగిన న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్దానీని కలవాల్సిన అవసరం సిఎం రేవంత్ రెడ్డికి ఏమొచ్చిందో తెలంగాణ ప్రజలకు స్పష్టం చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ప్రశ్నించారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ.. సిఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించడం సరైన చర్యేనని సమర్థించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. భారత వ్యతిరేక శక్తుల ప్రతినిధులను, రాహుల్‌గాంధీకి సైద్ధాంతిక గురువులుగా ఉన్న వ్యక్తులను కలిసేందుకే ఈ పర్యటన తలపెట్టారనే విషయం ఇప్పుడు స్పష్టమవుతోందన్నారు. ప్రతిపాదిత పర్యటనలో జొహ్రాన్ మమ్దానీతో భేటీ ఉండే అవకాశం ఉన్నప్పటికీ, ఆ వివరాలను అధికారిక షెడ్యూల్‌లో ఎందుకు వెల్లడించలేదు అని ప్రశ్నించారు. ఇటీవల న్యూయార్క్‌లో నిర్వహించిన పాకిస్థాన్ డే వేడుకల్లో మమ్దానీ పాల్గొన్నారని, 2020 ఆగస్టులో అయోధ్య రామమందిర భూమిపూజను వ్యతిరేకిస్తూ టైమ్స్ స్క్వేర్‌లో జరిగిన నిరసనలో పాల్గొన్నారని గుర్తు చేశారు. అక్కడ హిందూ వ్యతిరేక నినాదాలు నమోదయ్యాయని పేర్కొన్నారు. 2023లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమెరికా పర్యటనను బహిరంగంగా వ్యతిరేకించడంతో పాటు భారత ప్రభుత్వంపై, గుజరాత్ అంశాలపై తీవ్ర విమర్శలు చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ సీనియర్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ సైతం స్పందిస్తూ జొహ్రాన్ మమ్దానీ నోరు తెరిస్తే పాకిస్థాన్ పీఆర్ టీమ్‌కు ఆ రోజు సెలవే అని తీవ్రంగా తప్పుపట్టారని పేర్కొన్నారు. సొంత పార్టీ సీనియర్ నేత సింఘ్వీ వ్యాఖ్యలనూ రేవంత్‌రెడ్డి పట్టించుకోరా? అని ప్రశ్నించారు. భారత్ ప్రధాని మోడీపై వివాదాస్పద వైఖరి అవలంబించే వ్యక్తిని కలవాలని ఎందుకు అనుకున్నారు? అని ప్రశ్నించారు.

# రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం నిరాకరణపై ఖర్గే ఆగ్రహం

### నచ్చిన వారికే అనుమతులు ఇస్తోందని ఆరోపణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు22:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరిం చడంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సాగాల్సిన ఈ పర్యటనను కేంద్రం ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుందని ఆయన ఆరోపించారు. విదేశీ పర్యటనల ద్వారా ముఖ్యమంత్రులు తమ రాష్ట్రాలకు పెట్టుబడులను ఆహ్వానిస్తారని పేర్కొన్నారు. 'అమెరి కాలో



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ప్రవాస భారతీయులు అత్యధిక సంఖ్యలో నివసిస్తున్నారు. రాష్ట్రాల్లో పరిశ్రమల స్థాపనకు వారిని ఆహ్వానించేందుకే ముఖ్యమంత్రులు ఇటువంటి పర్యటనలు చేపడుతుంటారు. అలాంటి కీలక పర్యటనకు అనుమతి నిరాకరించడం అన్యాయం' అని ఆయన మండిపడ్డారు. 'కేంద్ర ప్రభుత్వం తమకు అనుకూలమైన వారికి తక్షణమే అనుమతులు మంజూరు చేస్తోంది, కానీ తెలంగాణ ముఖ్యమంత్రి విషయంలో మాత్రం వివక్ష చూపుతోంది' అని మల్లికార్జున ఖర్గే ఆక్షేపించారు. విదేశీ పెట్టుబడులు రావడం వల్ల రాష్ట్రంతో పాటు దేశం కూడా అభివృద్ధి చెందుతుందని, తద్వారా భారీగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, రాష్ట్రాలకు లభించే పెట్టుబడులు అంతిమంగా దేశాభివృద్ధికి తోడ్పడతాయని ఆయన స్పష్టం చేశారు. ఇటువంటి కీలక పర్యటనలను అడ్డుకోవడం ద్వారా తెలంగాణ ప్రగతికి విఘాతం కలిగించేలా కేంద్రం వ్యవహరించడం సరికాదని మల్లికార్జున ఖర్గే హితవు పలికారు.

# మాన్ భార్యపై రూ.5 కోట్ల అవినీతి ఆరోపణలు: హార్‌సిమ్రత్‌కౌర్ బాదల్

**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ భార్య గుర్‌ప్రీత్ కౌర్‌పై వచ్చిన రూ.5 కోట్ల అవినీతి ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని శిరోమణి అకాలీ దళ్ (ఎస్ఏడీ) ఎంపీ హార్‌సిమ్రత్‌కౌర్ బాదల్ అన్నారు. ఈ ఆరోపణలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ) సుమోటోగా స్పందించి విచారణకు ఆదేశించిందని ఆమె పేర్కొన్నారు. శనివారం ఎక్స్‌వేదికగా స్పందిస్తూ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ భార్యపై రూ.5 కోట్ల అవినీతి ఆరోపణలు ఎంత తీవ్రమైనవో, జాతీయ మానవ హక్కుల కమిషన్ జోక్యం చేసుకోవాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు. పంజాబ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), డీజీపీ నుంచి చర్యలపై నివేదిక (ఏటీఆర్) కోసం ఎదురుచూస్తున్నానని ఆమె తెలిపారు. రెండు వారాల్లోగా నివేదిక సమర్పించాలని ఎన్‌హెచ్ఆర్సీ గడువు విధించిందని, సెప్టెంబర్ 5న దీనిపై మళ్లీ ప్రశ్నిస్తానని పేర్కొన్నారు. అంతకుముందు, భగవంత్ మాన్ భార్య గుర్‌ప్రీత్ కౌర్ ఓ అత్యాచార కేసును అణచివేసేందుకు రూ.5 కోట్లు డిమాండ్ చేశారన్న ఆరోపణలపై ఎన్‌హెచ్ఆర్సీ స్పందించింది. ఈ వ్యవహారంపై విచారణ జరిపి, తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని పంజాబ్ ప్రభుత్వ అధికారులను ఆదేశించింది. మాజీ పంజాబ్ న్యాయమూర్తి జస్టిస్ రంజిత్ సింగ్ ఈ ఆరోపణలు చేసినట్లు సమాచారం. అనంతరం ఈ అంశంపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు అందింది. ప్రియాంక్ కనూన్గో నేతృత్వంలోని ఎన్‌హెచ్ఆర్సీ బెంచ్ పంజాబ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ ఈ ఆరోపణలను పరిశీలించి, కమిషన్ నుంచి సమాచారం అందిన రెండు వారాల్లోగా చర్యల నివేదికను సమర్పించాలని ఆదేశించింది. అదే సమయంలో ఈ వ్యవహారాన్ని తగిన పరిశీలన కోసం కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చెందిన మహిళా భద్రతా విభాగానికి కూడా కమిషన్ పంపింది. లీగల్ రైట్స్ అబ్జర్వేటరీ (ఎల్ఆర్ఓ) దాఖలు చేసిన ఫిర్యాదులో అత్యాచార కేసు దర్యాప్తును ప్రభావితం చేసేందుకు ప్రయత్నం జరిగిందన్న ఆందోళన వ్యక్తమైందని ఎన్‌హెచ్ఆర్సీ తెలిపింది. ఇలాంటి జోక్యం వల్ల బాధితురాలి గౌరవం, భద్రత, నిష్పక్షపాత దర్యాప్తు, న్యాయం పొందే హక్కులు దెబ్బతినే అవకాశం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు కమిషన్ వెల్లడించింది. ఆరోపణలను స్వతంత్రంగా ధృవీకరించడం, ఆధారాలను భద్రపరచడం, దర్యాప్తును ప్రభావితం చేసేందుకు లేదా నీరుగార్చేందుకు జరిగిన ప్రయత్నాలపై నిష్పక్షపాత విచారణ జరపాలని ఫిర్యాదుదారు కోరినట్లు తెలిపింది. ఎలాంటి ప్రభావాలకు తావు లేకుండా బాధితురాలికి న్యాయం జరగడమే అత్యంత ముఖ్యమని ఫిర్యాదుదారు స్పష్టం చేసిన విషయాన్ని కూడా ఎన్‌హెచ్ఆర్సీ ప్రస్తావించింది.

# సిఆర్ఐఎఫ్ రోడ్లు, సేతుబంధన్, ఆర్ఒబి పనుల్లో వేగం పెంచాలి

### 3,918 కి.మీ నిడివి కలిగిన రోడ్లకు రూ. 5,159 కోట్లు

### పలు హైలెవెల్ బ్రిడ్జిలు, రైల్వే ఓవర్ బ్రిడ్జిల పనులు నిర్ణీత సమయానికి పూర్తవ్వాలి

### సెక్రటేరియట్ సోలార్ కార్ పార్కింగ్‌తో 90వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి

### ఆర్ అండ్ బి సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** రాష్ట్ర సెక్రటేరియట్ సోలార్ పార్కింగ్ ను 2026 డిసెంబర్ నాటికి పూర్తి చేయడంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా సిఆర్ఐఎఫ్ ద్వారా నిర్మిస్తున్న రోడ్లు, సేతుబంధన్ పథకం బ్రిడ్జిలు, పురోగతిలో ఉన్న పలు ఆర్ఓబి పనుల్లో వేగం పెంచాలనీ రాష్ట్ర రోడ్లు భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించారు. శనివారం నాడు డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో రోడ్లు భవనాలు శాఖ పై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ సచివాలయ ఉత్తర భాగంలో రెండు వరుసల్లో,దక్షిణ భాగంలో మూడు వరుసల్లో,పడమర భాగంలో ఒక్క వరుసలో రూ.26.81 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభమైన సోలార్ కార్ పార్కింగ్ పనులు ఈ ఏడాది డిసెంబర్ నాటికి పనులు పూర్తి కావాలని ఆదేశించారు. సోలార్ కార్ పార్కింగ్ అందుబాటులోకి వస్తే సెక్రటేరియట్ కోసం 90వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, ఈ విద్యుత్ వినియోగం ద్వారా సచివాలయ నెలవారీ విద్యుత్ బిల్లులో 16 శాతం ఆదా అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇప్పటి వరకు 3,918కి.మి నిడివి కలిగిన 316 రోడ్ల కోసం రూ.5159 మంజూరు చేశామని తెలిపారు. అందులో ఆర్ఒబిలు ఇతర బ్రిడ్జిలు పనులు పూర్తి చేసుకొని కొన్ని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, చాలా వరకు పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. 2025-26కు సంబంధించి రూ.868 కోట్లతో చేపట్టిన 422.36 కి.మీ రోడ్ల పనుల పురోగతి సంతృప్తికరంగా ఉన్నదని అధికారులను మంత్రి ప్రశంసించారు.

పలు హై లెవెల్ బ్రిడ్జిలు,రైల్వే ఓవర్ బ్రిడ్జిల పనులు నిర్ణీత సమయానికి పూర్తవ్వాలనీ సూచించారు. సేతుబంధన్ పథకం ద్వారా 76 కోట్లతో చేపట్టిన నార్కట్ పల్లి బ్రిడ్జి పనుల పురోగతిపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో పనుల్లో మరింత వేగం పెంచాలన్నారు.

మిర్యాలగూడ, నందిపహాడ్ బ్రిడ్జి పనులు వెంటనే ప్రారంభించాలని, దానికి సంబంధించిన టెక్నికల్ అంశాలు తక్షణం పూర్తి చేయాలని, స్థానిక ఎమ్మెల్యేతో సమన్వయం చేసుకోవాలని సి.ఇ వనజను మంత్రి



కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు. కరీంనగర్, మెదక్, నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, వికారాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, మహబూబాబాద్, రంగారెడ్డి పనుల పురోగతిపై అధికారులు మంత్రికి వివరించారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఇంకా బాగా కష్టపడి పనిచేయాలని, మెరుగైన రోడ్లు నిర్మించాలనే ప్రభుత్వ లక్ష్యంలో అత్యంత కీలకంగా వ్యవహరించాలని అధికారులకు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు

# నాలుగు రోజులు వర్ష సూచన

### 26 వరకూ పలుచోట్ల భారీవర్షాలు

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** తెలంగాణకు వాతావరణ శాఖ వర్ష హెచ్చరికలు జారీ చేసింది. ఈ నెల 26వ తేదీ వరకూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. అంతేకాకుండా దాంతో పాటు, గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లోనూ ఆకాశం మేఘావృతంగా ఉంటుందని తెలిపింది. ప్రధానంగా రాష్ట్రంలోని నిజామాబాద్, మంచిర్యాల, కొత్తగూడెం, ఆసిఫాబాద్, నిర్మల్, జగిత్యాల పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, వరంగల్, హన్మకొండ నల్లగొండ, సూర్యాపేట్‌లో వేగంగా బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొనంది.

కొన్ని ప్రాంతాల్లో పిడుగులు కూడా పడే అవకాశం ఉన్నందున ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో చెట్ల కింద లేదా బహిరంగ ప్రదేశాల్లో ఉండరాని వాతావరణ శాఖ ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది. కాగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చెదురుమదురు వర్షాలు కురిశాయి.

గడచిన 24 గంటల్లో రాష్ట్రంలోని టాప్ 10 ప్రాంతాల్లో కురిసిన వర్షపాతం వివరాలను చూస్తే మెదక్ జిల్లా చేగుంట మండలంలో అత్యధికంగా 22.1 మిల్లీ మీటర్లు, ఇదే జిల్లా మాసాయిపేట్ మండలంలో 9.4 మిల్లీమీటర్లు, మల్కాజిగిరి జిల్లా మదుచింతలపల్లె మండలంలో 21.6 మిల్లీమీటర్లు, సిద్దిపేట్ జిల్లాలోని కుకునూర్‌పల్లె మండలంలో 19.8 మిల్లీమీటర్లు, ఇదే జిల్లా దౌల్తాబాద్ మండలంలో 14.1 మిల్లీమీటర్లు, జగదేవ్‌పూర్ మండలంలో 10 మిల్లీమీటర్లు, గజ్వాల్ మండలంలో 8.8 మిల్లీమీటర్లు, భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో 12.4 మిల్లీమీటర్లు, భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలో 8.1 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డయింది.

# ఐటీ విస్తరణకు మరో ముందడుగు: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు22:** తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు ఐటీ రంగాన్ని విస్తరించాలన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పానికి ఆదిలాబాద్ ఐటీ టవర్ మరో ముందడుగు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ ఐటీ టవర్ సిద్ధమైన నేపథ్యంలో, హైదరాబాద్‌కు సుమారు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆదిలాబాద్‌లోనూ ఐటీ పరిశ్రమ విస్తరించే అవకాశం ఏర్పడిందన్నారు. త్వరలో ప్రారంభం కానున్న ఆదిలాబాద్ ఐటీ టవర్ ద్వారా ఆదిలాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల యువతీ యువకులకు స్థానికంగానే ఉద్యోగావకాశాలు లభించాలని కేటీఆర్ ఆకాంక్షించారు.



తెలంగాణలోని ద్వితీయ శ్రేణి నగరాలకు ఐటీ కంపెనీలను తీసుకెళ్లాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఐటీ టవర్ల నిర్మాణాలు చేపట్టామని ఆయన తెలిపారు. అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి ప్రముఖ ఐటీ కంపెనీలను ఆకర్షించేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే వరంగల్, సిద్దిపేట, సూర్యాపేట, నల్గొండ, నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం, కరీంనగర్ నగరాల్లో ఐటీ టవర్లు ప్రారంభమయ్యాయని కేటీఆర్ గుర్తుచేశారు. అయితే, ప్రస్తుతం ఈ ఐటీ టవర్ల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతున్నదనే వార్తలు వస్తున్నాయని ఆయన అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఐటీ టవర్లలో అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని, మరిన్ని ఐటీ కంపెనీలను ఆకర్షించే చర్యలు చేపట్టాలని కోరారు. స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కేటీఆర్ సూచించారు.

# ఎల్‌పిజి పైప్‌లైన్‌కు గ్రీన్‌సిగ్నల్.. తెలంగాణకు అనుసంధానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు22:** దేశంలో ఎల్‌పీజీ సరఫరా వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు రూ. 7,000 కోట్ల వ్యయంతో ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించేందుకు పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ మండలి (పీఎన్‌జీఆర్‌బీ) ఆమోదం తెలిపింది. ఈ బృహత్తర ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి గణనీయమైన లబ్ధి చేకూరనుంది. ప్రభుత్వరంగ సంస్థ గెయిల్ (ఇండియా) లిమిటెడ్ ఆధ్వర్యంలో సుమారు 1,800 కిలోమీటర్ల మేర కొత్త పైప్‌లైన్లను నిర్మిం చనున్నారు. ఇందులో భాగంగా తెలంగాణలోని చర్లపల్లి నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ వరకు 556 కిలోమీటర్ల పొడవైన పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీనితో పాటు ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ నుంచి ఉత్తరాఖండ్‌లోని సితార్‌గంజ్ వరకు (611 కి.మీ.), మహారాష్ట్రలోని శిక్రాపూర్ నుంచి కర్ణాటక, గోవాలోని హుబ్లీ వరకు (633 కి.మీ.) మరో రెండు ప్రధాన మార్గాలను కూడా నిర్మించనున్నారు. ఈ పైప్‌లైన్లు తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్ణాటక, గోవా రాష్ట్రాల గుండా వెళతాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే దేశంలోని మొత్తం ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్ ప్రస్తుతం ఉన్న 7,700 కిలోమీటర్ల నుంచి 9,500 కిలోమీటర్లకు విస్తరిస్తుంది. పైప్‌లైన్ల ద్వారా గ్యాస్ సరఫరాను పెంచడం వల్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా, రహదారులపై ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాల ముప్పు కూడా గణనీయంగా తగ్గుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ బృహత్తర ప్రాజెక్టులో తెలంగాణ రాష్ట్రానికి అత్యంత కీలకమైన స్థానం లభించింది. హైదరాబాదు సమీపంలోని చర్లపల్లి నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ వరకు ప్రత్యేకంగా ఈ ప్రధాన ఎల్‌పిజి పైప్‌లైన్ మార్గాన్ని నిర్మించనున్నారు. రోడ్డు మార్గంలో ట్యాంకర్ల ద్వారా గ్యాస్ రవాణా చేయడం వల్ల కలిగే ప్రమాదాలు, ఆలస్యం, అధిక రవాణా ఖర్చులను ఈ భూగర్భ పైప్‌లైన్లు గణనీయంగా తగ్గిస్తాయి. తెలంగాణలోని బాట్లింగ్ ప్లాంట్లకు నిరంతరం, సురక్షితంగా ఇంధన సరఫరా జరగడం వల్ల భవిష్యత్తులో గ్యాస్ కొరత సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడమే కాకుండా, స్థానికంగా పారిశ్రామిక అభివృద్ధి, రవాణా వ్యవస్థల బలోపేతానికి ఈ ప్రాజెక్ట్ ఎంతో దోహదపడనుంది.

# జోయలుక్కాస్ ప్రిమోరా డిజైనర్ డైమండ్ జ్యుయెలరీ కలెక్షన్ ఆవిష్కరణ

**హైదరాబాద్, ఆగస్టు 22:** ప్రపంచవ్యాప్తంగా 12 దేశాల్లో 190కి పైగా షోరూమ్లను నిర్వహిస్తున్న ప్రముఖ ఆభరణాల సంస్థ జోయలుక్కాస్, ప్రకృతి అందాలకు, జీవితాంతం కొనసాగే ప్రేమకు ప్రతీకగా నిలిచే ప్రిమోరా ప్రత్యేక డిజైనర్ డైమండ్ జ్యుయెలరీ కలెక్షన్ను ఆవిష్కరించింది. ఈ కలెక్షన్ను ఆగస్టు 22 నుంచి ప్రపంచవ్యాప్తంగా ఉన్న జోయలుక్కాస్ షోరూమ్లలో అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రిమోరా కలెక్షన్‌కు ప్రకృతిలోని అత్యంత అందమైన ప్రేమకథల్లో ఒకటైన హార్న్‌బిల్ (కొమ్ము పక్షి) స్ఫూర్తిగా నిలిచింది. హార్న్‌బిల్ తన భాగస్వామి పట్ల జీవితాంతం చూపించే ప్రేమ, నిబద్ధత, విశ్వాసానికి ప్రసిద్ధి చెందింది. ఈ పక్షి ఆకృతి, ఆకర్షణీయమైన రంగులు, అచంచలమైన అనుబంధాన్ని స్ఫూర్తిగా తీసుకుని జోయలుక్కాస్ ఈ కలెక్షన్ను రూపొందించింది. నాణ్యత, సృజనాత్మకత, వినూత్న డిజైన్, అత్యుత్తమ నైపుణ్యానికి ప్రిమోరా కలెక్షన్ ప్రతీకగా నిలుస్తుందని జోయలుక్కాస్ తెలిపింది. ప్రేమ, అనుబంధాలకు గుర్తుగా నిలిచే ఈ ఆభరణాలు వినియోగదారుల జీవితంలోని ప్రత్యేక సందర్భాలను మరింత అందంగా మార్చేలా రూపొందించినట్లు పేర్కొంది.



జోయలుక్కాస్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ జాయ్ అలుక్కాస్ మాట్లాడుతూ, తమ ప్రతి జ్యువెలరీ కలెక్షన్ వెనుక వినియోగదారులను లోతుగా ఆకట్టుకునే ఒక కథ ఉంటుందని చెప్పారు. హార్న్‌బిల్లో కనిపించే అసాధారణమైన ప్రేమ, విశ్వాసం, కలిసి ఉండాలనే భావన తమను ప్రిమోరా కలెక్షన్కు ప్రేరేపించాయని తెలిపారు. జీవితంలో విలువైన సంబంధాలను, మరపురాని జ్ఞాపకాలను ప్రతిబింబించే ఆభరణాలను అందించాలనే ఉద్దేశంతో ఈ కలెక్షన్ను రూపొందించినట్లు పేర్కొన్నారు. ప్రపంచంలోని ప్రముఖ జ్యువెలరీ రిటైలర్లలో ఒకటైన జోయలుక్కాస్ 12 దేశాల్లో 190కి పైగా షోరూమ్లను నిర్వహిస్తోంది. బంగారం, వజ్రాలు, విలువైన రాళ్లు, ప్లాటినం, వెండి తదితర ఆభరణాలను సంస్థ అందిస్తోంది.

# బోధన్‌లో మద్యం, గంజాయి మత్తులో పోలీసులపై దాడి చేసిన వ్యక్తి

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** కుటుంబ గొడవల వల్ల మద్యంతో పాటు గంజాయి సేవించిన ఓ వ్యక్తి పోలీసు స్టేషన్‌లోనే వీరంగం సృష్టించడంతో పాటు పోలీసులపై దాడిగి దిగన ఘటన ఇది. నిజామాబాద్ జిల్లా బోధన్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఈ ఘటన జరి గింది. బోధన్‌లోని కొప్పర్గకు గ్రామానికి చెందిన సాయిలు (35) కూలీగా పనిచేస్తున్నాడు. మద్యం తాగడం, గంజాయి సేవించడం వంటి దు రలవాట్లు వున్న ఇతను నిత్యం భార్యతో పాటు కుటుంబ సభ్యులతో గొడవపడే వాడు. శుక్రవారం కూడా ఇదే విధంగా గొడవపడ్డాడు. ఈ క్రమ ంలోనే బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఇతను గొడవకు దిగాడు. దీంతో అక్కడి వైద్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో గస్తీ పోలీసు లు అక్కడికి వచ్చి సాయిలును బోధన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. కాగా పోలీసు స్టేషన్‌లో సాయిలు వీరంగం సృష్టించాడు. సిఐ వెంకటర మణతో పాటు ఇతర సిబ్బందిపై దాడికి దిగాడు. ఒక కానిస్టేబుల్ వేలు కొరికాడు. దీంతో సదరు కానిస్టేబుల్ వేలికి గాయం కాగా ఆయనను వె ంటనే ఆసుప త్రికి తరలించారు. దీని తరువాత అతి కష్టం మీద సాయిలును పోలీసులు అదుపుచేసి అతన్ని కూడా ఆసుపత్రికి తరలించారు. మద్యం, గం జాయి సేవించి పోలీసు స్టేషన్‌లో వీరంగం సృష్టించినందుకు సాయిలుపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.



# ఒక్కరోజే 400 కేసులు పరిష్కారం


### సమాధాన్ సమారోహ్‌తో సుప్రీం కేసులు విచారణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** సుదీర్ఘకాలంగా కోర్టుల చుట్టూ తిరుగుతూ నలిగిపోతున్న బాధితులకు ఊరటనిచ్చేలా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం సంచలన ఫలితాలను ఇస్తోంది. భారత ప్రధాన న్యాయమూర్తి పర్యవేక్షణలో నిర్వహిస్తున్న సమాధాన్ సమారోహ్ 2026 కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక లోక్ అదాలత్ తొలి రోజే మైలురాయిని అధిగమించింది. నేడు ఒక్క రోజే ఏకంగా 400 కంటే ఎక్కువ వివాదాలు సామరస్యపూర్వకంగా పరిష్కారమై రికార్డు సృష్టించాయి. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ కోసం సుప్రీంకోర్టు సముదాయంలో ఏకంగా 16 ప్రత్యేక బెంచ్ లను ఏర్పాటు చేశారు. ప్రతీ బెంచ్‌లో ఇద్దరు సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తులతో పాటు సీనియర్ అడ్వకేట్లు, అడ్వకేట్‌ఆన్‌రికార్డ్ ప్రతినిధులు సభ్యులుగా వ్యవహరించారు. ఈ ధర్మాసనాల ముందుకు తొలిరోజు విచారణ కోసం 600కు పైగా వివిధ రకాల కేసులు రాగా, కక్షిదారుల మధ్య పరస్పర సంభాషణను ప్రోత్సహిస్తూ 400కు పైగా కేసుల్లో ఇరుపక్షాలు ఒక అంగీకారానికి వచ్చేలా న్యాయమూర్తులు, న్యాయవాదులు కీలక పాత్ర పోషించారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పలు రకాల సున్నితమైన కేసులను విచారణకు స్వీకరించారు. భార్యాభర్తల మధ్య వైవాహిక వివాదాలు, ఆస్తి తగవులు, మోటారు వాహన ప్రమాద నష్టపరిహారం పిటిషన్లు, భూసేకరణపరిహారం వివాదాలతో పాటు పన్నులకు సంబంధించిన కేసులు, సర్వీస్, లేబర్ వివాదాలను ఇందులో పరిష్కరించారు. ఏప్రిల్ 21న సమాధాన్ సమారోహ్ ప్రారంభమైనప్పటి నుంచి కక్షిదారులు, వారి తరఫు న్యాయవాదులతో ముందుగానే చర్చలు జరిపి ఒప్పంద అవకాశాలను కల్పిస్తోంది. ఏళ్ల తరబడి సాగే న్యాయపోరాటాలు కక్షిదారులపై మోపే ఆర్థిక, మానసిక భారాలను తగ్గించడమే ఈ లోక్ అదాలత్ ప్రధాన ఉద్దేశం. సంప్రదింపులు, పరస్పర అంగీకారం ద్వారా సమస్యల పరిష్కార యంత్రాంగాన్ని బలోపేతం చేయాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. ఆగస్టు 23 వరకు కొనసాగే ఈ ప్రత్యేక లోక్ అదాలత్ ముగింపుతో సమాధాన్ సమారోహ్ 2026 విజయవంతంగా పూర్తి కానుంది.

# బంగ్లాదేశ్ ప్రధాని రాకపై అనిశ్చితి

### ఇంకా స్పష్టత లేదు: విదేశాంగ శాఖ

**ఢాకా, ఆగస్టు 22:** బంగ్లాదేశ్ ప్రధాని తారిఖ్ రెహ్మాన్ భారత పర్యటనపై అనిశ్చితి నెలకొంది. ఈ నెల చివరి వారంలో రెహ్మాన్ భారత్‌కు రావాల్సి ఉండగా.. అధికారికంగా మాత్రం ఆయన రాకపై ఇంకా స్పష్టత లేదు. బంగ్లాదేశ్ ప్రధాని పర్యటనకు సంబంధించి తమ వద్ద తాజా సమాచారం లేదని భారత విదేశాంగమంత్రిత్వ శాఖ అధికారిక ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మీడియాతో పేర్కొన్నారు. దౌత్య సంబంధాల బలోపేతం కోసం బంగ్లాదేశ్ ప్రధాని తారిఖ్ రెహ్మాన్ తొలిసారి భారత్‌లో పర్యటిస్తారనే వార్తలు



వినిపిస్తున్నా షెడ్యూల్ మాత్రం ఖరారు కాలేదు. న్యూఢిల్లీకి బంగ్లా ప్రధాని వస్తున్నారా? అనే ప్రశ్నకు శుక్రవారం భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్‌జైస్వాల్ మీడియాతో మాట్లాడుతూ 'నా వద్ద సమాచారం లేదు' అని చెప్పారు. 'బంగ్లాదేశ్ ప్రధాని భారత పర్యటనపై నేను చెప్పాల్సిందేమీ లేదు. తాజా సమాచారం ఏదైనా ఉంటే నేను మీకు తెలియజేస్తాను' అని జైస్వాల్ వెల్లడించారు. అంతకుముందు.. రాష్ట్రపతి నిలయం కూడా తారిఖ్ రెహ్మాన్ రాకను ధ్రువీకరించలేదు. బంగ్లా ప్రధానికి స్వాగత సన్నాహకాల్లో భాగంగా నిర్వహించే చేంజ్ ఆఫ్ గార్డ్ రిహార్సల్స్‌ను అధికారులు రద్దు చేశారు. అంతేకాదు రెహ్మాన్ భారత పర్యటన ఉంటుందని పేర్కొన్న రాష్ట్రపతి భవన్ కాసేపటికే తమ ప్రకటనను వెనక్కి తీసుకుంది. దాంతో.. ఈ నెలాఖరున తారిఖ్ రెహ్మాన్ భారత్ పర్యటనపై నెలకొన్న అనిశ్చితికి తెరపడలేదు. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం ఈ నెల 23, 24 తేదీల్లో బంగ్లా ప్రధాని ఇండియాలో పర్యటించాలి.

# హైదరాబాద్ శివార్లలో పాన్‌మసాల తయారీ కేంద్రాన్ని రట్టుచేసిన సిజిఎస్‌టి

### భారీగా ముడిసరకు, యంత్రాలు జప్తు, కీలక సూత్రధారి అరెస్టు

### రూ.160 కోట్ల పన్ను ఎగవేసినట్లు గుర్తింపు

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** హైదరాబాద్ శివార్లలోని మేడ్చల్‌లో ఓ పారిశ్రామికవాడలో మూతపడ్డ ఫ్యాక్టరీలో రహస్యంగా కొనసాగుతున్న పాన్ మసాలా యూనిట్‌కు సిజిఎస్‌టి శుక్రవారం రాత్రి అధికారులు రట్టు చేశారు. ఈ సందర్భంగా 160 కోట్ల రూపాయల పన్ను ఎగ వేతనే ఛేదించారు. సిజిఎస్‌టి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ పారిశ్రామిక వాడలో ఈ రహస్య ఫ్యాక్టరీ సాగుతోంది. హైదరా బాద్‌లోని కొన్నిచోట్ల దొంగచాటుగా పాన్ మసాలాతో పాటు ఇంకొన్ని వస్తువులను తయారు చేస్తూ వాటిని మార్కెట్లో అమ్ముతున్నట్లు అందిన సమాచారం మేరకు సిజిఎస్‌టి అధికారులు ఈ దాడులు నిర్వహించారు. దాడుల సందర్భంగా ఆ ఫ్యాక్టరీలో పెద్ద ఎత్తున ముడి సరుకుతో పా టు పాన్ మసాలా తయారీ, ప్యాకింగ్ కోసం వున్న పది యంత్రాలను జప్తు చేసి, మేనేజర్‌గా వున్న కీలక సూత్రధారిని అరెస్టు చేశారు. సిజిఎ స్‌టి అధికారుల దాడుల్లో ఎటువంటి అనుమతులు లేకుండానే ఫ్యాక్టరీ కొనసాగుతున్నట్లు తేలగా అక్కడ సుగంధ జర్దాతో పాటు పలు రకాల పాన్ మసాలాలు తయారవుతుండడాన్ని అధికారులు గుర్తించారు. ఇక్కడ 56 మంది కార్మికులు పనిచేస్తుండగా 40 యంత్రాలు వున్నాయి. ఇం దులో కొన్ని మసాలాలు తయారు చేసేందుకు, మరికొన్ని ప్యాకింగ్ చేసేందుకు వున్నాయి. వీటి తయారీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి లైసెన్స్‌లు తీసుకోలేదు. జిఎస్‌టి, హెచ్ఎసెఎస్‌సెస్, సెంట్రల్ ఎక్సైజ్ సుం కాల చెల్లింపులు జరగడం లేదని అధికారులు గుర్తిం చారు. దాడుల సందర్భంగా రవాణాకు సిద్దంగా వున్న రూ. 76 లక్షల విలువైన సరకుతోపాట 5500 కిలోల రెడీమేడ్ ప్యాకెట్లను జప్తు చేశారు. వీటితో పాటు 2015 కిలోల పాన్‌మసాలా మిశ్రమం, 810 కిలోల పొగాకు, ప్యాకింగ్ కోసం వున్న సామాగ్రి, సరుకు రవాణా కోసం వున్న రెండు వాహనాలను జప్తు చేశారు. పాన్ మసాలా, పొగాకు ఉత్పత్తులపై 2026 ఫిబ్రవరి నుంచి అమల్లో వచ్చిన కొత్త పన్ను నిబంధనల నుంచి తప్పించుకునేందుకు కొందరు వ్యాపారులు ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నట్లు అధికారులు తెలిపారు. పట్టుబడ్డ సరుకు విలువ ప్రకారం రూ. 160 కోట్ల పన్నులు ఎగవేసినట్లు తేలిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా కీలక సూత్రధారిని సిజిఎస్‌టి అధికారులు అరె స్టు చేయగా అతన్ని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండుకు తరలించారు.

# భారత్, బంగ్లా సరిహద్దుల్లో ఉగ్ర శిబిరాలు!

## సిలిగురి కారిడార్ (చికెన్ నెక్) భద్రతపై కేంద్ర హోం శాఖ ఉన్నతస్థాయి సమీక్ష

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** దేశంలోని ఈశాన్య రాష్ట్రాలను ఇతర ప్రాంతాలతో కలిపే రోడ్డు మార్గం సిలిగురి కారిడార్ (చికెన్ నెక్) భద్రతపై కేంద్ర హోం శాఖ మరోదఫా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించింది. భారత్, బంగ్లా సరిహద్దుల్లో పాక్ ఉగ్రవాద శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరించిన దరిమిలా కేంద్ర హోం శాఖ ఇటీవల నిర్వహించిన ఈ సమీక్షకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సమీక్షలో బెంగాల్ అధికారులతో పాటు బంగ్లాదేశ్‌తో సరిహద్దులో భద్రత పర్యవేక్షిస్తున్న బిఎస్ఎఫ్ అధికారులు కూడా పాల్గొన్నారని తెలిసింది. చికెన్ నెక్ రహదారి భద్రతపై కేంద్రం మరోసారి దృష్టి సారించింది. బెంగాల్‌లో తాము అధికారంలో వస్తే ఈ మార్గంలో గల కొంత భూ భాగాన్ని బిఎస్ఎఫ్ పరిధిలోకి తీసుకువస్తామని బిజెపి ప్రకటించడం తెలిసిందే. అనుకున్నట్లుగానే బెంగాల్‌లో బిజెపి అధికారంలో రాగా వెను వెంటనే చికెన్ నెక్ మార్గంలో భద్రతను కట్టుదిట్టం చేసి, సమీప ప్రాంతాలలో బంగ్లా నుంచి చొరబాట్లను పూర్తిగా నిలిపివేసేందుకు చర్యలు చే బట్టింది. చికెన్ నెక్ మార్గం ప్రాంతంలో బిఎస్ఎఫ్ సిబ్బంది పహారా, వాహనాల రాకపోకలు మరింత సులభతరమయ్యేందుకు వీలుగా 600 ఎక రాల ప్రభుత్వ భూమిని కేంద్రానికి బెంగాల్ సర్కారు బదలాయించింది. ఈ నేపథ్యంలో చికెన్ నెక్ మార్గంలో గల అక్రమ చొరబాట్లకు సంబంధించిన అన్ని పాయింట్లను మూసివేసే అక్కడ బిఎస్ఎఫ్ బలగాలను మోహరించింది. వీరికి సహకరించేందుకు బెంగాల్ బలగాలను రంగంలో దింపారు. చికెన్ నెక్ ప్రాంతం భారత్‌తో పాటు బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్‌లకు ఎంతో కీలకమైనది. బెంగాల్ సర్కారు చికెన్ నెక్ భద్రతపై తాజాగా తీసుకున్న నిర్ణయం ప్రకారం ఈ ప్రాంతంలో గల జాతీయ రహదారిపై ఇకమీదట బిఎస్ఎఫ్ పహారా నిరంతరం కొనసాగుతుంది. కే వలం 60 కిలోమీటర్ల దూరం వున్న ఈ మార్గం కొన్నిచోట్ల వెడల్పు 20 నుంచి 22 కిలోమీటర్లు మాత్రమే వుండడం గమనార్హం. ఈశాన్య రా ష్ట్రాలు అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, మిజోరం, మణిపూర్, నాగాలాండ్, త్రిపుర, సిక్కింలకు వెళ్లాలంటే ఏకైక రోడ్డు మార్గం ఇదే కావడం విశేషం. ఈ కారిడార్‌కు ఓవైపు నేపాల్ మరోవైపు బంగ్లాదేశ్ వుండగా భూటాన్ కొంత దూరంలో వుంది. చైనాలోని చుంబీ లోయకు ఇది చాలా దగ్గరగా వుంది. భారత్‌లో రక్షణ పరంగా అత్యంత ముప్పువున్న ప్రాంతాల్లో ఇది ఒకటిగా రక్షణ వర్గాలు చెబుతుండడంతో కేంద్ర హోం మంత్రి ఈ మార్గంలో భద్రతకు ప్రాధాన్యం ఇచ్చారు. ఈశాన్య రాష్ట్రాలతో అనుసంధానం చేసే ఈ మార్గాన్ని స్వాధీనం చేసుకోవాలని చై నా అనేకసార్లు యత్నించగా రక్షణ బలగాలు దీనిని వమ్ముచేశాయి. ఐదు కోట్ల మంది ప్రజలు వున్న ఈశాన్య రాష్ట్రాలతో పాటు ఇక్కడ పహారా కాసే మిలటరీ, భద్రతా బలగాలకు సరుకు రవాణాలో ఈ రహదారి కీలకంగా వుంటోంది. 2017లో డోక్లాం వద్ద చైనాతో ఘర్షణ చెలరేగినపుడు ఈ కారిడార్ భద్రతపై ఆందోళన వ్యక్తం అయినా రక్షణ బలగాల ముందు చైనీయుల కుట్రలు సాగలేదు. ఇక తాజా వివాదం వరకు వస్తే బం గ్లాలో హసీనా సర్కారు పతనమైన తరువాత అక్కడ పాక్ అనుకూల శక్తులు పుంజుకోవడం, చికెన్ నెక్ ప్రాంతంలో ఉగ్ర శిబిరాలు ఏర్పాటవడ ం కేంద్ర నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ ఉగ్ర శిబిరాలు కచ్చితంగా బెంగాల్ సహా ఈశాన్య రాష్ట్రాల్లో విధ్వంసక కార్యకలాపాల కోసమే ఏర్పాటైనట్లు నిఘా వర్గాలు అంచనా వేశాయి. దీంతో చికెన్ నెక్‌పై హోం శాఖ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి ఈ ప్రాంతంలో భద్రతను కట్టుది ట్టం చేయాలని ఆదేశించింది. ఇంతకాలం ఈ ప్రాంతంలో భద్రతపై బెంగాల్‌లోని టిఎంసి సర్కారు కేంద్రంతో పేచీ పెడదం తెలిసిందే. ఇప్పుడు బెంగాల్‌లో బిజెపి సర్కారు రావడంతో ఈ సమస్య తీరింది. తాజా పరిణామాలను కేంద్రం నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఈ ప్రాంతంలో బిఎస్ఎఫ్ అధికారులకు కేంద్రం పూర్తి అధికారాలను ఇచ్చింది.

## వ్యవసాయంలో యంత్రాలు అవశ్యం

### ఖర్చులు తగ్గడంతో పాటు, పెరగనున్న దిగుబడి

### ఉద్యాన్న వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ రాజిరెడ్డి

**హైదరాబాద్, అగస్టు 22, ప్రభాతవార్త:** భవిష్యత్ కోసం వ్యవసాయంలో యంత్రాల వాకడం చాలా ముఖ్యమైనదని తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ దండ రాజిరెడ్డి పేర్కొన్నారు. యాంత్రీకరణ వల్ల కూలీ ఖర్చులు తగ్గడంతో పాటు, సమయం ఆదా అవుతుంది మరియు రైతులకు పంట దిగుబడి పెరుగుతుందని చెప్పారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని కూరగాయల పరిశోధనా కేంద్రంలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో యంత్రాల వినియోగం వల్ల తక్కువ శ్రమ మాత్రమే అవసరం ఉంటుందన్నారు. ప్రస్తుతం సాగులో తీవ్ర సమస్యగా ఉన్న వ్యవసాయ కార్మికుల కొరతను సైతం యంత్రాలు భర్తీ చేస్తాయని తెలిపారు. అంతేకాకుండా పనిముట్లు, యంత్రాలను ఉపయోగించడం వల్ల పంట దిగుబడి పెరిగి, వృధా తగ్గుతుందని వివరించారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో సాగులో యాంత్రీకరణ తప్పనిసరి కానున్నట్టు స్పష్టం చేశారు. యాంత్రీకరణ పెద్దస్థాయి వ్యవసాయానికి మాత్రమే పరిమితం కాకుండా, కూరగాయల సాగు, పండ్ల తోటల్లోనూ విస్తృతంగా ఉపయోగపడుతుందని వెల్లడించారు. రైతులకు అధిక ఉత్పాదకత, తకువ శ్రమతో స్థిరమైన సాగు పద్ధతులను అందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆధునిక ప్లాంటర్లు, ట్రాన్స్‌ప్లాంటర్లతో నాట్లు వేగంగా జరుగడంతో రైతుల శ్రమ తగ్గి దిగుబడి పెరుగుతుందని చెప్పారు.

## బ్రాహ్మణ పరిషత్‌కు నిధులు కేటాయించాలి




సమావేశంలో మాట్లాడుతున్న రుద్రవీణ బాలసుబ్రమణ్యం

**సైఫాబాద్, ఆగస్టు 22 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బ్రాహ్మణ సమాజ సంక్షేమం, అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన తెలంగాణ బ్రాహ్మణ పరిషత్‌కు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిధులను కేటాయించి, సభ్యులను నియమించాలని తెలంగాణ బ్రాహ్మణ కార్పోరేషన్ సాధన సమితి డిమాండ్ చేసింది. లేని పక్షంలో రాష్ట్రంలోని బ్రాహ్మణులను ఐక్యం చేసి ఉద్యమం చేపడతామని సమితి ప్రతినిధులు హెచ్చరించారు. శనివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సాధన సమితి ఛైర్మన్ రుద్రవీణ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇతర సామాజిక వర్గాలకు ఏవిధంగా ప్రభుత్వం కార్పోరేషన్‌లు ఏర్పాటు చేసి వాటి ద్వారా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదో అలాగే బ్రాహ్మణ సమాజానికి కూడా ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. సంక్షేమ కార్యక్రమాల కోసం బ్రాహ్మణ పరిషత్‌ను కార్పోరేషన్‌గా మార్చాలని, బ్రాహ్మణ సమాజంలోని వారికి విద్యా, ఉపాధి, ఆర్థిక, సామాజిక సంక్షేమ కార్యక్రమాల కోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలని, ఇందుకోసం బ్రాహ్మణ సమాజం ప్రతినిధులతో చర్చించి సమస్యలకు కాలపరిమితితో కూడిన పరిష్కార మార్గాన్ని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సమితి కార్యవర్గ సభ్యులు కోటేశ్వరరావు, అక్కినేపల్లి పురుషోత్తమరావు, కే.సతీష్‌కుమార్, కాశీనాథ్‌శర్మ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో న్యాయవాది మృతి

**చార్మినార్, ఆగస్టు 22 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ న్యాయవాది మృతి చెందిన శనివారం సాయంత్రం మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కొండలరావు కథనం ప్రకారం. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన జి.ఘాన్సీ రాణి (25) న్యాయవాది. కాగా శనివారం సాయంత్రం మూడు గంటల సమయంలో న్యాయవాది గొల్లా రాహుల్‌తో కలిసి ఘాన్సీ రాణి మోటార్ సైకిల్‌పై సాలార్‌జంగ్ మ్యూజియం రహదారి నుంచి హైకోర్టుకు ప్రయాణం చేస్తున్నారు. అదే సమయంలో ద్విచక్ర వాహనం సాలార్‌జంగ్ మ్యూజియం రహదారికి చేరుకున్న సమయంలో నాగర్‌కర్నూల్ డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు ఘాన్సీ రాణి, ప్రయాణం చేస్తున్న వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో బస్సు టైరు ఘాన్సీ రాణిపై నుంచి వెళ్లటంతో తీవ్ర గాయాలు అయ్యాయి. తీవ్ర గాయాలు పాలైన ఘాన్సీ రాణిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు మృతి చెందినట్లు నిర్ధారించారు. మరో న్యాయవాది రాహుల్ కుడి చేతికి గాయాలు అయ్యాయి. బస్సు డ్రైవర్‌ను పోలీసులుఅదుపులోకి తీసుకున్నారు. ఈ కేసును మీర్‌చౌక్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఈశాన్య ఇంగ్లండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం



**క్లీవ్‌ల్యాండ్, ఆగస్టు 31:** ఇంగ్లండ్‌లోని ఈశాన్య ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు పోలీసు అధికారులు ఉన్నారు. ప్రధాన రహదారిపై రాంగ్‌రూటులో వెళ్తున్న ఓ కారు, గుర్తింపు ఉన్న పోలీసు వాహనాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు క్లీవ్‌ల్యాండ్ పోలీసులు తెలిపారు. మిడిల్స్‌బ్రోకు తూర్పున సౌత్ బ్యాంక్ ప్రాంతం సమీపంలో తెల్లవారుజామున 3.39 గంటలకు ప్రమాదం జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. రెండు వాహనాల్లో ఉన్న వారందరూ ఘటనాస్థలంలోనే మృతి చెందినట్లు తెలిపారు."ఈ విషాద ఘటన క్లీవ్‌ల్యాండ్ అంతటా, మన సమాజాల్లో, మొత్తం పోలీసు వ్యవస్థలో తీవ్ర ప్రభావం చూపుతుంది" అని క్లీవ్‌ల్యాండ్ పోలీస్ చీఫ్ కానిస్టేబుల్ విక్టోరియా ఫుల్లర్ అన్నారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు కొనసాగుతోందని, మృతులందరినీ అధికారికంగా గుర్తించే ప్రక్రియ చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. ఇలాంటి ఘటనల్లో సాధారణంగా జరిగే విధంగానే బ్రిటన్‌కు చెందిన ఇండిపెండెంట్ ఆఫీస్ ఫర్ పోలీస్ కండక్ట్ ఈ ఘటనపై సమీక్ష నిర్వహించనుంది. ఇదిలా ఉండగా, ఐర్లాండ్‌లో డబ్లిన్ సమీపంలో ఇటీవల జరిగిన రెండు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదాల్లో ఒకదానిలో ఐదుగురు మృతి చెందిన నేపథ్యంలో రోడ్డు భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## అక్రమ ఆయుధాల విక్రేత అరెస్టు

### 3తుపాకులు, 19 తూటాలు స్వాధీనం

**నేరెడ్ మెట్, మల్కాజిగిరి కమిషనరేట్, ఆగస్టు 22, ప్రభాతవార్త :** హైదరాబాద్‌లో అక్రమంగా ఆయుధాలు విక్రయించేందుకు బీహార్ నుంచి తుపాకులు తీసుకొచ్చిన అంతర్రాష్ట్ర నేరస్థుడిని మల్కాజిగిరి ఎస్ఓటీ, బొల్లారం పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రెండు నాటు పిస్టళ్లతో పాటు డబుల్ బ్యారెల్ తపంచా, మూడు మ్యాగజైన్లు, 19 సజీవ తూటాలు, బ్యాక్‌ప్యాక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి శనివారం వెల్లడించారు. సాధనా మందిర్ వద్ద పట్టివే అక్రమ ఆయుధాలు విక్రయించేందుకు ఓ వ్యక్తి బొల్లారం ప్రాంతంలో సంచరిస్తున్నాడన్న సమాచారంతో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. శనివారం మధ్యాహ్నం 12.10 గంటలకు సాధనా మందిర్ సమీపంలోని బంగ్లా నంబర్ 13 వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా తుపాకులు, తూటాలు లభించాయి. నిందితుడిని ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజీపూర్ జిల్లాకు చెందిన పర్బాన్స్ కుమార్ (27)గా గుర్తించారు. చెర్లపల్లి ప్రాంతంలో ఉంటూ కూలీగా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఒక్కోటి రూ.30 వేల చొప్పు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఆయుధాల విక్రయానికి పూనుకున్నట్లు విచారణలో తేలింది. బీహార్‌కు చెందిన సోనూ వద్ద ఒక్కో తుపాకీని సుమారు రూ.30 వేల చొప్పున కొనుగోలు చేసినట్లు నిందితుడు వెల్లడించాడు. వాటిని హైదరాబాద్‌కు తీసుకొచ్చి నేరస్థులకు అధిక ధరకు విక్రయించేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. గతంలో గంజాయి కేసుపర్బాన్స్ కుమార్‌పై గతంలో చెర్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో గంజాయి కేసు నమోదై ఉంది. 2024లో గంజాయి, గంజాయి చాక్లెట్లను విక్రయిస్తూ పోలీసులకు చిక్కినట్లు కమిషనర్ తెలిపారు. కట్టుదిట్టంగా నిఘానగరంలో అక్రమ ఆయుధాల కొనుగోలు, విక్రయాలు, రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని కమిషనర్ బి.సుమతి తెలిపారు.




స్వాధీనం చేసుకున్న ఆయుధాలతో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి

## డిఎంకెలో భారీ సంస్థాగత మార్పులు

### పార్టీ జిల్లాలు 77 నుంచి 110కి పెంపు



**చెన్నై, ఆగస్టు 22:** తమిళనాడులో అధికార డీఎంకే పార్టీ సంస్థాగతంగా భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. పార్టీ జిల్లాల సంఖ్యను ప్రస్తుత 77 నుంచి 110కి పెంచడంతో పాటు, వివిధ స్థాయిల్లో పార్టీ పదవులు చేపట్టే వారికి వయోపరిమితి, పదవీకాల పరిమితులను విధిస్తూ శనివారం జరిగిన డీఎంకే కార్యవర్గ సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. చెన్నైలోని అన్నాఅరివాలయంలో పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. పార్టీ శతాబ్ది ఉత్సవాల దిశగా సంస్థను మరింత పటిష్టం చేసేందుకు ఏర్పాటు చేసిన కమిటీ సమర్పించిన సిఫారసులను సమావేశం ఆమోదించింది. ఈ మార్పులను డీఎంకే 16వ సంస్థాగత ఎన్నికల్లో అమలు చేయనున్నారు. శాఖ కార్యదర్శుల వయసు 45 ఏళ్లకు మించకూడదు. వారు గరిష్ఠంగా రెండు పర్యాయాలు మాత్రమే ఆ పదవిలో కొనసాగవచ్చు. పట్టణ ప్రాంతాల్లో కొత్త శాఖ స్థాయి వ్యవస్థతో పాటు శాఖ కార్యదర్శి పదవిని ఏర్పాటు చేయనున్నారు. తొలుత చెన్నై, కోయంబత్తూరు, మదురై, తిరుచిరాపల్లి, సేలం నగరాల్లో ఈ విధానాన్ని అమలు చేసి, ఆ తర్వాత ఇతర కార్పొరేషన్లకు విస్తరించే అవకాశం ఉంది. చెన్నైలో వార్డు స్థాయి పార్టీ యూనిట్లను సగటున 10 వేల మంది ఓటర్లకు ఒక యూనిట్ చొప్పున ఏర్పాటు చేయనున్నారు. ఇతర నగరాల్లో సుమారు 5 వేల మంది ఓటర్లకు ఒక వార్డు యూనిట్ ఉండనుంది. వార్డు కార్యదర్శుల వయసు 50 ఏళ్లకు మించకూడదు. వారికి కూడా రెండు పర్యాయాల పదవీకాల పరిమితి ఉంటుంది. పంచాయతీ, ఏరియా, పట్టణ, యూనియన్ కార్యదర్శుల గరిష్ఠ వయోపరిమితిని 60 ఏళ్లుగా నిర్ణయించారు. వీరు కూడా గరిష్ఠంగా రెండు పర్యాయాలు మాత్రమే పదవిలో ఉండవచ్చు. చెన్నైలో ఏరియా యూనిట్ పరిధిలో సుమారు 40 వేల మంది ఓటర్లు, ఇతర నగరాల్లో సుమారు 30 వేల మంది ఓటర్లు ఉండేలా ఏర్పాటు చేయనున్నారు. ప్రతి 40 వేల మంది ఓటర్లకు ఒక టౌన్ యూనిట్, ప్రతి 30 వేల మంది ఓటర్లకు ఒక యూనియన్ యూనిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

## ఎసిబికి పట్టుబడ్డ చందానగర్ ఎస్ఐ, కానిస్టేబుల్

### 75 వేల రూపాయల లంచం సొమ్ముతో రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిన వైనం

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** పోలీసు అధికారులు లంచాలు తీసుకుంటూ ఎసిబికి పట్టుబడుతుండడం కొనసాగుతూనే వుంది. నగర శివార్లలోని చందానగర్ పోలీసు స్టేషన్‌లో శనివారం సాయంత్రం ఎస్ఐతో పాటు ఓ కానిస్టేబుళ్ల 75 వేల రూపాయల లంచం సొమ్ముతో రెడ్ హ్యాండెడ్‌గా ఎసిబి అధికారులకు దొరికిపోయారు. వివరాలు ఇలావున్నాయి. చందానగర్ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న బండెల బాల్ రాజ్ ఒక కేసులో (క్రైం నంబర్ 696...2026) ఛార్జిషీట్ ఫైల్ చేసేందుకు ఫిర్యాదిదారుడి నుంచి ఇది వరకే 20 వేల రూ పాయలు లంచం తీసుకున్నాడు. ఇదే సమయంలో ఎస్ఐ బాల్‌రాజ్ బృందంలో కానిస్టేబుల్‌గా వున్న బొట్ట రాఘవేంద్ర కుమార్ బాధితుడి నుంచి ఫోన్‌పే ద్వారా పది వేల రూపాయలు లంచంగా తీసుకున్నాడు. కాగా ఇదే కేసులో మరో 75 వేల రూపాయలు ఇవ్వాలని ఎస్ఐ బాల్‌రాజ్ ఫిర్యాదిదారుడి ను ంచి డిమాండ్ చేశాడు. దీంతో సదరు వ్యక్తి దీనిపై ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలో దిగిన ఎసిబి అధికారులు చందానగ ర్ పోలీసు స్టేషన్ వద్ద సాయంత్రం ఐదు గంటల నుంచి కాపుకాశారు. ఐదు గంటల సమయంలో లంచం సొమ్ము 75 వేల రూపాయలతో బా ధితుడు పోలీసు స్టేషన్‌లో వెళ్లి ఎస్ఐ బాల్‌రాజ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ రాఘవేంద్ర కుమార్‌లకు ఇచ్చాడు. దీనిని దూరం నుంచి గమనించిన ఎసిబి అధికారులు రెప్పపాటులో దాడిచేసి ఎస్ఐ బాల్‌రాజ్, కానిస్టేబుల్ రాఘ వేంద్ర కుమార్‌లను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో ఎసిబి అధికారులు సోదాలు చేశారు. ఎస్ఐ బాల్‌రాజ్ కూర్చునే టేబుల్‌లో ఆయన విచారిస్తున్న కేసుల ఫైళ్ల వివరాలను తీసుకున్నారు. దీని తరువాత ఎస్ఐ బాల్‌రాజ్, కానిస్టేబుల్ రాఘవేంద్ర కుమార్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు ఇద్దరిని రిమాండుకు తరలించారు. సర్కారీ విభాగాల్లో లంచావతారుల గురించి వెం టనే 1064కు సమాచారం అందించాలని ఎసిబి డిజి చారు సిన్హా కోరారు.

## వందేమాతరం చారిత్రక వారసత్వ పరిరక్షణకు బిజెపి తీర్మానం



**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** వందేమాతరం చారిత్రక వారసత్వాన్ని గౌరవించడం, పరిరక్షించడంపై బీజేపీ తీర్మానం చేసింది. పార్టీ ప్రధాన కార్యాలయంలో కొత్తగా నియమితులైన జాతీయ కార్యవర్గ పదాధికారుల సమావేశంలో ఈ తీర్మానాన్ని ఆమోదించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) పార్టీ కార్యక్రమాల్లో వందేమాతర్ంలోని తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఈ నిర్ణయాన్ని తాము స్పష్టంగా వ్యతిరేకిస్తున్నామని బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ సామాజిక మాధ్యమ వేదికగా పేర్కొన్నారు. మతపరమైన ఒత్తిళ్లు, రాజకీయ బుజ్జగింపులు లేదా సంకుచిత ఓటు బ్యాంకు ప్రయోజనాల కోసం జాతీయ గీతానికి సమానమైన జాతీయ గేయం వందేమాతరం స్థాయిని తగ్గించే ప్రతి ప్రయత్నాన్ని తిరస్కరించేందుకు బీజేపీ కట్టుబడి ఉందని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ కార్యకర్తల ద్వారా ప్రత్యేక ప్రచారం నిర్వహించి, వందేమాతరం చరిత్ర, అర్థం, జాతీయ ప్రాధాన్యత, ఘనమైన వారసత్వాన్ని దేశంలోని ప్రతి ప్రాంతానికి తీసుకెళ్లాలని పార్టీ నిర్ణయించిందని నబిన్ తెలిపారు. వందేమాతర్ంను భారత జాతీయ గేయంగా, భారతమాత పట్ల గౌరవానికి ప్రతీకగా, స్వాతంత్ర్య పోరాటానికి మంత్రంగా, భారత జాతీయ చైతన్యానికి చిరస్మరణీయ ప్రతీకగా బీజేపీ భావిస్తోందని ఆయన పేర్కొన్నారు. బీజేపీ విడుదల చేసిన ప్రకటనలో వందేమాతరం భారత జాతీయ గీతంగా, భారతమాత పట్ల గౌరవానికి ప్రతీకగా, స్వాతంత్ర్య పోరాటంలో ఒక మంత్రంగా, భారత జాతీయ చైతన్యానికి అమర చిహ్నంగా అభివర్ణించింది. పూర్తి వందేమాతరానికి జాతీయ గీతంగా ఉన్న గౌరవం, ప్రతిష్ఠ, వారసత్వం, జాతీయ హోదాను పరిరక్షించాలని పార్టీ తీర్మానించింది. 1950లో రాజ్యాంగ పరిషత్ చేసిన ప్రకటన ద్వారా వందేమాతరానికి లభించిన రాజ్యాంగ, చట్టపరమైన హోదాను, 2026లో పార్లమెంట్ చేసిన సవరణ ద్వారా జాతీయ గీతానికి సమానమైన చట్టపరమైన రక్షణ కల్పించడాన్ని బీజేపీ ప్రస్తావించింది. 1937లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీసుకున్న తీర్మానం, 1950లో ఏర్పడిన రాజ్యాంగపరమైన వ్యవస్థను లేదా 2026లో పార్లమెంట్ ఆమోదించిన చట్టాలను అధిగమించలేదని ప్రజలకు వివరించాలని బీజేపీ తీర్మానించింది. అంతకుముందు కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా కాంగ్రెస్ తీర్మానాన్ని జాతీయ వ్యతిరేకమైనదిగా అభివర్ణిస్తూ, ఓటు బ్యాంకు రాజకీయాలను ప్రోత్సహించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. వందేమాతరం చరిత్ర, అర్థం, జాతీయ ప్రాధాన్యత, ఘనమైన వారసత్వాన్ని దేశంలోని ప్రతి మూలకు తీసుకెళ్లేందుకు దేశవ్యాప్త ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. ముఖ్యంగా యువతలో అవగాహన కల్పించి, వారిని భాగస్వాములను చేయాలని బీజేపీ తీర్మానించింది. మొత్తం ఆరు చరణాలతో కూడిన జాతీయ గీతం, దాని చరిత్ర మరుగునపడకుండా చూడాలని, వందేమాతరంతో విడదీయరాని సంబంధం ఉన్న త్యాగాలు, పోరాటాలు, దేశభక్తి చైతన్యం గురించి భవిష్యత్ తరాలకు తెలియజేయాలని పేర్కొంది.

## ఉద్యమాలకు ఊపిరిపోసిన గడ్డ సిద్దిపేట

- శిల్పి రమణారెడ్డి పద్మశ్రీ అవార్డుకు అర్హుడు
- ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్, సీఎంవో ప్రజావాణి ఇంచార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి




ఎం.వి.రమణారెడ్డి పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** ఉద్యమాలకు ఊపిరిపోసిన గడ్డ సిద్దిపేట అని...రచయిత డాక్టర్ నందిని సిధారెడ్డి, శిల్పి ఎం.వి.రమణారెడ్డి పుట్టిన గొప్ప నెల సిద్దిపేట నెల అని ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్, సీఎంవో ప్రజావాణి ఇంచార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విపంచి కళా నిలయంలో శనివారం ఉద్యమ శిల్పి ఎమ్.వి.రమణారెడ్డి పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఎం.వి.రమణారెడ్డి మిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ, సిద్దిపేట ప్రాంతానికి వన్నె తెచ్చిన బహుముఖ ప్రజ్ఞాశాలి ఎం.వి.రమణారెడ్డి అన్నారు. తెలంగాణ తల్లి, అమర వీరుల జ్యోతి శిల్పాలను రూపొందించి తెలంగాణ ప్రజల గుండెల్లో రమణారెడ్డి స్థిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. సచివాలయం వద్ద స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని చక్క రూపుదిద్దారని తెలిపారు. రమణారెడ్డికి పద్మశ్రీ అవార్డు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం పక్షన కేంద్రానికి ప్రతిపాదన పంపుతామన్నారు. శిల్పకారుడు ఎం.వి.రమణారెడ్డి మాట్లాడుతూ ఎఐ సృజానాత్మకతకు ప్రత్యామ్నాయం కాదన్నారు. సిద్దిపేట ప్రాంతం కళలకు పునాది వేసిందన్నారు. ఈ సభలో కవులు, కళాకారులు, జిల్లాలోని బార్‌అసోసియేషన్ అధ్యక్షులు, న్యాయవాదులు తుంగ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## రూ.28 కోట్లుపైగా మోసం

### అధిక లాభాల ఆశ చూపి కేటుగాళ్ల బురిడీ

**జహీరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** గోల్డ్, సిల్వర్‌లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు, అధిక వడ్డీ వస్తుందని ఆశ చూపి జహీరాబాద్‌కు చెందిన పలువురి నుంచి రూ.28 కోట్లకు పైగా పెట్టుబడులు సేకరించి మోసానికి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ కేసుకు సంబంధించి నలుగురు నిందితులను జహీరాబాద్ టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జహీరాబాద్ పట్టణ సీఐ ఆర్. రవి, ఎస్సై లవకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ పట్టణానికి చెందిన మిదిదొడ్డి ఇజ్రాయేలు బాబి, కొత్త శశిధర్ రెడ్డి, నాగరిగారి విల్లీ ఫ్రాన్సిస్, పోతురాజు అరవింద్ తదితరులు మరో 22 మందితో కలిసి అధిక లాభాల ఆశతో హైదరాబాద్‌లోని నైకీ ట్రేడర్స్ సంస్థలో పెట్టుబడులు పెట్టారు. గత రెండేళ్లుగా బాధితులు వివిధ లావాదేవీల ద్వారా మొత్తం రూ.28,14,57,128 వరకు పెట్టుబడులు పెట్టినట్లు పోలీసులు తెలిపారు. తొలినాళ్లలో కొన్ని నెలల పాటు సంస్థ నిర్వాహకులు పెట్టుబడిదారులకు వడ్డీ మొత్తాలను చెల్లిస్తూ నమ్మకం కలిగించారు. దీంతో సంస్థపై నమ్మకం పెంచుకున్న బాధితులు మరింత పెద్ద మొత్తాలను పెట్టుబడులుగా అందజేశారు. అయితే భారీ మొత్తంలో డబ్బులు సేకరించిన అనంతరం సంస్థ మేనేజర్, సిబ్బంది బాధితులకు రాబడులు చెల్లించకుండా మోసానికి పాల్పడినట్లు ఫిర్యాదులు అందాయి. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. బాధితులు మిదిదొడ్డి ఇజ్రాయేలు బాబి, కొత్త శశిధర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుల మేరకు జహీరాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రెండు చీటింగ్ కేసులు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా సీఐ ఆర్. రవి, ఎస్సై లవకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టి మోసానికి పాల్పడిన నలుగురు నిందితులను అరెస్టు చేశారు.

## వ్యవసాయ కార్పొరేషన్లకు చెక్ ఒకే గొడుగు కిందకు తెచ్చే ఆలోచన

**హైదరాబాద్, అగస్టు 22, ప్రభాతవార్త:** వ్యవసాయ శాఖ అనుబంధ కార్పొరేషన్ల పనితీరుపై రాష్ట్ర సర్కార్ తీవ్ర అసంతృప్తిగా ఉంది. కొన్ని కార్పొరేషన్లతో రాష్ట్ర ఖజానాకు నయా పైసా లాభం లేకపోగా, మరింత ఆర్థిక భారంగా తయారయ్యాయని, ఇదే సమయంలో రైతులకు కూడా పెద్దగా ఉపయోగపడినా దాఖలాలు లేవనే ఉద్దేశ్యంతో ఉంది. మరీ ముఖ్యంగా ఆగ్రోస్, హాకా, సీడ్ కార్పొరేషన్, సీడ్ సర్టిఫికేషన్, గిడ్డంగుల కార్పొరేషన్ల పనితీరుపై ప్రభుత్వం సంతృప్తికరంగా లేదు. ఈ సంస్థలు అవినీతికి అడ్డాలుగా మారుతున్నాయనే అభిప్రాయమూ ప్రభుత్వంలో ఉన్నట్టు తెలుస్తోంది. దీంతోనే ఆయా సంస్థలను ప్రక్షాళన చేసేందుకు సర్కార్ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వివిధ కార్పొరేషన్ల అన్నింటినీ కలిపి ఒకే కార్పొరేషన్‌గా చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇందుకు సంబంధించి ఇప్పటికే వ్యవసాయ శాఖ కసరత్తు మొదలుపెట్టింది. ఈ జాబితాలో ఆగ్రోస్, హాకా, హార్టికల్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడ్ కార్పొరేషన్, సీడ్ సర్టిఫికేషన్, గిడ్డంగుల కార్పొరేషన్ ఉన్నట్టుగా సమాచారం. ఆయా సంస్థల లాభనష్టాలు, వాటి లావాదేవీల నిర్వహణ తదితర వాటిని పరిశీలిస్తోంది. ఒకవేళ వీటిని మూసివేస్తే వాటి పరిధిలో చేపట్టే పనులను ఏ కార్పొరేషన్లకు అప్పగించాలనే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు సమాచారం. మరోపక్క ఈ ఆ ఆరు కార్పొరేషన్లు ఒక్కోటి ఒక్కో చట్టం ప్రకారం ఏర్పడ్డాయి. దీనికి తోడు ఇప్పటికే వీటిలో కొన్నింటికి చైర్మన్లను కూడా నియమించారు. ఈ నేపథ్యంలో వీటి మూసివేత అంత సులువు కాదనే పలువురు అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడైంది. వ్యసాయ శాఖ అనుబంధ కార్పొరేషన్ల పనితీరుపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల పలు మార్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

## మున్సిపాలిటీల్లో రూ.10,200 కోట్లతో రక్షిత తాగునీటి సదుపాయం: ఎపి మంత్రి నారాయణ

**విశాఖపట్నం, ఆగస్టు 22 (ప్రభాతవార్త):** రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో ప్రజలకు అవసరమైన మోలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర పట్టణ పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. రహదారులు, రక్షిత తాగునీరు, కాలువలు, వీధి దీపాలు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధికి పెద్ద ఎత్తున చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. శనివారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవితో కలిసి మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) కింద రూ.4,200 కోట్లతో యూజీడీ పనులు చేపడుతున్నామని తెలిపారు. అలాగే అమృత్ పథకం, ఇతర పథకాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రూ.10,200 కోట్లతో తాగునీటి పైపులైన్ పనులు కొనసాగుతున్నాయని, ప్రతి ఇంటికి రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యమని చెప్పారు. మున్సిపాలిటీల్లో రహదారుల నిర్మాణం, మరమ్మతుల కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రూ.5,500 కోట్లు మంజూరు చేశారని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం యూజీడీ, తాగునీటి పైపులైన్ పనులు జరుగుతున్నందున, అవి పూర్తయిన వెంటనే రహదారుల పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఏడాదిలోగా మోలిక సదుపాయాల పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. వీఎంఆర్‌డీఏ పరిధిలోని నర్సీపట్నం, నెల్లిమర్ల, ఎలమంచిలి, విజయనగరం మున్సిపాలిటీల్లో యూజీడీ, డ్రైనేజీ పనులకు రూ.269 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఇందులో విజయనగరానికి రూ.194 కోట్లు, నర్సీపట్నానికి రూ.27 కోట్లు, ఎలమంచిలి, నెల్లిమర్లకు తలా రూ.24 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. అదనంగా రహదారుల నిర్మాణానికి మరో రూ.139 కోట్లు మంజూరు చేసే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థల ఆదాయాన్ని ఇతర అవసరాలకు మళ్లించిందని మంత్రి ఆరోపించారు. చెత్త నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా సమస్యలు ఏర్పడ్డాయని విమర్శించారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్లను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మున్సిపాలిటీల రూపురేఖలు మార్చేలా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు.

## మటర్ బర్ఫీ..

పచ్చి బఠాణీలు–పావుకిలో, పాలపొడి, జీడిపప్పు పొడి,ఎండుకొబ్బరి పొడి–కప్పు చొప్పున, పంచదార–2 కప్పులు, నెయ్యి–అరకప్పు, బాదం పలుకులు–చెంచా



**తయారీ :** పచ్చి బఠాణీలను ఉడికించి.. చల్లారాక నీళ్లు తీసేసి గ్రైండ్ చేయాలి. ఒక పాత్రలో నెయ్యి వేసి బఠాణీ గుజ్జును వేయించి పక్కన పెట్టుకోవాలి. అదే పాత్రలో పంచదార తీగ పాకం తయారుచేసి.. అందులో వేయించిన బఠాణీ పేస్టు వేసి, సన్న సెగ మీద ఉడికిస్తూ తర్వాత పాలపొడి వేయాలి. ఉండ కట్టకుండా కలియ తిప్పుతుండాలి. దగ్గరపడిన తర్వాత ఎండుకొబ్బరి పొడి, జీడిపప్పు పొడి వేయాలి. పాత్రకు అంటుకోకుండా ఉన్నప్పుడు దించేయాలి. పళ్లెంలో నెయ్యి రాసి ఈ మిశ్రమాన్ని సమంగా సర్ది, పైన బాదం పలుకులు వేయాలి. చల్లారాక ముక్కలుగా చేసుకోవడమే.

## బాదం పేడా..



బాదం పప్పు–రెండు కప్పులు, పంచదార–కప్పు, పాలపొడి, నెయ్యి– అరకప్పుచొప్పున, కుంకుమ పువ్వు–కొద్దిగా. **తయారీ :** బాదంపప్పు రెండు నిమిషాలు ఉడికించాలి. పొట్టు తీసి మిక్సీ జార్‌లో వేసి, అరకప్పు పంచదార, రెండు చెంచాల నీళ్లు, కుంకుమ పువ్వు జతచేసి గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని అడుగు భాగం మందంగా ఉన్న గిన్నె లో వేసి అరకప్పు పాల పొడి, చెంచా నెయ్యి వేసి కలియతిప్పుతూ దగ్గరపడేలా చేయాలి. చల్లారాక.. చిన్న ఉండులుగా తీసుకుని పేడాల్లా చేయాలి. వాటి మధ్యలో బాదం పప్పు అలంకరిస్తే సరి.. మధురమైన బాదం పేడా రెడీ

# రాఖీ మధురిమలు !

'అన్నా చెల్లెలు..అక్కా తమ్ముడు.. ఎంత అందమైన అనుబంధం కదూ! ఊహ తెలిసింది మొదలు ఆటపాటలతో, అల్లరి చేష్టలతో, కబుర్లా కాలక్షేపాలతో గడిచిపోతుంది. పెళ్లిళ్లయ్యి ఎవరి దారిన వారెళ్లినా. ఆ ప్రేమ అంతే తియ్యందనం పంచుతుంది. కొండంత ఆలంబన అందిస్తుంది. రాఖీ వేళ మీకిష్టమైన సోదరుల కోసం ఈ మధుర మిఠాయిలు..

## డ్రై ఫ్రూట్స్ మోదక్ ..



**కావలసినవి :** అంజీర–10, గింజలు లేని ఖర్జూరపండ్లు–20, బాదంపప్పు–కప్పు, వాల్‌నట్స్, పల్లీలు, ఎండుకొబ్బరికోరు– పావుకప్పు చొప్పున, జీడిపప్పు–15, పిస్తా–పది, నువ్వులు, గసగసాలు–చెంచా చొప్పున, నెయ్యి–తగినంత, యాలకుల పొడి–పావు చెంచా **తయారీ :** అంజీర, ఖర్జూర పండ్లను రెండు గంటలు నానబెట్టాలి. బాదంపప్పు, పిస్తా, వాల్‌నట్స్, పల్లీలు, జీడిపప్పులను కచ్చాపచ్చా దంచి కడాయిలో వేయించి పక్కన పెట్టుకోవాలి. నువ్వులు, గసగసాలు వేయించి అవి కాస్త వేగాక, ఎండు కొబ్బరికోరు వేసి వేయించాలి. నానబెట్టిన డ్రైఫ్రూట్స్‌ను గ్రైండ్ చేసి, నేతిలో వేయించాలి. అందులో తక్కినవి వేసి సన్నసెగ మీద కలియ తిప్పుతూ నాలుగు నిమిషాలు ఉంచాలి. చివర్లో యాలకుల పొడి వేసి దించేయాలి. మోదకాలు చేసే అచ్చులో (మౌల్డ్) నెయ్యి రాసి ఈ మిశ్రమం ఉంచి నొక్కి తీస్తే సరి. నోరూరించే డ్రై ఫ్రైట్స్ మోదక్‌లు సిద్ధం.

## కాజు కలశ్



జీడిపప్పు–2 కప్పులు, పంచదార–కప్పు, కుంకుమ పువ్వు–కొద్దిగా, నెయ్యి–అరకప్పు. **తయారీ :** జీడిపప్పును గ్రైండ్ చేసి పక్కన ఉంచుకోవాలి. కొన్ని నీళ్లు పోసి పంచదారను తీగ పాకం పట్టాలి. అందులో జీడిపప్పు పొడి వేసి కలియతిప్పుతూ సన్న సెగ మీద గట్టిపడేలా చేసి, చివర్లో కుంకుమ పువ్వు వేయాలి. స్టవ్వు కట్టేసి చల్లారాక మిశ్రమం మరింత మృదువుగా అయ్యేట్లు కలపాలి. చిన్న ఉండలుగా చేసి, ఒక్కో దాన్ని కలశంలా చేయాలి. పిండి ఎండినట్లయితే కొద్దిగా నెయ్యి జోడించవచ్చు. కలశం మధ్యలో బాదంపప్పు, పిస్తాలు అలంకరిస్తే రుచితో పాటు అద్వితీయమైన అందం వస్తుంది. పూజలు, వేడుకల్లాంటి సందర్భాల్లో ఈ కలశాకృతి మిఠాయి ప్రత్యేకంగా ఉం టుంది.

## కోకోనట్ బర్ఫీ



కొబ్బరికోరు–3 కప్పులు, పంచదార–2 కప్పులు, పాలు–అరకప్పు,మలై క్రీమ్–2 చెంచాలు, యాలకుల పొడి–పావు చెంచా, డ్రై ఫ్రైట్స్ పలుకులు–కొద్దిగా **తయారీ :** కొబ్బరికోరు, పాలు, పంచదారలను అడుగు భాగం మందంగా ఉన్న గిన్నెలో వేసి కలియ తిప్పుతూ సన్న సెగ మీద ఉడికించాలి. దగ్గరపడ్డాక మలై క్రీమ్ వేయాలి. పాత్రకు అతుక్కోకుండా ఉందంటే చక్కగా తయారైనట్లు. అప్పుడు యాలకుల పొడి వేసి, అర నిమిషం ఉంచి దించేయాలి. ఒక ట్రేలో నెయ్యి రాసి మిశ్రమాన్ని సమంగా పరిచినట్లు సర్దాలి. పదినిమిషాల తర్వాత నడ్రై ఫ్రూట్స్ పలుకులు పైన అద్ది నచ్చిన ఆకృతిలో ముక్కలుగా చేసుకోవాలి. కేవలం అరగంటలో తయారయ్యే కోకోనట్ బర్ఫీ అద్భుత రుచితో ఆకట్టుకుంటుంది.

## కొబ్బరి లడ్డు



కొబ్బరి తురుము–పావు కిలో, కండెన్స్‌డ్ మిల్క్, ముప్పావు కప్పు, నెయ్యి– పెద్ద చెంచా, ఇలాచీ పొడి–అర చెంచా, కాజు–గుప్పెడు. **తయారీ :** పొయ్యి మీద పాన్ పెట్టి కాస్తంత నెయ్యి వేయాలి. దీంట్లో కాజు వేసి వేయించాలి. ఇవి లేత బంగారు రంగులోకి వచ్చాక తాజా కొబ్బరి తురుము వేసి చిన్న మంటపై రెండు,మూడు నిమిషాలు వేయించాలి. దీంట్లో కండెన్స్‌డ్ మీల్క్ అందుబాటులో లేకపోతే పాలు, పంచదార రెండింటినీ కలిపి వాడుకోవచ్చు. ఈ వంటకం పూర్తి అయ్యే వరకు మంట చిన్నగానే ఉండాలి. పాలు కలిపాక కాసేపువేయించి, యాలకుల పొడి వేసి మరికాసేపు కలియబెట్టాలి. ఈ మిశ్రమాన్ని చల్లార్చి చేతులకు నెయ్యి రాసుకుని లడ్డూలను తయారు చేసుకోవాలి. ఈ కమ్మని కొబ్బరి లడ్డూను రుచి చూసేయండి మరి. □

# నీళ్లకూ ఓ లెక్కుంది !



ఒక మనిషి రోజు కెన్ని నీళ్లు తాగాలి. అసలు తాగాలా? వద్దా? తాగాల్సివస్తే ఎన్ని తాగాలి అన్న అంశంపై వివరణాత్మక వ్యాసాలకే మీ కొదువలేదు. అయినా ఎంత మంది వాటిని పాటిస్తున్నారు. అన్నది సదేహాస్పదమే. మన శరీరానికి నీటితో ఎంత పని ఉందో? దాహం వేస్తేనే వాళ్ల అవసరం ఉన్నట్లు కాదు. దాహం వేయకపోయినా శరీరానికి తగినంత నీరు అవసరమే. ఐదు సంకేతాలతో బేరీజు వేసుకుని నీటిపై శ్రద్ధ చేయండి. చేతి వెనుక భాగంలో కొద్దిగా చర్మాన్ని వేళ్లతో మెల్లగా పైకి లాగి వదలాలి. అది వెంటనే మునుపటి స్థితికి వస్తే సాధారణంగా శరీరంలో నీరు తగినంతగా ఉందని అర్థం. చర్మం కొంతసేపు పైకి లేచినట్టే ఉండిపోతే నీటి కొరతకు సంకేతం కావచ్చని నిపుణురాలు చెబుతున్నారు.పెదాలు తరచూ పొడిబారి పగిలిపోవడం, పొట్టు ఊడటం వంటివి కనిపిస్తే ద్రవాలు తీసుకోవడంపై దృష్టి పెట్టాలి. తగినంత నీరు తీసుకునే వారిలో పెదాలు సాధారణంగా మృదువుగా, తేమగా ఉంటాయని ఆమె పేర్కొన్నారు.నీటి కొరత వల్ల కొంతమందిలో తలనొప్పి వచ్చే అవకాశం ఉంటుంది. తరచూ తలనొప్పి లేదా మైగ్రేన్ రావడానికి అనేక కారణాలు ఉన్నప్పటికీ.. శరీరానికి తగినంత ద్రవాలు అందకపోవడం కూడా వాటిలో ఒకటి కావచ్చని నిపుణురాలు చెబుతున్నారు.శరీరంలో నీటి స్థాయిని అంచనా వేయడానికి సులభమైన మార్గాల్లో మూత్రం రంగును గమనించడం ఒకటి. సాధారణంగా లేత పసుపు లేదా గడ్డి రంగులో ఉంటే నీరు తగినంతగా తీసుకుంటున్నట్టుగా భావించవచ్చు. ముదురు పసుపు రంగులో ఉంటే ద్రవాల అవసరం ఉండొచ్చని సూచిస్తుంది. అయితే ఎప్పుడూ పూర్తిగా రంగులేనట్టుగా ఉండే మూత్రం మాత్రం అవసరానికి మించి నీరు తాగుతున్నారనే సంకేతం కావచ్చని నిపుణురాలు తెలిపారు.నీళ్లు తాగిన ప్రతిసారీ వెంటనే మూత్ర విసర్జనకు వెళ్లాల్సి వస్తుంటే.. రోజంతా తీసుకుంటున్న ద్రవాల పరిమాణాన్ని గమనించాలని నిపుణురాలు సూచిస్తున్నారు. నీరు తాగిన తర్వాత శరీరం కొంతసేపు దానిని నిలుపుకోగలగడం సాధారణమేనని పోషకాహార నిపుణురాలు దీపశిఖా జైన్ పేర్కొన్నారు. □

## చిట్కా

**భుక్త్వాపా విసస్థాంద్:** ఆహారాన్ని తీసుకున్న తర్వాత ఎప్పుడూ పనిలేకుండా కూర్చోవద్దు. కనీసం 100 అడుగులు అయినా నడవండి.
**క్షుత్ సాధూతం జనయతి:** ఆకలి, ఆహార రుచిని పెంచుతుంది. (ఇంకా చెప్పాలంటే, ఆకలితో ఉన్నప్పుడు మాత్రమే తినండి.)
**చింతా జరానామ్ మనుష్యానమ్:** చింతించడం అనేది వృద్ధాప్యాన్ని వేగవంతం చేస్తుంది. కనుక అనవసరపు చింతలతో ఆరోగ్యాన్ని పాడుచేసుకోకు.
**సతం విహాయ భోక్తవ్యం:** ఆహారం తీసుకొనే సమయం వచ్చినప్పుడు, ఎంతటి పనినైనా కూడా పక్కన పెట్టండి. నిదానంగా భోజనం చేయండి. వేగంగా తినడం, పని ఉందని అసలు భోజనమే మానివేయడం చాలా అనర్థదాయకం, సర్వ
**ధర్మేశు మధ్యమామ్:** ఎల్లప్పుడూ మధ్యే మార్గాన్ని ఎంచుకోండి. దేనిలోనైనా విపరీతంగా వెళ్లడం మానుకోండి. ఈ ఆరోగ్య సూత్రాలు పాటించిన వారికి చిరాయువు, నిత్య ఆరోగ్యం తప్పక లభిస్తాయి □

## ఉత్తమగతులే దానఫలం



ఎలా సంపాదిస్తేనేం .. సంపాదించడమే ముఖ్యమని కొందరు భావిస్తారు. అలా సంపాదించిన దానిలో కొంత దానం చేస్తూనే వున్నాం కదా అనుకుం టారు. అలా దానం చేయడం వలన పాపమేదైనా వుంటే కొంతవరకూ నశిస్తుందనీ, పైగా పుణ్యరాశి పెరుగుతుందని భావిస్తారు. కానీ ఇలాంటి దానాలు చేయడం వలన పుణ్యరాశి ఎంతమాత్రం పెరగదని శాస్త్రాలు చెబుతున్నాయి. దానం అంటే ఇవ్వడం అని అర్థం. భగవంతు డు మనకి ఇచ్చిన దాంట్లో ఎంతో కొంత ఇతరులకి సాయం చేయాలి. అలా చేసే దానం .. మనం ధర్మబద్ధంగా సంపాదించి నద్దై ఉండాలి. అవతలవారు ఆపదలో వున్నప్పుడు, ధర్మబద్ధమైన ధనాన్ని దానంగా ఇవ్వడం వల్లనే అది నిజమైన దానం అవుతుంది. అలాంటి దానం వల్లనే పుణ్యరాశి పెరుగుతుంది. దానగుణమంత గొప్పది ఏదీ లేదని శాస్త్రాలు చెబుతున్నాయి. ఒక బీజం నాటితే అది ఎన్నో ఫలాలను ఇచ్చినట్టుగా, దానం కూడా అనేక రెట్ల ఫలాలను ఇస్తుందని స్పష్టం చేస్తున్నాయి. భగవంతుడిని చేరుకోవడానికీ .. పరలోకంలో ఉత్తమగతులు కలగడానికి దానానికి మించిన మార్గం లేదనేది మహర్షుల మాట. కర్ణుడు ..శిబి చక్రవర్తి .. బలి చక్రవర్తి వంటి వారెందరో, దాన గుణం వల్లనే శాశ్వతమైన కీర్తిని సంపాదించుకున్నారు. □

# సెప్టెంబర్ 3న వస్తున్న 'రోమాంచకం'



బ్లాక్ బస్టర్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తున్న సినిమా 'రోమాంచకం' సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొందిస్తు న్నారు. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిపిన ఇంట్రెస్టింగ్ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ గా ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించేందుకు ఈ సినిమా సెప్టెంబర్ 3న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. డిస్ట్రిబ్యూటర్, ప్రొడ్యూసర్ సునీల్ నారంగ్ మాట్లాడుతూ 'రోమాంచకం' సక్సెస్ పై మాకు పూర్తి నమ్మకం ఉంది. ఈ సినిమా డెఫనెట్ గా హిట్ అవుతుంది. నటి కీర్తన మాట్లాడుతూ ఈ చిత్రంలో నటించే అవకాశం కల్పించిన డైరెక్టర్ వేణుగోపాల్ గారికి థ్యాంక్స్.డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఈ సినిమా కథను రెండు గంటల పాటు సందీప్, ప్రణయ్‌లకు చెప్పాను. వాళ్లిద్దరు కథ విన్న వెంటనే మనం ఈ సినిమా చేస్తున్నామని చెప్పారు. సందీప్ వంగా ఏ రోజూ మా పనిలో జోక్యం కలిగించుకోలేదు. ఇది నీ విజన్, నీ సినిమా, నీ లైఫ్ అని చెప్పి జస్ట్ డూ ఇట్ అనేవారు. ఫస్ట్ కట్ చూశాక సందీప్ వంగా ఒక బీర్ ఓపెన్ చేసి ఆస్కార్ అవార్డ్ లా నా చేతికి అందించారు. హీరోయిన్ అనంతిక సనిల్ కుమార్ మాట్లాడుతూ మా రోమాంచకం సినిమా సెప్టెంబర్ 3న రిలీజ్ అవుతోంది. ప్రొడ్యూసర్ ప్రణయ్‌రెడ్డి వంగా మాట్లాడుతూ డైరెక్టర్ వేణుగోపాల్ పదిహేను నెలల క్రితం ఈ కథ చెప్పారు. స్క్రిప్ట్ మొత్తం హిలేరియస్‌గా నెరేట్ చేశారు. అన్ని క్యారెక్టర్స్ ను తనే పర్ ఫార్మ్ చేసి చూపించారు. స్క్రిప్ట్ మమ్మల్ని ఇంప్రెస్ చేసింది.

# తెర

## 'మహావీర్ కర్ణ' డిసెంబర్ 4న విడుదల



ప్రతిష్ఠాత్మక నిర్మాణ సంస్థలు పెన్ మూవీస్, శ్రీ నీలాద్రి ప్రొడక్షన్స్.. ఆర్‌వీ స్టూడియోస్‌తో కలిసి 'మహావీర్ కర్ణ'అనే ఎపిక్ హైబ్రిడ్ లైవ్ యాక్షన్ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నాయి. భారతీయ సినిమాను సరికొత్త విజువల్ ప్రపంచంలోకి తీసుకెళ్లేలా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో రూపొందిస్తు న్నారు. ఈ చిత్రాన్ని జయంతీలాల్ గడా సమర్పిస్తున్నారు. బ్లాక్‌బస్టర్ చిత్రాల దర్శకుడు రమేష్ వర్మ ఈ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. యాక్షన్, థ్రిల్లర్, కమర్షియల్ సినిమాలతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న డైరెక్టర్ రమేష్ వర్మ.. ఇప్పుడు సరికొత్త జోనర్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. మహాభారతంలోని చిరస్మరణీయమైన కర్ణుడి కథను ఆధారంగా చేసుకుని మహావీర్ కర్ణను తెరకెక్కిస్తు న్నారు. ఈ ప్రయోగాన్ని మరింత ఆసక్తికరంగా మార్చే అంశం కర్ణుడి కథనే ఈ చిత్రానికి భావోద్వేగ కేంద్రంగా ఎంచుకోవడం. కర్ణుడి కథ కేవలం కీర్తి కోసం పోరాడిన ఓ యోధుడి కథ మాత్రమే కాదు.. అన్నింటికంటే ఎక్కువగా తన మాటకే విలువ ఇచ్చిన ఓ మహా వీరుడి కథ. కుంతీ దేవికి జన్మించినప్పటికీ రాజకుటుంబానికి దూరంగా పెరిగిన కర్ణుడు.. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటం, తన అపారమైన దానగుణంతో వీరుడైన కర్ణుడు తనలోని ఓ ప్రత్యేకమైన వ్యక్తిత్వాన్ని చాటుకున్నాడు. లేటెస్ట్‌గా"మహావీర్ కర్ణకు సంబంధించిన టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. టీజర్‌లోనే కర్ణుడి ఈ ప్రత్యేకమైన వ్యక్తిత్వాన్ని బలంగా చూపించారు. యోధులు, రాజ్యాలు, ఆయుధాలు, అద్భుతమైన విజువల్స్ వంటి భారీ అంశాలు ఆకట్టుకున్నప్పటికీ.. ప్రేక్షకుల మనసులో నిలిచేది మాత్రం తాను ఇచ్చిన మాటకు కట్టుబడి నిలబడే కర్ణుడి వ్యక్తిత్వమే.

# మెగాస్టార్ చిరంజీవి పవర్‌ఫుల్ టైటిల్ 'కాకా'



మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో మోస్ట్ అవైటెడ్ మూవీ Mega158 / ChiruBobby2, వెంకట్ కే నారాయణ కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ సినిమా ప్రకటన నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. కె. సత్యం, సూపర్‌వైజర్‌గా చిరంజీవి ఆక్వా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వడంతో గ్లింప్స్ ప్రారంభమవుతుంది. చెన్నై టీమ్‌కు ఫోన్ చేసి లోడ్ సమయానికి వస్తుందని చెబుతూ అందరినీ పలకరిస్తారు. సునీల్ లీవ్ అడగగా, తమ టార్గెట్ ఫెస్టివల్ అని చెప్పి లీవ్‌ను తిరస్కరి స్తారు. గెటప్ శ్రీను స్కూటర్ కీస్ గురించి చెప్పగా సత్యం వాటిని విసరమని చెబుతారు. ఆ తర్వాత కళ్లద్దాలు పెట్టుకున్న చిరంజీవిని చూపిస్తూ"కాకా' టైటిల్‌ను రివీల్ చేయడం ఆదరిపోయింది. "కాకా' టైటిల్ 'పవర్‌ఫుల్‌గా ఉంది. టైటిల్ గ్లింప్స్ కూడా స్ట్రైకింగ్ విజువల్స్, డిఫరెంట్ సెటప్‌తో వెంటనే ఆకట్టుకుంటుంది. చిరంజీవిని అభిమానులకు, మాస్ ఆడియన్స్‌కు బలంగా కనెక్ట్ అయ్యేలా ప్రెజెంట్ చేయడంలో బాబీ కొల్లి మరోసారి తన మార్క్ చూపించారు. చిరంజీవి తన స్క్రీన్ ప్రెజెన్స్ తో మెస్మరైజ్ చేశారు. బాబీ మెగాస్టార్‌ను రెండు విభిన్నమైన లుక్స్‌లో ప్రెజెంట్ చేశారు. మిడిల్ క్లాస్ అవతార్‌లో చిరంజీవి చాలా సహజమైన చార్మ్ తో కనిపించగా, యంగ్ వెర్షన్‌లో ఆయన యాటిట్యూడ్, ఎనర్జీ ఆకట్టుకుంటాయి. గన్ ఫైరింగ్ సీక్వెన్స్‌లో ఆయన బాడీ లాంగ్వేజ్, ఈజీగా చూపించే స్వాగ్ మంచి మాస్ మూమెంట్‌ను క్రియేట్ చేశాయి. ముఖ్యంగా చివరి షాట్ బలమైన ఇంపాక్ట్‌ను ఇస్తుంది.సినిమాటోగ్రాఫర్ విజయ్ కార్తీక్ కన్నన్ తన డైనమిక్ విజువల్ లాంగ్వేజ్‌తో గ్లింప్స్‌ను మరింత ఆసక్తికరంగా మలిచారు. ప్రారంభ సన్నివేశాల్లో కెమెరా దాదాపు చిరంజీవి పాత్రతో పాటు ప్రయాణిస్తున్నట్టుగా ఇమ్మర్సివ్ ఫీల్‌ను కలిగిస్తుంది. ఆ తర్వాత గ్లింప్స్ ముందుకు వెళ్లే కొద్దీ హై ఎనర్జీ ఫ్రేమ్స్, మాస్ ఎలివేషన్స్‌తో విజువల్స్ ఆకట్టుకున్నాయి.

# తొలివారంలో 5 కోట్ల గ్రాస్ సాధించిన' హుషార్ పిట్టలు'




కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీవిష్ణు అన్షు, వాసవి గణేషన్ జంటగా రూపొందిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'హుషార్ పిట్టలు' పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మించిన ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు విడుదల చేశాయి. మోత్‌టాక్‌తో హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌తో బ్లాక్‌బస్టర్ విజయంగా నిలిచింది. తొలివారంలో ఈ చిత్రం 5 కోట్ల 27 లక్షల గ్రాస్‌ను సాధించి విజయవంతంగా రెండోవారంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా మూవీ టీమ్ థ్యాంక్స్ మీట్‌ను ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో దర్శకుడు బిక్షు మాట్లాడుతూ చిన్న సినిమాగా వచ్చి పెద్ద సినిమాల మధ్యలో హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌తో రన్ అవుతోంది. రెండవారంలో కూడా అడుగుపెట్టినందుకు ఆనందంగా ఉంది. మెగాస్టార్ చిరంజీవి బర్త్‌డే రోజు మా సినిమా థ్యాంక్స్ మీట్ జరగడం ఎంతో సంతోషంగా ఉంది. హీరో అన్షు మాట్లాడుతూ నన్ను నమ్మి అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు. ఈ సినిమాను ప్రేక్షకులకు రీచ్ కావడానికి కారణమైన సురేష్‌బాబు, బెక్కెం వేణుగోపాల్ కు థ్యాంక్స్. అన్నారు.నిర్మాత కె.వెంకట్ యాదవ్ మాట్లాడుతూ నన్ను నమ్మి ప్రేక్షకులు థియేటర్‌కు వచ్చి సినిమా చూసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. తొలి సినిమాతోనే నిర్మాతగా మంచి గుర్తింపు వచ్చింది. పెద్ద సినిమాల మధ్యలో మా చిన్న సినిమా హుషార్ పిట్టలు విడుదలై తొలివారంలో 5 కోట్ల 27 లక్షల గ్రాస్‌ను వసూలు చేసి రెండోవారంలోకి అడుగుపెట్టడం హ్యాపీగా ఉంది.

# 'కామ్రేడ్ కళ్యాణ్' నుంచి 'సరస్వతమ్మ'గా రాధిక ఫస్ట్ లుక్




'కామ్రేడ్ కళ్యాణ్'తో అలరించబోతున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఆసక్తికరమైన పీరియడ్ బ్యాక్‌డ్రాప్‌తో పాటు రొమాన్స్, ఎమోషన్స్ తో రూపొంది స్తున్నారు. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కోన వెంకట్ సమర్పిస్తున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్ లిలిశ బ్యానర్‌పై వెంకట కృష్ణ కర్నాటి, సీత కర్నాటి నిర్మిస్తున్నారు. 1992లో ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతం నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. మహిమా నంబియార్ కథానాయికగా నటిస్తున్నారు.ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్‌తో పాటు తొలి రెండు పాటలకు మంచి స్పందన వచ్చింది. ఈ చిత్రంలో రాధికా శరత్‌కుమార్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా మేకర్స్"సరస్వతమ్మగా ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు.'జై బాలయ్య హెడ్‌బ్యాండ్ కట్టుకుని, సీరియస్ లుక్‌లో కనిపిస్తున్న రాధికా శరత్‌కుమార్ పాత్రపై ఆసక్తిని పెంచుతోంది. ఆమె బాడీ లాంగ్వేజ్ సరస్వతమ్మ పాత్రకు కథలో మంచి ప్రాధాన్యత ఉన్నట్లు కనిపిస్తోంది. ఈ చిత్రంలో షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తుండగా, సాయి శ్రీరామ్ సినిమా టోగ్రఫీ నిర్వహిస్తున్నారు. చోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. కామ్రేడ్ కళ్యాణ్ అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# 'సహా'(లైఫ్ ఆఫ్ సంజు) సెప్టెంబర్ 4న రిలీజ్



నిశాంత్ దోటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎమోషనల్ డ్రామా సహా (లైఫ్ ఆఫ్ సంజు) ప్రస్తుతం ప్రమోషన్స్‌తో సందడి చేస్తోంది. శివ కుమార్ కాసారం, శ్వేతా లక్ష్మణ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం ప్రేమ, అనుబంధాలు, జ్ఞాపకాలు, జీవితంలో ఎదురయ్యే భావోద్వేగ సంఘర్షణల చుట్టూ సాగనుంది. సుమైరా స్టూడి యోస్ బ్యానర్‌పై తేజ వెల్పుచర్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఇప్పటికే విడుదలైన పాటలు, ప్రమోషనల్ కంటెంట్‌తో ఆసక్తి పెంచుకున్న"సహా సెప్టెంబర్ 4న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో శివ కుమార్ కాసారం, శ్వేతా లక్ష్మణ్ పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్ జర్నీలో ఆత్మీయంగా కనిపించారు. ఈ విజువల్ ఇద్దరి మధ్య ప్రేమ, అనుబంధాన్ని సహజంగా చూపిస్తూ సినిమా నేపథ్యంపై ఆసక్తిని పెంచుతోంది.సంజు జీవితంలోని వివిధ దశలను ఈ సినిమా ప్రెజెంట్ చేస్తోంది. ప్రేమ, విడిపోవడం, మధురమైన జ్ఞాపకాలు, కష్టాలను అధిగమించేందుకు అవసర మైన మనోధైర్యం వంటి అంశాలను కథలో చూపించనున్నారు. పాత్రలు, వాటి మధ్య ఉండే అనుబంధాల ద్వారా ఒక మనసుకు దగ్గరయ్యే ఎమోషనల్ జర్నీగా అందించనున్నాయి. ఈ చిత్రంలో ప్రజానా పాండ్యా, మహిపాల్, అప్పాజీ, భారతి, మేఘన సునీల్, బాంబే పద్మ, కొండారెడ్డి, హార్షవర్ధన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్‌గా కరుణాకర్ కె, ఎడిటర్‌గా దినేష్ పెద్ది, సంగీత దర్శకుడిగా శేఖర్ చంద్ర పనిచేస్తున్నారు.

ఆట

## బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్..

# ట్రీసా-గాయత్రికి రెండో డబుల్స్ పతకం



**న్యూఢిల్లీ:** భారత మహిళల డబుల్స్ స్టార్లు ట్రీసా జాలీ, గాయత్రి గోపీచంద్‌ల అద్భుత ప్రస్థానం శనివారం బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ సెమీఫైనల్స్‌లో ముగిసింది. ప్రపంచ నంబర్ 1 ఆటగాళ్లైన చైనాకు చెందిన లియు షెంగ్ షు-టాన్ నింగ్‌లతో జరిగిన పోరులో ఈ జంట మూడు గేమ్‌లలో 21-18, 13-21, 8-21 తేడాతో పోరాడి ఓడిపోయి, చారిత్రాత్మక కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ట్రీసా-గాయత్రి చైనా ద్వయాన్ని ఇబ్బంది పెట్టారు. ముఖ్యంగా ట్రీసా నెట్ వద్ద అద్భుతంగా రాణించడంతో, తొలి గేమ్‌లో 7-2 ఆధిక్యాన్ని సాధించారు. అయితే చైనా జోడి ఎదురుదాడి చేసి ఒత్తిడి పెంచుతూ తిరిగి ఆధిక్యాన్ని చేజిక్కించుకుంది. భారత బ్యాక్‌కోర్ట్‌లో పదేపదే ఖాళీలను కనుగొంటూ, వారు వరుసగా 10 పాయింట్లు సాధించి 12-7తో తొలిసారి ఆధిక్యంలోకి వచ్చారు. హోరాహోరీగా సాగిన ఈ పోటీ, చివరి దశకు చేరుకునే సమయానికి చైనా 18-16 స్వల్ప ఆధిక్యంలో ఉంది. అయితే, భారత్ జంట జోరు పెంచి, తర్వాతి 5 పాయింట్లు గెలుచుకుని తొలి గేమ్‌ను కైవసం చేసుకున్నారు. రెండవ గేమ్‌లో భారత్ ద్వయం కొన్ని అనవసర తప్పిదాలతో చైనా ఆరంభంలోనే ఆధిక్యం సాధించింది. ట్రీసా-గాయత్రి కోలుకుని 11-10తో స్వల్ప ఆధిక్యంలోకి వచ్చారు. అయితే, విరామం తర్వాత ఆట గమనం ఒక్కసారిగా మారిపోయింది. ట్రీసా-గాయత్రి అనవసర తప్పిదాలు చోటుచేసుకోవడంతో, వారు తర్వాతి 13 పాయింట్లలో కేవలం రెండింటిని మాత్రమే గెలుచుకోగలిగారు. దీంతో చైనా జట్టు మ్యాచ్‌ను సమం చేసి, నిర్ణయాత్మక గేమ్‌కు దారితీసింది. మూడవ గేమ్‌లో, భారత జోడీ ఇబ్బంది పడింది. చైనా బౌలింగ్ దాడితో వారు క్రమంగా తడబడటంతో, వారి ఆటలో వరుసగా బలహీనమైన షాట్లు చోటుచేసుకున్నాయి. లియు-టాన్ ఆటపై పట్టు సాధించి, చివరికి మ్యాచ్‌ను ముగించారు.

# నేడే శ్రీలంకతో కీలక రెండో టెస్ట్







**కొలంబో:** శ్రీలంకపై టెస్ట్ సిరీస్ క్లీన్ స్వీప్ చేసేందుకు టీమిండియా రెడీ అవుతోంది. తొలి టెస్టులో 165 పరుగుల భారీ తేడాతో గెలిచిన భారత్, ఇప్పటికే సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉంది. కొలంబోలోని ఎస్ఎస్‌సీ స్టేడియం వేదికగా ఈ నెల 23 నుంచి రెండో టెస్ట్ ప్రారంభంకానుంది. ఈ మ్యాచ్‌లోనూ విజయం సాధించి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ అవకాశాలు మరింత మెరుగుపరుచుకోవాలని గిల్ సేన చూస్తోంది. మరోవైపు సిరీస్ సమం చేయాలంటే ఆతిథ్య శ్రీలంక తప్పక గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండో టెస్టులో భారత బౌలింగ్ విభాగంలో ఒక మార్పు చోటుచేసుకోనుంది. తొలి మ్యాచ్‌లో రవీంద్ర జడేజా, మానవ్ సుతార్ స్పిన్ మాయాజాలంతో లంకను దెబ్బకొట్టగా, కుల్దీప్ యాదవ్ మాత్రం లయ అందుకోలేకపోయాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి కేవలం ఒకే వికెట్ తీశాడు. కుల్దీప్‌ను గిల్ కేవలం మూడో స్పిన్నర్‌గా చూస్తున్నట్లు అర్థమవుతోంది. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కుల్దీప్‌కు సపోర్ట్‌గా ఉన్నా ఇప్పటికే సిరీస్‌లో ఆధిక్యం ఉండటంతో అతనికి విశ్రాంతినిచ్చి ఆల్‌రౌండర్ సారాంశ్ జైన్‌ను తుది జట్టులోకి తీసుకోనేందుకు సిద్ధమవుతోంది. జైన్ జట్టులోకి వస్తే బ్యాటింగ్ ఆర్డర్ మరింత బలోపేతం అవుతుంది. మరోవైపు శ్రీలంక జట్టును గాయాల సమస్య వేధిస్తోంది. సీనియర్ ఆటగాళ్లు కుశాల్ మెండిస్, దినేష్ చండిమాల్ గాయాల కారణంగా ఈ టెస్టుకు అందుబాటులో లేకపోవడం ఆ జట్టుకు పెద్ద ఎదురుదెబ్బగా మారింది. వారి స్థానంలో యువ ఆటగాళ్లను రంగంలోకి దించాల్సి వస్తోంది. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ 53.33 పాయింట్ల శాతంతో ఐదో స్థానంలో ఉండగా, శ్రీలంక 33.33 శాతంతో ఆరో స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో ఇరు జట్లకు ఈ మ్యాచ్ అత్యంత కీలకంగా మారింది. భారత్ తుది జట్టు అంచనాకు వస్తే కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్, దేవదత్ పడిక్కల్, శుభ్‌మన్ గిల్, రిషబ్ పంత్, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, మానవ్ సుతార్, కుల్దీప్ యాదవ్/సారాంశ్ జైన్, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ. అలాగే శ్రీలంక జట్టులో లహిరు ఉదార, కమిల్ మిశార, పసిందు సూర్యబండార, కమిందు మెండిస్, ధనంజయ డిసిల్వా, నిరోషన్ డిక్వెల్లా, సోనాల్ దినూష, కేశర నువాంత, ప్రభాత్ జయసూర్య, అసిథ ఫెర్నాండో, లహిరు కుమార ఉన్నారు.


## డబ్ల్యూటీసి ఫైనల్స్ నుంచి 4 జట్లు ఔట్

# టీమిండియాకు కఠిన పరీక్షే

**న్యూఢిల్లీ:** ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో సైకిల్ తుది దశకు చేరుకుంటున్న వేళ పాయింట్ల పట్టిక సమీకరణాలు ఉత్కంఠ రేపుతున్నాయి. డబ్ల్యూటీసీ ఫైనల్ 2027 పోరు కోసం ప్రధాన జట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇప్పటికే కొన్ని జట్లు రేసు నుంచి పూర్తిగా తప్పుకోగా, అగ్రస్థానం కోసం కీలక జట్ల మధ్య అసలైన సమరం మొదలైంది. మొత్తం తొమ్మిది జట్లలో వెస్టిండీస్ అధికారికంగా నిష్క్రమించగా, ఇంగ్లండ్, పాకిస్తాన్, శ్రీలంకలకు దారులు మూసుకుపోయినట్లే కనిపిస్తున్నాయి. సాధారణంగా ఫైనల్ చేరాలంటే కనీసం 65 శాతం పాయింట్ల శాతం (పిసిటి) సాధించడం తప్పనిసరి. ప్రస్తుతం పాయింట్ల




పట్టికలో అగ్రస్థానంలో ఆస్ట్రేలియా (77.78), రెండో స్థానంలో దక్షిణాఫ్రికా (75.00), మూడో స్థానంలో న్యూజిలాండ్ (72.22) ఉన్నాయి. మరో 13 టెస్టులు ఆడాల్సిన ఆసీస్‌తో పాటు, చేతిలో పది టెస్టుల చొప్పున ఉన్న సఫారీలు, కివీస్ జట్లు ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకునేందుకు గట్టి పోటీనిస్తున్నాయి. ఈ లీగ్ దశలో వెస్టిండీస్ ప్రయాణం దాదాపు ముగిసింది. ఆడిన 12 టెస్టుల్లో కేవలం రెండింటిలో మాత్రమే గెలిచి 20.83 శాతంతో 9వ స్థానానికి పడిపోయిన కరేబియన్ జట్టుకు మిగిలిన 2 మ్యాచ్‌ల్లో గెలిచినా ముందంజ వేసే అవకాశం లేదు. మరోవైపు పాకిస్తాన్, ఇంగ్లండ్, శ్రీలంక జట్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎనిమిదో స్థానంలో ఉన్న పాకిస్తాన్ పాయింట్ల ఖాతాలో 22.22 శాతం మాత్రమే ఉంది. ఆ జట్టు ఫైనల్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే మిగిలిన 7 టెస్టుల్లో దాదాపు అన్నింట్లోనూ విజయం సాధించాల్సిందే. 13 మ్యాచ్‌లాడి 24.36 శాతంతో ఉన్న ఇంగ్లండ్‌కు మిగిలిన 8 టెస్టులు గెలిచినా అగ్రస్థానాలకు చేరుకోవడం కష్టమే. భారత్‌తో స్వదేశంలో టెస్టు సిరీస్ ఆడుతున్న శ్రీలంక 33.33 శాతంతో నిలిచి, మిగిలిన 7 టెస్టులను తప్పక గెలవాల్సిన ఒత్తిడిలో పడింది. ఇక అనూహ్యంగా పుంజుకున్న బంగ్లాదేశ్ ప్రత్యర్థి ఆస్ట్రేలియాపై చారిత్రక విజయం సాధించి 66.67 శాతంతో నాలుగో స్థానానికి చేరుకుంది. చేతిలో మరో ఏడు టెస్టులు ఉండటం వారికి కలిసొచ్చే అంశం. ఇక టీమిండియాకు కఠిన పరీక్షే. ఇప్పటివరకు ఆడిన 10 టెస్టుల్లో 5 విజయాలు సాధించి 53.33 శాతంతో ఐదో స్థానంలో కొనసాగుతోంది. మొత్తం 18 టెస్టుల షెడ్యూల్‌లో మిగిలిన ఎనిమిది మ్యాచ్‌ల్లో నిలకడగా రాణిస్తేనే భారత జట్టు వరుసగా మరోసారి ఫైనల్ చేరే అవకాశాలు సజీవంగా ఉంటాయి.



## వరల్డ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్..

# భారత్ ఖాతాలో మూడు పతకాలు

### మాన్సీ రజతం, తన్వి, కోమల్ కాంస్యం

**స్లోవేకియా:** అండర్ 20, ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ రెజ్లర్లు మాన్సీ లాథర్ రజతం గెలుచుకోగా, తన్వి గుండేష్ మగ్దుమ్, కోమల్ కాంస్యం కైవసం చేసుకున్నారు. స్లోవేకియాలో శనివారం జరిగిన ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళల రెజ్లింగ్ బృందం తమ ఖాతాలో ఒకే రోజు మరో మూడు పతకాలను చేర్చుకుంది. చైనాకు చెందిన చెన్లింగ్ సాంగ్‌తో హోరాహోరీగా జరిగిన ఫైనల్‌లో ఓడిపోవడంతో, 68 కేజీల విభాగంలో మాన్సీ స్వర్ణ పతకాన్ని తృటిలో కోల్పోయింది. ఈ రక్షణాత్మక పోరులో 1-2 తేడాతో ఓడిపోయిన ఈ భారత రెజ్లర్ రజత పతకంతో సరిపెట్టుకుంది. ఇక ప్లేఆఫ్‌లలో విజయాల ద్వారా భారత్ రెండు కాంస్య పతకాలను జోడించింది. 57 కేజీల విభాగంలో తన్వి గుండేష్ మగ్దుమ్, కెనడాకు చెందిన ఆగ్నియా క్రాకోవ్స్కను 10-4 తేడాతో ఓడించి కాంస్యం కైవసం చేసుకుంది. ఆ తర్వాత 59 కేజీల విభాగంలో కోమల్, హంగేరికి చెందిన ఎడా బాలాజ్‌పై 5-2 తేడాతో విజయం సాధించి కాంస్య పతకాన్ని గెలుచుకుంది.








# రెండో టెస్ట్‌లో 64 రన్స్‌కే కుప్పకూలిన బంగ్లా

### 101 రన్స్ ఆధిక్యంలో ఆస్ట్రేలియా

**క్వీన్స్‌లాండ్:** ఆస్ట్రేలియాతో రెండు టెస్టుల సిరీస్‌లో సంచలన విజయంతో తొలి టెస్ట్‌లో శుభారంభం చేసిన బంగ్లాదేశ్ రెండో టెస్ట్‌లో ఆ జోరును కొనసాగించలేకపోయింది. తొలి టెస్ట్ పరాజయంతో పూర్తిగా పేస్‌కు అనుకూలంగా ఉండే పిచ్‌ను ఆస్ట్రేలియా సిద్ధం చేయడంతోనే బంగ్లా బ్యాటర్లు తేలిపోయారనే వాదన తెరముందుకొచ్చింది. 41.5 ఓవర్లలోనే 13 బాంగ్లా వికెట్లు పడ్డాయంటేనే పిచ్ ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మెకాయ్ వేదికగా శనివారం ప్రారంభమైన రెండో టెస్ట్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 34 ఓవర్లలో 64 పరుగులకే కుప్పకూలింది. ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ (6/12) ఆరు వికెట్లతో బంగ్లాదేశ్ పతనాన్ని శాసించాడు. ప్యాట్ కమిన్స్ (3/25) మూడు వికెట్లు తీయగా, జోష్ హేజిల్ వుడ్ ఒక వికెట్ పడగొట్టాడు. తొలి టెస్ట్ సెంచరీ హీరో తాంజిద్ హసన్(0), షాద్‌మన్ ఇస్లాం(0) డకౌట్‌గా వెనుదిరిగారు. మెహిదీ హసన్ మీరాజ్(11), హసన్ మహ్మూద్(10), తైజుల్ ఇస్లామ్(11 నాటౌట్) టాప్ స్కోరర్లుగా నిలిచారు. బంగ్లాదేశ్ ఇన్నింగ్స్‌లో మొత్తం నలుగురు బ్యాటర్లు డకౌటయ్యారు. షోరిఫుల్ ఇస్లామ్(14), తైజుల్ ఇస్లామ్ ఆఖరి వికెట్‌కు 25 పరుగులు జోడించి జట్టుస్కోర్‌ను 64కు చేర్చారు. లేదంటే ఆ జట్టు చెత్త రికార్డ్‌ను మూటగట్టుకునేది. అనంతరం ఆస్ట్రేలియా బ్యాటింగ్‌లో తొలి రోజు ఆట ముగిసే సరికి 8 వికెటున కోల్పోయి 165 పరుగులు చేసింది. 41 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. మ్యాట్ రేన్ షా(8), మార్నల్ లబుషేన్(4), అలెక్సీ క్యారీ (5), వెబ్‌స్టర్ (0), పాట్ కమిన్స్ (0), మిచెల్ స్టార్క్ (1) తీవ్ర నిరాశపర్చారు. అయితే కామెరూన్ గ్రీన్ (51 నాటౌట్) అర్థ సెంచరీ చేయగా, స్టీవ్ స్మిత్ (42) ట్రావిస్ హెడ్(22) రాణింగా, నాదన్‌లేన్ (10 నాటౌట్)తో క్రీజులో ఉన్నాడు. దీంతో తొలి రోజు ఆట ముగిసే సరికి ఆస్ట్రేలియా 8 వికెట్లు కోల్పోయి 165 పరుగులు చేసి బంగ్లాదేశ్ కంటే 101 పరుగుల ఆధిక్యంలో ఉంది.

# రూ.3828 కోట్లకు టిక్‌టాక్ అమెరికాతో ఒప్పందం..!




**వాషింగ్టన్, ఆగస్టు 22:** చైనా సోషల్ మీడియా యాప్ టిక్‌టాక్, దాని మాతృసంస్థ బైట్‌డ్యాన్స్ అమెరికాలో ఓ కీలక వివాదానికి ముగింపు పలికేందుకు సిద్ధమయ్యాయి. పిల్లల ఆన్‌లైన్ ప్రైవసీ ప్రొటెక్షన్ యాక్ట్ (సీఓపీపీఏ)ను ఉల్లంఘించి, వారి డేటాను అక్రమంగా సేకరించాయన్న ఆరోపణలపై యూఎస్ న్యాయ శాఖ దాఖలు చేసిన దావాను పరిష్కరించుకునేందుకు 400 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ. 3,828 కోట్లు చెల్లించడానికి అంగీకరించాయి. ఈ ఒప్పందం ప్రకారం టిక్‌టాక్ ముందుగా 300 మిలియన్ డాలర్లు చెల్లిస్తుంది. గతంలో టిక్‌టాక్ యాప్ అయిన మ్యూజికల్లీకి సంబంధించిన కోర్టు ఉత్తర్వులను రద్దు చేసిన తర్వాత అదనంగా మరో 100 మిలియన్ డాలర్లు చెల్లించనుంది. ఈ ఒప్పందానికి కోర్టు ఆమోదం లభించాల్సి ఉంది. పిల్లల గోప్యతకు సంబంధించిన కేసుల్లో ఇది అతిపెద్ద సెటిల్‌మెంట్లలో ఒకటని యూఎస్ న్యాయ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సెటిల్‌మెంట్ అమెరికన్ పిల్లలకు, వారి తల్లిదండ్రులకు లభించిన గొప్ప విజయం. ఆన్‌లైన్‌లో పిల్లలకు రక్షణ కల్పించడం, వారి వ్యక్తిగత సమాచారాన్ని తీసుకునే కంపెనీలు చట్టపరమైన బాధ్యతలను నెరవేర్చేలా చూడటమే మా ప్రాధాన్యతని అసోసియేట్ అటార్నీ జనరల్ స్టాన్లీ వుడ్‌వార్డ్ తెలిపారు. ఫెడరల్ ట్రేడ్ కమిషన్ (ఎఫ్‌టీసీ) తరఫున యూఎస్ న్యాయ శాఖ 2024లో టిక్‌టాక్‌పై దావా వేసింది. 13 ఏళ్లలోపు వయసున్న లక్షలాది మంది పిల్లలను తల్లిదండ్రుల అనుమతి లేకుండా ఖాతాలు తెరిచేందుకు అనుమతించిందని ఆరోపించింది. దీనివల్ల ఆ ఖాతాలను తొలగించమని అభ్యర్థించడం తల్లిదండ్రులకు కష్టతరంగా మారిందని న్యాయ శాఖ వాదించింది. గత కొన్నేళ్లుగా జాతీయ భద్రతా కారణాలతో టిక్‌టాక్ అమెరికాలో తీవ్రమైన నియంత్రణ సవాళ్లను ఎదుర్కొంది. అమెరికన్ వినియోగదారుల డేటాను చైనా ప్రభుత్వం దుర్వినియోగం చేయవచ్చని, చైనా కమ్యూనిస్ట్ పార్టీ ప్రచారానికి యాప్‌ను వాడుకోవచ్చని ఆందోళనలు వ్యక్తమయ్యాయి.

# వారానికి రూ.3.9 కోట్ల రాబడి నష్టం!

### రతన్‌టాటా ట్రస్ట్, ట్రస్టీల వివాదంపై మరో ఫిర్యాదు

**ముంబయి, ఆగస్టు 22:** టాటా సన్స్ వార్షిక సాధారణ సమావేశం కోరం లేక వాయిదా పడిన నేపథ్యంలో సర్ రతన్ టాటా ట్రస్ట్ ట్రస్టీలు తమ చట్టబద్ధ, విశ్వసనీయ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తున్నారా అనే అంశంపై మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్‌కు ముంబైకి చెందిన అడ్వకేట్, సొలిసిటర్ కిరణ్ డోయిఫోడ్ ఫిర్యాదును అందచేసారు. ఫిర్యాదు ప్రకారం, టాటా సన్స్ బోర్డు సుమారు రూ.4,479 కోట్ల డివిడెండ్‌ను సిఫారసు చేసింది. ఇందులో దాదాపు రూ.2,900 కోట్లు టాటా ట్రస్టులకేచెందుతాయి. టాటా సన్స్‌లో టాటా ట్రస్టులకు కలిపి దాదాపు 66 శాతం వాటా ఉంది. రూ.2,900 కోట్ల మొత్తానికి ఏడాదికి 7 శాతం పెట్టుబడి రాబడి లభిస్తుందని అంచనా వేస్తే, ఒక్క రోజుకు సుమారు రూ.55.6 లక్షలు, వారానికి దాదాపు రూ.3.9 కోట్ల పెట్టుబడి ఆదాయం కోల్పోయే అవకాశం ఉందని డోయిఫోడ్ పేర్కొన్నారు.60 రోజుల జాప్యం జరిగితే సుమారు రూ.33.4 కోట్ల అవకాశ వ్యయం ఏర్పడవచ్చని ఫిర్యాదులో వివరించారు. ఈ నిధులు సాధారణంగా దాతృత్వ కార్యక్రమాలకు ఉపయోగించాల్సినవని తెలిపారు.ఈ నిధులను వ్యక్తిగత ట్రస్టీలకు చెందిన ప్రైవేటు వాణిజ్య ఆస్తిగా పరిగణించరాదని, అవి ప్రజా ప్రయోజనాల కోసం నిర్వహిస్తున్న చారిటబుల్ సంస్థల వనరులని ఫిర్యాదు స్పష్టం చేసింది. ట్రస్టీలు ఆ నిధులకు సంరక్షకులుగా వ్యవహరించాల్సి ఉంటుందని, వ్యక్తిగత అభిప్రాయ భేదాలు లేదా అంతర్గత విభేదాల కారణంగా లబ్ధిదారులకు ఆర్థిక నష్టం కలగకుండా చూడాల్సిన బాధ్యత వారిపై ఉందని పేర్కొంది. అలాగే సర్‌రతన్‌టాటా ట్రస్టీల మధ్య ఉన్న విభేదాలు, వ్యక్తిగత ప్రయోజనాలు లేదా ప్రయోజనాల సంఘర్షణలు ట్రస్ట్ సమావేశాలు కొనసాగకపోవడానికి కారణమయ్యాయా అనే అంశాన్ని కూడా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.ప్రజా ధార్మిక ట్రస్ట్ ట్రస్టీలు సంస్థ, లబ్ధిదారుల ప్రయోజనాలను చురుకుగా, బాధ్యతాయుతంగా పరిరక్షించాల్సిన బాధ్యత కలిగి ఉంటారని డోయిఫోడ్ పేర్కొన్నారు.





వాణిజ్యం

# టెస్లా సహా భద్రతా లోపాలతో 40 లక్షల కార్ల రీకాల్

**బీజింగ్,ఆగస్టు 22:** భద్రతా లోపాల కారణంగా టెస్లా సహా పలు చైనా కార్ల తయారీ సంస్థలు భారీ సంఖ్యలో వాహనాలను వెనక్కి పిలుస్తున్నాయి. ప్రధానంగా కార్ల డోర్ హ్యాండిల్స్‌కు సంబంధించిన సమస్యలే ఇందుకు కారణం. మొత్తంగా 40 లక్షలకు పైగా వాహనాలపై రీకాల్ ప్రభావం పడుతోంది. చైనా స్టేట్ అడ్మినిస్ట్రేషన్ ఫర్ మార్కెట్ రెగ్యులేషన్ ప్రకారం టెస్లా చైనాలో తయారు చేసినవి, దిగుమతి చేసుకున్నవి కలిపి సుమారు 29.8 లక్షల ఎలక్ట్రిక్ వాహనాలను రీకాల్ చేస్తోంది. ఇందులో మోడల్ 3, మోడల్ వై, మోడల్ ఎక్స్, మోడల్‌ఎస్ ఉన్నాయి. తీవ్రమైన ప్రమాదం జరిగి విద్యుత్ వ్యవస్థ పనిచేయకపోతే డోర్‌హ్యాండిల్స్ సరిగా స్పందించకపోవచ్చని చైనా నియంత్రణ సంస్థ తెలిపింది. దీంతో కారులో ఉన్నవారు త్వరగా బయటకు రావడం కష్టమవుతుందని పేర్కొంది. వచ్చే ఏడాది నుంచి కొత్త వాహనాల్లో ఇలాంటి హ్యాండిల్స్‌ను నిషేధించనున్నట్లు ఫిబ్రవరిలో ప్రకటించింది. టెస్లాతో పాటు షియోమీ 3.9 లక్షలకు పైగా వాహనాలను వెనక్కి పిలుస్తోంది. లీప్‌మోటార్ 3.7 లక్షలకు పైగా కార్లను రీకాల్ చేస్తోంది. గీలీ, ఎక్స్‌పెంగ్ సహా మరికొన్ని చైనా సంస్థలు కూడా వాహనాలను వెనక్కి పిలుస్తున్నాయి. రీకాల్ అనేది ఎలక్ట్రిక్ వాహన పరిశ్రమ ఎదుగుదలలో సహజమైన దశ అని చైనా ప్యాసింజర్ కార్ అసోసియేషన్ అధిపతి కుయ్ డోంగ్‌షు పేర్కొన్నారు. డిజైన్ కంటే భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.



# ఆర్బీఐ ఫారెక్స్ స్వాప్‌తో 72.85 బిలియన్ డాలర్లు రాక

**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రవేశపెట్టిన ప్రత్యేక డాలర్‌రూపాయి ఫారెక్స్ స్వాప్ సదుపాయం వల్ల ఈనెల 21వ తేదీనాటికి మొత్తం 72.85 బిలియన్ డాలర్ల విదేశీ కరెన్సీ నిధులు వచ్చినట్లు తేలింది. శనివారం ఆర్‌బీఐ విడుదల చేసిన గణాంకాల్లో ఈ విషయం వెల్లడైంది.ఈ సదుపాయాన్ని ఆర్‌బీఐ గత జూన్8వ తేదీ ప్రారంభించింది. దేశంలోకి విదేశీ కరెన్సీ నిధుల రాకను పెంచేందుకు మూడు మార్గాలను ఇందులో చేర్చింది. అవి ఫారిన్ కరెన్సీ నాన్ రెసిడెంట్ (బ్యాంక్) లేదా ఎఫ్‌సిఎన్‌ఆర్ డిపాజిట్లు, ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్ ఈసీబీస్, ఓవర్సీస్ ఫారిన్ కరెన్సీ బారోయింగ్స్‌వోఎఫ్‌సిబీ,ఎఫ్‌సీఎన్‌ఆర్(బీ) డిపాజిట్లదే సింహభాగం. మొత్తం విదేశీ కరెన్సీ ప్రవాహాల్లో ఎప్‌సిఎన్‌ఆర్‌బి డిపాజిట్లు 65.40 బిలియన్ డాలర్లతో సింహభాగాన్ని ఆక్రమించాయి. మొత్తం ప్రవాహాల్లో ఇవి దాదాపు 90 శాతంగా ఉన్నాయి.ఇక వోఎఫ్‌సిబి ద్వారా 4.86 బిలియన్ డాలర్లు, ఈసీబిలద్వారా 2.59 బిలియన్ డాలర్లు విదేశీ కరెన్సీ దేశంలోకి వచ్చినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. ఎఫ్‌సీఎన్‌ఆర్ విండోకు ఆగస్టు 31తో ముగింపు ఎఫ్‌సిఎన్‌ఆర్-బి డిపాజిట్ల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక విండో ఆగస్టు 31, 2026తో ముగియనుంది. అయితే ఈసీబీలు,ఓఎఫ్‌సిబిలకు సంబంధించిన సదుపాయం ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు కొనసాగనుంది.

# 80వేల డాలర్లకు చేరువగా బిట్‌కాయిన్



**న్యూయార్కు, ఆగస్టు 22:** క్రిప్టో కరెన్సీ బిట్‌కాయిన్ భారీగా పుంజుకుంది. శనివారం ఉదయం 9.10 గంటలకు 78,588 డాలర్ల వద్ద ట్రేడైంది. గత 24 గంటల్లో గరిష్ఠంగా 4.8 శాతం పెరిగింది. గత వారం రోజుల్లో 24.5 శాతం లాభపడింది. 2023 మార్చి తర్వాత ఇదే అత్యంత బలమైన వారపు ర్యాలీగా నిలిచింది. అమెరికా ట్రెజరీ దీర్ఘకాలిక బాండ్ల బైబ్యాక్‌లను రెట్టింపు చేయనున్నట్లు ప్రకటించడం బిట్‌కాయిన్ జోరుకు ప్రధాన కారణాల్లో ఒకటిగా మార్కెట్ నిపుణుల అంచనా. ఈ ప్రకటనతో దీర్ఘకాలిక బాండ్ రాబడులు తగ్గాయి. మార్కెట్లలో రిస్క్ తీసుకునే ఆసక్తి పెరిగింది. బిట్‌కాయిన్ ధర పెరగడంతో పతనాన్ని అంచనా వేసి తీసుకున్న భారీ షార్ట్ పొజిషన్లు లిక్విడేట్ అయ్యాయి. దీంతో క్రిప్టో ధర మరింత వేగంగా పెరిగింది. మరోవైపు బంగారం ధర కూడా మే తర్వాత గరిష్ఠ స్థాయికి చేరింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ క్రిప్టో సంస్థల ప్రతినిధులతో సమావేశం కావడం కూడా మార్కెట్‌కు సానుకూల సంకేతంగా మారింది. అమెరికాలో నమోదైన స్పాట్ బిట్‌కాయిన్ ఈటీఎఫ్‌ల్లోకి సంస్థాగత పెట్టుబడులు మళ్లీ పెరిగాయి. 13 ఈటీఎఫ్‌ల్లోకి ఈ వారం ఇప్పటివరకు బిలియన్ డాలర్లకు పైగా నిధులు వచ్చాయి. 2025 అక్టోబర్‌లో బిట్‌కాయిన్ దాదాపు 1.26 లక్షల డాలర్ల గరిష్ఠాన్ని తాకింది. ఆ తర్వాత భారీ పతనం నమోదైంది. 2026 జూన్ చివర్లో 58,642 డాలర్లకు పడిపోయింది. ప్రస్తుతం 80 వేల డాలర్లకు చేరువగా దూసుకెళుతోంది.




# రిటైల్ క్రెడిట్‌లో పసిడి రుణాలే టాప్!

**ముంబయి, ఆగస్టు 22:** భారత్‌లో గోల్డ్ లోన్లు అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న రిటైల్ రుణ విభాగంగా మారుతున్నాయని ప్రముఖ బ్రోకరేజ్ సంస్థ జేపీ మోర్గాన్ పేర్కొంది. రానున్న ఐదేళ్లలో మొత్తం వ్యవస్థాగత రుణాల్లో గోల్డ్ లోన్ల వాటా ప్రస్తుత 5 శాతం నుంచి సుమారు 10 శాతానికి చేరుకునే అవకాశం ఉందని అంచనా వేసింది. 2024లో ఈ వాటా కేవలం 2 శాతంగా ఉండేది. బంగారం ఇక కేవలం కుటుంబ వారసత్వ ఆభరణంగా కాకుండా అవసరమైనప్పుడు నగదుగా మార్చుకోగల ఆస్తిగా మారుతున్న నేపథ్యంలో గోల్డ్ లోన్లకు దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలు ఉన్నాయని జేపీ మోర్గాన్ తన నివేదిక ఇచ్చింది.తక్కువ వడ్డీతో రుణాలుగోల్డ్ లోన్లు భద్రత కలిగిన రిటైల్ రుణాలుగా ఉండటంతో పాటు బలమైన వృద్ధిని నమోదు చేస్తున్నాయని జేపీ మోర్గాన్ తెలిపింది. ఈ విభాగం తదుపరి దశలో చక్రీయ పరిణామాలపై కాకుండా నిర్మాణాత్మక వృద్ధిపై ఆధారపడుతుందని పేర్కొంది. వ్యక్తిగత రుణాలు వంటి అరక్షిత రుణాలతో పోలిస్తే గోల్డ్ లోన్లపై వడ్డీ రేట్లు 3-6 శాతం పాయింట్లు తక్కువగా ఉండటం రుణగ్రహీతలకు ప్రయోజనం కలిగిస్తోందని తెలిపింది. అదే సమయంలో రుణదాతలకు తక్కువ రిస్క్‌తో కూడిన సెక్యూర్డ్ లోన్ బుక్‌ను పెంచుకునే అవకాశం లభిస్తోందని వివరించింది. దేశంలోని దిగువ 60 శాతం ఆదాయ వర్గాల కుటుంబాల వద్ద ఉన్న బంగారంలో ప్రస్తుతం కేవలం 11 శాతం మాత్రమే రుణాల కోసం తాకట్టు పెట్టినట్లు జేపీ మోర్గాన్ అంచనా వేసింది. ఇందులో ఎన్‌బీఎఫ్‌సీల ద్వారా తాకట్టు పెట్టిన బంగారం వాటా కేవలం 3 శాతం మాత్రమేనని తెలిపింది. దక్షిణ భారతదేశంలో దేశంలోని కుటుంబాల వద్ద ఉన్న బంగారంలో దాదాపు 40 శాతం ఉన్నప్పటికీ, ఈ ప్రాంతంలో గోల్డ్ లోన్ మార్కెట్ సంతృప్త స్థాయికి చేరిందన్న అభిప్రాయాన్ని జేపీ మోర్గాన్ తోసిపుచ్చింది. ఇతర ప్రాంతాలతో పోలిస్తే దక్షిణ భారతదేశంలోనూ గోల్డ్ లోన్ వినియోగం దాదాపు సమానంగానే ఉందని, అందువల్ల ఇంకా విస్తరణకు విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొంది.పర్సనల్, చిన్న వ్యాపార రుణాలకు ప్రత్యామ్నాయంకుటుంబాలు, చిన్న వ్యాపారాలు వ్యక్తిగత రుణాలు, బిజినెస్ రుణాలకు బదులుగా గోల్డ్ లోన్లను ఎంచుకోవడం పెరుగుతోందని జేపీ మోర్గాన్ తెలిపింది.రిటైల్ క్రెడిట్ డిస్బర్స్‌మెంట్లలో గోల్డ్ లోన్ల వాటా 2023లో 18 శాతం నుంచి 2026లో 41 శాతానికి పెరిగింది. ఇదే సమయంలో అరక్షిత వ్యక్తిగత, చిన్న వ్యాపార రుణాల వాటా 55 శాతం నుంచి 41 శాతానికి తగ్గింది.తక్కువ వడ్డీ రేట్లు, పెరుగుతున్న ఆర్థిక అవగాహన ఈ మార్పుకు ప్రధాన కారణాలని బ్రోకరేజ్ తెలిపింది. విద్య, వైద్య అత్యవసరాలు, ప్రయాణాలు వంటి స్వల్పకాలిక అవసరాలకు కుటుంబాలు తమ వద్ద ఖాళీగా ఉన్న బంగారు ఆభరణాలను నగదుగా మార్చుకోవడానికి సిద్ధమవుతున్నాయని పేర్కొంది. చిన్న వ్యాపారాలు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు కూడా గోల్డ్ లోన్లను వినియోగిస్తున్నాయని తెలిపింది.ముఖ్యంగా తక్కువ క్రెడిట్ స్కోర్ ఉన్న సబ్ ప్రైమ్ రుణగ్రహీతల్లో ఈ మార్పు మరింత స్పష్టంగా కనిపిస్తోందని జేపీ మోర్గాన్ పేర్కొంది.గోల్డ్ లోన్లలో మొండి బకాయిలు తక్కురిటైల్ క్రెడిట్ విభాగాల్లో గోల్డ్ లోన్లకు అత్యల్ప బ్యాడ్ లోన్ నిష్పత్తి ఉందని జేపీ మోర్గాన్ తెలిపింది. ఇది సుమారు 0.2 శాతంగా ఉండగా, గృహ, వాహన రుణాల్లో 0.5-0.6 శాతం, అరక్షిత రుణాల్లో 1 శాతానికి పైగా ఉంది. సాధారణంగా 55-65 శాతం లోన్‌టువాల్యూ వద్ద రుణాలు ఇవ్వడం వల్ల రుణదాతలకు తగిన భద్రత ఉంటుందని వివరించింది. 2026 ఏప్రిల్ నుంచి అమల్లోకి వచ్చిన కొత్త నిబంధనల ద్వారా బంగారం తాకట్టుపై రుణాలకు సంబంధించిన గరిష్ఠ విలువకు తగ్గరుణం ఎల్టీవీ పరిమితులను వివిధ స్థాయిల్లో పెంచడంతో పాటు, తాకట్టు బంగారం విలువ నిర్ధారణ విధానాన్ని కఠినతరం చేశారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.